# ఆర్గాన్ న్యూస్

VOICE OF DEMOCRACY

తెలుగు దినపత్రిక

సంపుటి :17 సంచిక :105 ఖమ్మం, తెలంగాణ శుక్రవారం 02.05.2025 పేజీలు :12, వెల : 2/-

Circulating to : Hyderabad, Khammam, Warangal, Nalgonda, Karimnagar, Adilabad, Medak and Mahabubnagar



## విలేకరులు కావలెను

ప్రజా సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి "ఆర్గాన్ న్యూస్" ఛానల్, దినపత్రిక ఆహ్వానం పలుకుతోంది. పని చేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని అన్ని నియోజకవర్గాల నుంచి రిపోర్టర్లు కావలెను.

పూర్తి వివరాలకు సంప్రదించండి

98481 56178






# కులగణనలో తెలంగాణ రోల్ మాడల్

## మా అనుభవాన్ని ఉపయోగించుకోండి

- మేం అనేక రకాలుగా కసరత్తు చేసి అనుభవం పొందాం
- రాహుల్ డిమాండ్‌కు కేంద్రం తలొగ్గక తప్పలేదు
- పలు రకాల కమిటీలు వేసి స్పష్టంగా ముందుకు వెళ్లాలి
- ఏడాది కాలపరిమితిలో గణనను పూర్తి చేయాలి
- కేంద్రానికి సీఎం రేవంత్‌రెడ్డి సూచనలు

కులగణనలో తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందని, రాహుల్ డిమాండ్‌కు కేంద్రం తలొగ్గక తప్పలేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ ప్రక్రియను ఎప్పుడు ప్రారంభించి ఎప్పుడు ముగిస్తారో వెల్లడించాలని... ఏడాది గడువులోగా పూర్తిచేసి అద్భుతాలు సృష్టించవచ్చని అన్నారు. తెలంగాణ చేసిన కులగణనతో దేశానికి లాభం జరిగిందని అన్నారు. గురువారం సీఎం విలేకరులతో మాట్లాడారు.

**హైదరాబాద్, మే 1 :** తెలంగాణ రాష్ట్రాన్ని యూనిట్‌గా కుల గణన చేయడం అత్యంత అవసరం అని రేవంత్ రెడ్డి చెప్పారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో కులం, వర్గం ఉందని ఆయన వివరించారు. ఆయన చేసిన సర్వే 8 పేజీల ప్రశ్నావళి ద్వారా రూపొందించబడింది. ఈ సర్వేలో ప్రైవసీ యాక్ట్‌ను కూడా అనుసరించామని, 95 వేల మంది ఎన్యూమరేటర్లను నియమించి, సర్వే మానిటరింగ్ కోసం సూపర్ వైజర్లు నియమించామని తెలిపారు. సర్వేలో 3 శాతం మంది పాల్గొనకపోవడం వల్ల తిరిగి వారికి అవకాశం ఇచ్చామనీ, తెలంగాణ మోడల్ దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.

మిగతా 2 లో



## సమ్మె ఆలోచన విరమించుకోండి

- ఆర్టీసీ ఇప్పుడిప్పుడే గట్టెక్కుతోంది
- సంస్థను కాపాడుకునే బాధ్యత మనదే
- గత అప్పులకు వడ్డీల కోసం అప్పులు చేస్తున్నాం
- మేడే ఉత్సవాల్లో సీఎం రేవంత్ రెడ్డి

03

# ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా భారత్

- వేవ్స్ సదస్సు ప్రారంభంలో ప్రధాని మోడీ
- హాజరైన చిత్రరంగ ప్రముఖులు

భారత్ ఎంటర్‌టైన్ మెంట్ హబ్‌గా మారుతుందని భారత్ ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. ముంబయిలో జరుగుతున్న వేవ్స్ సమ్మిట్ ను మోడీ ప్రారంభించారు. వేవ్స్ సదస్సుకు సినీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సృజనాత్మక హబ్ గా తయారై కొత్త అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. సంప్రదాయ, నవతరాలను సమన్వయం చేయాలని సూచించారు.



03



## ఉగ్రవాదులను వెంటాడి వేటాడి పట్టుకుంటాం

కేంద్రమంత్రి అమిత్ షా హెచ్చరిక

03

## తెలుగులో రాసిన వారికి మార్కులెలా కేటాయించారు

టీజీపీఎస్సీని ప్రశ్నించిన న్యాయస్థానం



03



## భూభారతిపై విస్తృత అవగాహన

పోర్టల్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న మంత్రి పొంగులేటి

03

# కులగణను ఏనాడూ పట్టించుకోని కాంగ్రెస్

- తెలంగాణలోనూ తూతూ మంత్రంగా సర్వే
- ఎవరో డిమాండ్ చేస్తే తీసుకున్న నిర్ణయం కాదు
- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, మే 1 :** బీసీలకు న్యాయం చేయడానికి భాజపా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. స్వతంత్ర భారతదేశంలో ఇప్పటి వరకు కులగణన జరగలేదని, దేశాన్ని దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఆ ఊసే ఎత్తలేదని అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. మండల్ కమిషన్ నివేదికను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పక్కకు పెట్టిందన్నారు. హస్తం పార్టీ బీసీలను పక్కకుపెట్టి ముస్లింలకు ప్రాధాన్యత ఇస్తోందని దుయ్యబట్టారు. జనగణనలో కులగణన చేర్చాలని సుష్మాస్వరాజ్ ఆనాటి ప్రధానికి లేఖ రాశారు. దేశంలో కులగణన జరిగితే బీసీలకు సామాజిక, ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయి. ఏ సామాజిక వర్గం వెనకబడి



ఉందో గుర్తించవ చ్చు. వెనకబడిన వర్గాల వారికి ప్రత్యేక పథకాలు రూపొందించేందుకు ఉపయోగ పడుతుంది. కులగణన నిర్ణయం తమ విజయంగా కాంగ్రెస్ పార్టీ గొప్పలు చెప్పుకొంటోంది.

మిగతా 2 లో



## కులగణనపై దిగజారుడు రాజకీయాలు

- కేంద్ర మంత్రులపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ధ్వజం

**హైదరాబాద్, మే 1 :** రాష్ట్ర ప్రభుత్వం చేసిన కులగణన తప్పుల తడక అని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు మాట్లాడటం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ధ్వజమెత్తారు. "భారాసతో దోస్తీ కట్టి కాంగ్రెస్ ప్రభుత్వంపై నిత్యం విషం కక్కడం భాజపా నేతలకు అలవాటుగా మారింది" అని ఆరోపించారు. దేశవ్యాప్తంగా కులగణన ఎప్పుడు చేపడతారో కేంద్రం ప్రకటించాలని

మిగతా 2 లో



# రైతులను వెంటాడుతున్న వానగండం

- పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న పంటలు
- భూపాలపల్లి, ఖమ్మం జిల్లాల్లో మామిడి, బొప్పాయికి నష్టం

04



## ప్రతికూల పరిస్థితులతో రెస్క్యూ ఆపరేషన్ నిలిపివేత

- వచ్చే మార్చినాటికి పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేస్తాం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

03

## కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

జనన, మరణ ధ్రువీకరణ రికార్డులతో ఓటర్ అనుసంధానం

03



## వెలుతురు ఉన్నంత వరకు ఎర్రజెండా ఉంటుంది

- దేనికి లొంగని వారే కమ్యూనిస్టులు
- ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న
- సమాజానికి ఎర్రజెండా అవసరం : జూలకంటి
- మిర్యాలగూడలో మేడే భారీ ప్రదర్శన

04

## కేటీఆర్‌కు లండన్ ఆహ్వానం

ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ నుంచి పిలుపు



03




11

## జీఎస్టీ వసూళ్లలో ఆల్‌టైమ్ రికార్డ్

## లోన్ రికవరీ ఏజెంట్ల వేధింపులు

02

తమిళనాట రైతు బలవన్మరణం

## భారీగా దిగొచ్చిన పసిడి ధర..

రూ.2వేల పైన తగ్గిన బంగారం


11



# కులగణనలో తెలంగాణ రోల్ మాడల్

(మొదటిపేజీ తరువాయి)

ఈ మేరకు కేంద్రమంత్రి మోడీకి రేవంత్ రెడ్డి సలహా ఇస్తూ...కేబినెట్ మంత్రులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి, టర్మ్ ఆఫ్ రిఫరెన్స్‌ను రూపొందించండని ఆయన పేర్కొన్నారు. అలాగే, కుల గణనను సమాజానికి ఎక్స్-రే లాంటిదిగా భావించారు, దీనికి సంబంధించిన ఎక్స్‌పర్ట్ కమిటీని ఏర్పాటు చేయాలని రాహుల్ గాంధీ సూచించారు. మేము 57 ప్రశ్నలు 8 పేజీల ప్రశ్నావళిలో రూపొందించాం. ప్రజల సమాచారాన్ని గోప్యంగా ఉంచాము. కేవలం ఆయా కులాల పర్సంటేజ్ మాత్రమే ఇచ్చామని రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్రం దీనికి మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, కుల గణనకు ముందు వచ్చిన కేంద్రానికి అభినందనలు తెలిపారు. జనగణనతో పాటు- కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కేంద్రం నిర్ణయంపై రాజకీయాలు మాట్లాడదల్చుకోలేదని వెల్లడించారు. కుల గణనపై తెలంగాణ రాష్ట్రానికి అవగాహన ఉందన్నారు. కుల గణన కోసం దేశ వ్యాప్తంగా ఒక కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో కులం ఒక్కో జాబితాలో ఉందని తెలిపారు. కుల గణన కోసం మంత్రులతో ఒక కమిటీ ఏర్పడి చేయాలని.. అధికారులతో, నిపుణులతో ఒక కమిటీ వేసి అధ్యయనం చేయాలని సూచించారు. కులగణన కోసం తెలంగాణ మోడల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని కేంద్రానికి తెలిపారు. మంత్రుల కమిటీ- వెంటనే నియమించాలన్నారు. మంత్రుల కమిటీకి తోడుగా నిపుణుల కమిటీని వేయాలన్నారు. ఈ రెండు కమిటీలతో దేశవ్యాప్తంగా అధ్యయనం చేయించాలని తెలిపారు. అలాగే ఈ వ్యవహారమంతా ఏడాదిలోగా పూర్తి చేయించాలన్నారు. తాము ప్రజల నుంచి, ప్రజా సంఘాల నుంచి అనేక విషయాలు, సూచనలు తీసుకొని కులగణన చేశామన్నారు. కుల గణన కోసం 95,000 ఎన్యూమరేటర్లను నియమించామని.. పది మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్ వైజర్‌ను నియమించినట్లు- చెప్పారు. మంత్రుల కమిటీ- ఎప్పటికప్పుడు పర్యవేక్షించిందన్నారు. కుల గణన చేసిన తర్వాత పబ్లిక్ డొమైన్‌లో పెట్టామని.. కుల గణనలో పాల్గొనని వాళ్ళకి మరోసారి అవకాశం ఇచ్చామన్నారు. మూడు నెలల్లోనే ఎలాంటి ఇబ్బందులు రాకుండా కుల గణన చేశామని తెలిపారు. కుల గణన విషయంలో కేంద్రంతో కలిసి నడవడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కుల గణన విషయంలో కేంద్రానికి వచ్చే సందేహాలకు సమాధానం ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు- తెలిపారు. 1931 తర్వాత కుల గణన చేసింది తెలంగాణ ప్రభుత్వమే అని అన్నారు. కుల గణన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్రానికి అన్ని



రకాలుగా మద్దతు ఇస్తామని పేర్కొన్నారు. కుల గణన ఎప్పుడూ మొదలు పెడతారో మోదీ చెప్పాలన్నారు. ఎప్పటి లోగా కుల గణన చేస్తారని ప్రశ్నించారు. కుల గణన సీక్రెట్ డాక్యుమెంట్ కాదని.. కుల గణన విధివిధానాలు బయట పెట్టాలన్నారు. 50 శాతం పరిధి పెంచి రిజర్వేషన్లు ఇవ్వాలని బిల్లు పెట్టి ఆమోదించామన్నారు. తెలంగాణ బలహీన వర్గాల తరఫున రాహుల్ గాంధీకి ధన్యవాదాలు తెలియజేశారు. రాహుల్ సూచనల మేరకు కుల గణన నిర్వహించామని.. కుల గణన క్రెడిట్ రాహుల్ గాంధీదే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. తాము కులగణనపై దేశానికి మార్గదర్శకంగా నిలిచామని స్పష్టం చేశారు. దేశంలోని అనేక పార్టీలు కులగణన కోరుతున్నాయని, కులగణన చేయాలని ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించాయని అన్నారు. తెలంగాణలో బీసీలుగా ఉన్న బోయలు.. కర్ణాటకలో మరో వర్గంలో ఉన్నారు. రాష్ట్రంలో 8వేల పేజీల్లో 57 ప్రశ్నల ద్వారా మేం వివరాలు సేకరించాం. కులగణన విషయంలో తెలంగాణ అనుభవం కేంద్రానికి ఉపయోగపడుతుంది. ఎన్యుమరేటర్ నుంచి సీఎస్ వరకు పలుమార్లు సమీక్ష నిర్వహించాం. అనేక సలహాలు, సూచనలు వచ్చాయి. టోల్‌ఫ్రీ నంబర్ ఇవ్వడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం కల్పించాం. రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా కులగణన చేపట్టాం. తెలంగాణ మోడల్ తీసుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నాం. అన్ని రాష్ట్రాలకు నిపుణుల కమిటీని పంపాలి. ప్రతి రాష్ట్రంతో మాట్లాడి ఆయా ప్రభుత్వాల సూచనలు తీసుకోవాలి. ఈ విషయంలో కేంద్రం, రాష్ట్రాలు కలిసి పనిచేయాలి.
స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలి. కులగణన పూర్తయ్యాక ఏం చేస్తారో స్పష్టంగా చెప్పాలని కేంద్ర ప్రభుత్వానికి రేవంత్ సూచించారు.

## దూకుడు పెంచిన ఏసీబీ

### ఏప్రిల్‌లో రికార్డుస్థాయిలో 21 కేసులు

**హైదరాబాద్, మే 1 :** తెలంగాణ రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ దూకుడు పెంచింది. అవినీతి, అక్రమాస్తుల విషయాల్లో కేసుల నమోదుతో దూసుకెళ్తుంది. కేవలం ఒక్క ఏప్రిల్ నెలలో మొత్తం 21 కేసుల నమోదు అయ్యాయి. 13 ఏసీబీ ట్రాప్ కేసులు, 2 అక్రమాస్తుల కేసులు, 2 క్రిమినల్ దుష్ప్రవర్తన కేసులు, 2 ఆశ్చర్యపరిచే తనిఖీ కేసులు, 2 సాధారణ కేసులు చేసినట్లు- ప్రకటించింది. 20 మంది ప్రభుత్వ ఉద్యోగులు అరెస్ట్, రిమాండ్ చేయబడ్డారు. కాగా, 5. 02 లక్షల సొమ్మును ఏసీబీ సీజ్ చేసింది. ఒక అధికారి ఇంట్లో సోదాలు చేసి 3.51 కోట్ల రూపాయల అక్రమాస్తులను గుర్తించింది. మాజీ ఊకఈ హరిరామ్ అక్రమాస్తులు మార్కెట్ వాల్యూ ప్రకారమ్ 13.50 లక్షల ఆస్తులుగా గుర్తించారు. లంచం డిమాండ్ చేస్తే 1064 కాల్ చేయాలని తెలంగాణ అవినీతి నిరోధక శాఖ అధికారులు పేర్కొన్నారు.

## లోన్ రికవరీ ఏజెంట్ల వేధింపులు

### తమిళనాట రైతు బలవన్మరణం

**చెన్నై, మే 1 :** లోన్ రికవరీ ఏజెంట్ల వేధింపులకు ఒక రైతు బలయ్యాడు. వేధింపులు భరించలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన తమిళనాడులోని సేలం జిల్లాలో జరిగింది. తమిళనాడు రాష్ట్ర అసెంబ్లీలో బలవంతపు రికవరీ పద్ధతులను అరికట్టడానికి బిల్లును ఆమోదించిన రెండు రోజులకే ఈ మరణం సంభవించింది. జిల్లాలోని వళపడికి చెందిన తుక్కియంపాలయం నివాసి అయిన 55 ఏళ్ల వడివేలు, తన భూమిని తాకట్టుపెట్టి ఓ ప్రైవేట్ బ్యాంక్ నుంచి రూ. 4.80 లక్షల అప్పు తీసుకున్నాడు. ఏప్రిల్ 10న వాయిదా చెల్లించకపోవడంతో, మంగళవారం బ్యాంక్ లోన్ రికవరీ ఏజెంట్లు- వడివేలుని వేధించడం ప్రారంభించారు. బకాయి చెల్లించడానికి గడువు ఇవ్వడానికి కూడా నిరాకరించారు. దీంతో వేధింపులు భరించలేక వడివేలు పురుగుల మందు తాగి మరణించినట్లు- సమాచారం. రైతు మరణంతో గ్రామ ప్రజల్లో ఆగ్రహావేశాలు నెలకున్నాయి. న్యాయం కోరుతూ రైతు మృతదేహాన్ని తీసుకోవడానికి నిరాకరించారు. ఆ తర్వాత వజపాడి పోలీసులు ప్రైవేట్ బ్యాంక్ మేనేజర్‌ని ప్రశ్నించేందుకు అదుపులోకి తీసుకున్నారు. దీంతో రైతు మృతదేహాన్ని తీసుకునేందుకు కుటుంబీకులు అంగీకరించారు.

## రాహుల్ గాంధీ ముందుచూపున్న నేత

- కులగణన డిమాండ్‌తో రాహుల్ సత్తా తేలింది
- మోడీకి ఈ ఐడియా ముందే ఎందుకు రాలే
- కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



**హైదరాబాద్, మే 1 :** రాహుల్ గాంధీ జోడో యాత్రలో దేశ ప్రజల సమస్యలకు పరిష్కారం చేసే దిశగా అడుగులు వేశారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. భారత్ జోడో యాత్రలో ప్రధాన అంశం కుల గణన.. కుల గణన చేయాలని రాహుల్ గాంధీ పదే పదే చెప్పారు.. ఇప్పుడున్న కేంద్రం కుల గణన చేస్తామని ప్రకటన చేయడం స్వాగతిస్తున్నాం.. రాహుల్ గాంధీ ముందు చూపుతో ఉన్నాడు అనడానికి కుల గణన ఒకటి.. దేశ రాజకీయాల్లో రాహుల్ గాంధీ హీరో.. రాష్ట్రంలో కుల గణన చేసినందుకు రేవంత్ రెడ్డి హీరో అని కొనియాడారు. ఇప్పుడు బీజేపీ వాళ్లు సంకలు గుద్దుకున్న లాభం లేదు.. రాహుల్ గాంధీకి ఎంత ముందు చూపు ఉందో అర్థం అవుతుంది.. మోడీ చేయకపోతే.. రాహుల్ గాంధీ ప్రధాని కాగానే ఆయనే చేసే వాడు అని జగ్గారెడ్డి తెలిపారు. అయితే, రాష్ట్రంలో కుల గణన లెక్కలోకి రాని వారు.. కేంద్ర కులగణనలో లెక్కకు వస్తారు అని జగ్గారెడ్డి పేర్కొన్నారు. రెండేళ్ల క్రితమే మోడీ చెప్తే బాగుండేది అనుకుంటున్నారు.. రాహుల్ గాంధీకి క్రెడిట్ వస్తుందని బీజేపీ నేతలకు మింగుడు పడటం లేదు.. రాహుల్ గాంధీ అనే వరకు మోడీ ఎందుకు ఎదురు చూశాడని ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి వచ్చిన ఐడియా మోడీకి ఎందుకు రాలేదంటూ సెటైర్లు వేశాడు. బీజేపీ వాళ్ళ లెక్క పదవుల కోసం ఎదురు చూసే రకం కాదు రాహుల్ కుటుంబం.. వాళ్ళే ప్రధాన మంత్రులను చేస్తారు.. కొందరికి భయం ఉంటది.. రేవంత్ కుల గణన చేసి మార్కులు కొట్టి పడేశాడన్నారు. రేవంత్ కూడా అదృష్టవంతుడు.. రాహుల్ గాంధీ లైన్ లో వెళ్లి జాక్ పాట్ కొట్టేశాడు అని టీ-పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. ఇక, కిషన్ రెడ్డి ఇప్పుడు ఏం అన్నా లాభం లేదు అని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి చెప్పారు. సుష్మ స్వరాజ్ 2010లో అంటే.. ఇప్పటి వరకు ఎందుకు చేయలేదు మీరు.. మీరేం చెప్పినా కుల గణన హీరో రాహుల్ గాంధీ.. కుల గణనలో ఇతర మతాల వారు ఉండరని కిషన్ రెడ్డి కాదు మోడీ చెప్పాలన్నారు. కిషన్ రెడ్డికి ఇష్టం లేదు కదా అని వదిలేస్తారా..?.. ప్రధాని ఏం చెప్తారో చూసి మాట్లాడదాం.. ముస్లింలు భారత దేశ పౌరులు కదా..? అని ప్రశ్నించారు. దేశంలో పుట్టిన హిందూ, ముస్లిం, క్రిస్టియన్లు అంతా భారత దేశ బిడ్డలే కదా అని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

## నేడు రాజ్‌భవన్‌కు కాంగ్రెస్ నేతలు

### బిసి బిల్లు ఆమోదించినందుకు గవర్నర్‌కు కృతజ్ఞతలు

**హైదరాబాద్, మే 1 :** రాజ్‌భవన్‌లో శుక్రవారం ఉదయం 10:30 గంటలకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతలు కలవనున్నారు. ఏప్రిల్ 8వ తేదీన బీసీలకు రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ శాసన సభలో చేసిన బిల్లుకు ఆమోదం తెలపడంతో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకి కాంగ్రెస్ బీసీ నేతలు ధన్యవాదాలు తెలపనున్నారు. ఉదయం రాజ్ భవన్ తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతల్లో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో పాటు- మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, కేశవరావు ,మధుయాష్కి గౌడ్, అంజన్ కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, దండే విఠల్, విజయశాంతి, నారాయణ, ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, వాకటి శ్రీహరి, మక్కన సింగ్ రాజ్ ఠాకూర్, ఈర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఇతర ముఖ్య నేతలు ఉన్నారు.

## రాజ్‌నాథ్‌తో అమెరికా రక్షణమంత్రి సంభాషణ

### భారత్‌కు సంఘీభావం ప్రకటించిన మంత్రి



**న్యూఢిల్లీ, మే 1 :** భారత రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్ కు అమెరికా డిఫెన్స్ సెక్రటరీ పీట్ హెగ్సేత్ ఫోన్ ద్వారా మాట్లాడారు. జమ్మూ, కశ్మీర్ పహల్గాంలో అమాయక పౌరులను చంపడంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. భారత పౌరులకు జరిగిన నష్టానికి ఆయన తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అమెరికా భారతదేశంతో సంఘీభావంగా నిలుస్తుందని చెప్పారు. భారతదేశం తనను తాను రక్షించుకునే హక్కుకు అమెరికా ఎప్పుడూ మద్దతు ఇస్తుందని కార్యదర్శి హెగ్సేత్ అన్నారు. ఉగ్రవాదంపై భారతదేశం చేస్తున్న పోరాటంలో అమెరికా ప్రభుత్వం యొక్క సంపూర్ణ మద్దతును ఆయన పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా రాజ్ నాథ్ సింగ్.. పాకిస్థాన్ ఎంతో కాలంగా చేస్తున్న అకృత్యాలని పీట్ హెగ్సేత్ కు వివరించారు. పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఇవ్వడం, శిక్షణ ఇవ్వడం, నిధులు సమకూర్చే చరిత్రను కలిగి ఉందని రాజ్ నాథ్ వివరించారు. ప్రపంచ సమాజం ఇలాంటి దారుణమైన ఉగ్రవాద చర్యలను స్పష్టంగా, నిస్సందేహంగా ఖండించడం పిలుపునివ్వడం చాలా ముఖ్యమని ఆయన అన్నారు.

## కులగణనపై దిగజారుడు రాజకీయాలు

(మొదటిపేజీ తరువాయి)

గురువారం ఆయనొక ప్రకటనలో డిమాండ్ చేశారు. "కులగణనపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో రాహుల్‌గాంధీ సంకల్పం సిద్ధించింది. ఆయన ఆలోచన మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల బృందం కులగణనను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించింది. శాసనసభలో భాజపా ఎమ్మెల్యేల సాక్షిగా ఏకగ్రీవ తీర్మానంతో బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాం. బీసీలపై భాజపాకు చిత్తశుద్ధి ఉంటే పార్లమెంటులో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలి. 50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేసేలా చట్టం చేయాలి. బీసీ బిల్లు చట్టబద్ధత కోసం తెలంగాణ భాజపా నేతలు ప్రధాని మోదీకి లేఖ రాయగలరా? పారదర్శక సర్వేపై తప్పుడు ఆరోపణలు చేయడానికి బీసీ బిడ్డగా బండి సంజయ్ ఆత్మ పరిశీలన చేసుకోవాలి. స్వతంత్ర భారతావనిలో కులగణన నిర్వహించిన మొదటి రాష్ట్రం తెలంగాణ. చరిత్రాత్మక కులగణన, ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల నిర్ణయాలతో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచింది" అని మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.

## దేశంలో బీసీల శకం ఆరంభమైంది : ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, మే 1 :** 'జనగణనలో కులగణన విషయమై నాటి ఇందిరాగాంధీ కాలం నుంచి విస్తృత చర్చలు, పోరాటాలు జరుగుతున్నప్పటికీ ఆచరణ సాధ్యం కాలేదు. బీసీలపై ప్రధాని మోదీకి ఉన్న ప్రేమ, చిత్తశుద్ధి వల్లే నేడు సాకారమైంది. కులాల లెక్కలు తీయడం ద్వారా బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధతతోపాటు అనేక విజయాలు సొంతం కానున్నాయి' అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఇది బీసీల మొదటి విజయమని, దేశంలో వారి శకం ఆరంభమైందని పేర్కొన్నారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేశ్‌ల అధ్యక్షతన 40 బీసీ సంఘాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్యను సన్మానించారు. సమావేశంలో పలు కుల సంఘాల బాధ్యులు లాలుకోట వెంకటాచారి(విశ్వబ్రాహ్మణ సంఘం), మేకల రాములుయాదవ్(యాదవ హక్కుల పోరాట సమితి), కొండ దేవయ్య (మున్నూరుకాపు సంఘం), మల్లేశ్(వంశరాజ్ సంఘం), శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మరో 25 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 'స్లాట్'

- ఈ నెల 12 నుంచి అమలులోకి..
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, మే 1 :** స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో పైలట్ ప్రాజెక్టు కింద ప్రవేశపెట్టిన స్లాట్ విధానాన్ని ఈ నెల 12వ తేదీ నుంచి మరో 25 కార్యాలయాల్లో అమలులోకి తేనున్నామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. గత నెల 10వ తేదీ నుంచి 22 కార్యాలయాల్లో అమలు చేస్తున్న స్లాట్ విధానానికి మంచి స్పందన లభించిందని తెలిపారు. గత నెలాఖరుకు రోజుకు సగటున 866 దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. రెండో దశలో ఫరూఖ్ నగర్, షాద్‌నగర్, మహేశ్వరం, వనస్థలిపురం, శేరిలింగంపల్లి, ఉప్పల్, ఘట్‌కేసర్, నారపల్లి, మల్కాజిగిరి, జనగామ, ఘన్‌పూర్, నర్సంపేట, బీబీనగర్, మంచిర్యాల, పెద్దపల్లి, కల్వకుర్తి, వనపర్తి, గద్వాల, గజ్వేల్, సిద్దిపేట అర్బన్, రూరల్, రంగారెడ్డి, వరంగల్, హైదరాబాద్, హైదరాబాద్ దక్షిణ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పైలట్ కింద స్లాట్ విధానం అమలు చేస్తామని వివరించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 22 కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్‌పై అధికారులను అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యాలయాల సేవలపై పోస్టు కార్డు ద్వారా అభిప్రాయాలు తీసుకోగా.. 94 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా చంపాపేట్‌కు చెందిన విష్ణుగౌడ్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడి స్పందన తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్లకు వినియోగించే ఇంటర్నెట్ వేగాన్ని పెంచాలని అధికారులకు మంత్రి సూచించారు. జూన్ మూడో వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్యాలయాల్లో స్లాట్ విధానం అమల్లోకి తేవాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగం పెంచేందుకు ఆధార్-ఈ సంతకం ప్రవేశపెడతామన్నారు. నూతన విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న సిబ్బంది, అధికారులకు మంత్రి అభినందనలు తెలిపారు. సమావేశంలో రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్, సీసీఎల్ఏ కార్యదర్శి మంద మకరంద్, మీ సేవ డైరెక్టర్ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు. మరో సమావేశంలో సర్వే, భూమి కొలతల శాఖ అధికారులతో మంత్రి సమీ క్షించారు. కొత్తగా ఎంపిక చేయనున్న సర్వేయర్లకు సంబంధించి విధివిధానాలు, కావాల్సిన సర్వే పరికరాలు తదితర అంశాలపై మంత్రి సమీక్షించారు.

## ఎల్ఆర్ఎస్ గడువు మరో 3 రోజులు పొడిగింపు

**హైదరాబాద్, మే 1 :** ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకాన్ని మరో మూడు రోజులు పొడిగించారు. ఈ మేరకు పురపాలక పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో అనధికారిక స్థలాల క్రమబద్ధీకరణను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం 25% రాయితీతో ఓటీఎస్ పథకాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. వాస్తవానికి 2020లోనే నాటి ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పథకం ప్రకటించింది. అప్పట్లో మొత్తం 25,67,107 దరఖాస్తులు రాగా వాటిలో గత ఏడాది చివరి వరకు సుమారు ఎనిమిది లక్షల దరఖాస్తులను మాత్రమే పరిష్కరించారు. మిగతా వాటిని కూడా త్వరితగతిన పరిష్కరించే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో 25% రాయితీతో ఓటీఎస్ ప్రకటించింది. వాస్తవానికి దీని గడువు మార్చి చివరి నాటికే ముగిసిపోగా దరఖాస్తుదారుల వినతులను దృష్టిలో ఉంచుకొని ఏప్రిల్ చివరి వరకు పొడిగించారు. ఈ గడువు కూడా బుధవారంతో ముగిసిపోవడంతో మరో మూడు రోజులు అంటే మే 3వ తేదీ వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## కర్రెగుట్టల కేంద్రంగా రెండు బేస్ క్యాంపులు

- పదో రోజూ కొనసాగిన ఆపరేషన్
- ఛత్తీస్‌గఢ్ సీఎంను కలిసిన నక్సల్స్ బాధిత కుటుంబాలు

**చర్ల :** ఛత్తీస్‌గఢ్ పామునూరు గుట్టలతోపాటు కర్రెగుట్టల్లోనూ బేస్ క్యాంపులు ఏర్పాటు చేసే యోచనలో బలగాలు ఉన్నాయి. మరోవైపు కర్రెగుట్టల్లో భద్రతా బలగాల ఆపరేషన్ గురువారం పదో రోజూ కొనసాగింది. నంబి, గల్గం, పూజారికాంకేర్, గుంజపర్తి ప్రాంతాల్లో ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు బాంబుల మోత వినిపించినట్లు ఆయా గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. నంబి నుంచి హెలికాప్టర్ల రాకపోకలు కొనసాగినట్లు స్థానికులు తెలిపారు. గుట్ట పరిసరాల్లో మావోయిస్టులు అమర్చిన ఐఈడీలను బలగాలు వెలికితీస్తున్నాయి. ఇప్పటికే బలగాలు దోబే, నీలం సరాయ్ కొండలను తమ అధీనంలోకి తెచ్చుకున్నాయి. మరో అడుగు ముందుకేసి గుట్టను పూర్తిగా చుట్టుముట్టేందుకు పెద్దసంఖ్యలో బలగాలతో ఆపరేషన్‌ను తీవ్రం చేశాయి. కర్రెగుట్టలపై మోహరించిన బలగాలను కిందకి రప్పించి కొత్తవారిని అక్కడికి చేర్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇక్కడి కొండపల్లిలో కొత్త మొబైల్ టవర్‌ను సైతం ప్రారంభించారు. ఇదే సమయంలో మావోయిస్టు కీలక నేతలతో కూడిన కొన్ని బృందాలు ఈ ప్రాంతం నుంచి తప్పించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. బస్తర్ దండకారణ్యానికి చెందిన నక్సల్స్ బాధిత కుటుంబాల వారు ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయిని కలిశారు. ఆపరేషన్ కగార్‌తో తమ ప్రాంతాన్ని నక్సల్స్ రహితంగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆ రాష్ట్ర గవర్నర్‌కు వినతిపత్రమిచ్చారు. వారి వెంట హోంమంత్రి విజయశర్మ ఉన్నారు.

## టెట్‌కు 1.83 లక్షల దరఖాస్తులు

**హైదరాబాద్, మే 1 :** ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు మొత్తం 1,83,653 దరఖాస్తులు అందాయి. దరఖాస్తుల గడువు ఏప్రిల్ 30 అర్ధరాత్రి 12 గంటలకు ముగిసింది. దరఖాస్తులు ఈసారి 1.50 లక్షలు దాటకపోవచ్చని విద్యాశాఖ వర్గాలు అంచనా వేయగా... చివరి 30 గంటల్లో ఏకంగా 50 వేల వరకు అందాయి. అందులోనూ చివరి రెండు గంటల్లో 18,492 మంది దరఖాస్తు చేశారు. పేపర్-1కు 63,261 మంది, పేపర్-2కు 1,20,392 మంది దరఖాస్తు చేశారు. వారిలో రెండు పేపర్లకు దరఖాస్తు చేసిన వారు 15 వేల మంది వరకున్నారు. జనవరిలో నిర్వహించిన టెట్‌కు 2,75, 775 మంది దరఖాస్తు చేసుకున్నారు. అంటే ఈసారి 92,122 దరఖాస్తులు తగ్గాయి. ఇప్పటికే ఎస్‌జీటీలుగా పనిచేస్తున్న వారిలో చాలామంది స్కూల్ అసిస్టెంట్ పోస్టు కోసం మళ్లీ టెట్‌కు దరఖాస్తు చేయడం విశేషం.

## నేడు దోస్త్ షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్, మే 1 :** రాష్ట్రంలో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్-తెలంగాణ(దోస్త్) ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో చేరేందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి శుక్రవారం షెడ్యూల్ జారీ చేయనుంది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి గురువారమే షెడ్యూల్ విడుదల చేయాల్సి ఉంది. రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన దిల్లీ వెళ్లిన నేపథ్యంలో శుక్రవారానికి వాయిదా వేశారు.

## పెరిగిన పాలిసెట్ దరఖాస్తులు

**హైదరాబాద్, మే 1 :** రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరం(2025-26) పాలిటెక్నిక్ విద్యలో ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్-2025కు ఈసారి 1.07 లక్షల దరఖాస్తులు అందాయి. గత ఏడాది 92,808 మంది దరఖాస్తు చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అధ్యాపకులతో ప్రచారం చేయించడంతో ఈసారి 15% దరఖాస్తులు పెరిగాయని పాలిసెట్ కన్వీనర్ పుల్లయ్య తెలిపారు.

## ఆస్కీ పీజీడీఎం విద్యార్థులకు ప్రాంగణ కొలువులు

**హైదరాబాద్, మే 1 :** హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఆస్కీ) పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ విద్యార్థులందరికీ ప్రాంగణ నియామకాలు దక్కాయని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ ఎన్.రమేశ్‌కుమార్ తెలిపారు. బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీటెక్ తదితర కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు పీజీడీఎంలో చేరారన్నారు. ప్రపంచవ్యాప్తంగా సవాళ్లు కొనసాగుతున్నా ప్రాంగణ నియామకాల్లో తమ విద్యార్థులు మంచి వేతనంతో ఉద్యోగాలకు ఎంపికయ్యారని చెప్పారు. అత్యధికంగా రూ.13 లక్షల వార్షిక వేతనం పొందారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## 'పది' అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ షెడ్యూల్ జారీ

**హైదరాబాద్, మే 1 :** పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వ పరీక్షల విభాగం గురువారం విడుదల చేసింది. జూన్ 3న ప్రథమ, 4న ద్వితీయ భాష, 5న ఆంగ్లం, 6న గణితం, 9న భౌతికశాస్త్రం, 10న జీవశాస్త్రం, 11న సాంఘికశాస్త్రం పరీక్షలు జరుగుతాయి. 12, 13 తేదీల్లో ఓరియంటల్ లాంగ్వేజ్ పరీక్షలు ఉంటాయి.

# సమ్మె ఆలోచన విరమించుకోండి

- ఆర్టీసీ ఇప్పుడిప్పుడే గట్టెక్కుతోంది
- సంస్థను కాపాడుకునే బాధ్యత మనదే
- గత అప్పులకు వడ్డీల కోసం అప్పులు చేస్తున్నాం
- మేడే ఉత్సవాల్లో సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మే 1 :** ఆర్టీసీ కార్మికులు సమ్మె ఆలోచన వీడండని మే డే వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఇప్పుడిప్పుడే ఆర్టీసీ లాభాల బాటలో పయనిస్తోంది.. ఇది మీ సంస్థ.. దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆర్టీసీ కార్మికులపైనే ఉంది అన్నారు. గత పదేళ్లలో విధ్వంసం జరిగింది.. రాష్ట్రంలో ఆర్థిక దోపిడీ కొనసాగిందన్నారు. ఆర్టీసీ కార్మికులు పంతాలు, పట్టింపులకు పోకండి.. ఏదైనా సమస్య ఉంటే మంత్రిగారితో చర్చించండి.. వచ్చే ఆదాయమంతా మీ చేతిలో పెడతాం.. ఎలా ఖర్చు చేద్దామో మీరే సూచన చేయండి అన్నారు. అణాపైసా కూడా నేను ఇంటికి తీసుకెళ్లేది లేదు.. మీ కోసమే ఖర్చు చేస్తాం.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదు.. అందుకే ఒకసారి ఆలోచించండి అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రవీంద్రభారతిలో నిర్వహించిన మేడే వేడుకల్లో సిఎం పాల్గొని ప్రసంగించారు. కష్టమైనా, నిష్ఠూరమైన ఉన్నది ఉన్నట్టు చెప్పాల్సిన బాధ్యత నాపై ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. సమ్మె పోటు రాష్ట్రానికి నష్టం చేస్తుంది.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే పట్టాలెక్కుతోంది.. మరో ఏడాదిలో కొంత కుదురుకుంటుంది.. పదేళ్లు ఏం చేయని వాళ్లు వచ్చి చెబితే వాళ్ల వలలో పడొద్దు.. వారి విషపు చూపుల్లో చిక్కుకోవద్దు అని సూచించారు. ఆర్టీసీ కార్మికులు నన్ను నమ్మండి.. నమ్ముకున్న మీకు అండగా ఉంటాను అని చెప్పుకొచ్చారు. వారానికి ఒకరోజు సెలవు.. కార్మికుల పోరాట ఫలితమే అన్నారు. ఇక, తెలంగాణలో ఆర్థిక మాంద్యం తక్కువ ఉందన్నారు. సింగరేణిలో ఔట్ సోర్సింగ్ కార్మికులకు మొదటి సారి మనమే బోనస్ ఇచ్చాం.. సింగరేణిని పదేళ్లు నిర్వీర్యం చేశారు .. కారుణ్య నియామకాలు సరళీకృతం చేశాం.. ఒక కుటుంబమే 7 లక్షల కోట్లు అప్పు చేసిందని ఆరోపించారు. కార్మికుల పట్ల ఎప్పుడైనా అనుకూలంగా మాట్లాడారా వాళ్ళు.. లక్ష రెండు వేల కోట్లు కాళేశ్వరం కాంట్రాక్టర్లకు ఇచ్చాడు.. కానీ కట్టిన మూడేళ్లకే కూలి పోయింది అని మండిపడ్డారు. కేసీఆర్ చేసిన అప్పులు కట్టడానికి లక్ష రెండు వేల కోట్లు అప్పు తెచ్చిన.. వడ్డీలు కట్టడానికే సరిపోతుంది.. ఏ పథకం అయినా ఆగిందా?.. అని ముఖ్యమంత్రి రేవంత్ ప్రశ్నించారు. ఇక, ఖజానా అంతా లూటీ చేసినా ఏ పథకం ఆగలేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పేద ప్రజల ఇండ్లో సన్న బియ్యం ఇస్తున్నాం.. గుజరాత్‌లో కూడా ఏడాదిలో 58 వేల ఉద్యోగాలు ఇచ్చారా?.. నేను ఇచ్చిన.. మనం దివాలా తీశాం.. కేసీఆర్ కుటుంబం మాత్రం కోట్లు- వెనకేసుకున్నారు అని ఆరోపించారు. గతంలో మీ ఫోన్ లు స్వేచ్ఛగా మాట్లాడుకున్నారా.. ఇప్పుడు స్వేచ్ఛగా మాట్లాడుకుంటున్నారు.. స్వేచ్ఛ, సంక్షేమం ఇచ్చినం మేమని ఆయన పేర్కొన్నారు. అయితే, ఆర్టీసీ కార్మికులు పంథానికి పోకండని సూచించారు. మిమ్మల్ని ఆదుకుంటాం.. మీ సమస్యలు మంత్రితో మాట్లాడండి.. లేదంటే నా దగ్గర ఉన్న ఖజానా మీకు ఇస్తా.. మీరే చూసి చెప్పండి అన్నారు. బడ్జెట్ పద్మనాభం లాగా తయారైంది నా పరిస్థితి అని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.




## కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

### జనన, మరణ ధ్రువీకరణ రికార్డులతో ఓటర్ అనుసంధానం

**న్యూఢిల్లీ, మే 1 :** ఓటర్ల జాబితాను నవీకరించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఓటర్ల జాబితాను జనన, మరణ ధ్రువీకరణ రికార్డులతో అనుసంధానం చేయనున్నట్లు ఇసి గురువారం ప్రకటించింది. ఓటర్ల జాబితాలో పవిత్రతను నిర్ధారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. భారత రిజిస్ట్రార్ జనరల్ నుండి ఎలక్ట్రానిక్‌గా ఎప్పటికప్పుడు మరణ నమోదు డేటాను సేకరించి, ఓటర్ల జాబితాను నవీకరిస్తామని వెల్లడించింది. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు మరణాల గురించి సకాలంలో సమాచారం అందుకుంటారని, మరణించిన వారి బంధువుల నుండి అభ్యర్థన వచ్చే వరకు వేచి చూడకుండా బూత్‌స్థాయి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి సమాచారాన్ని ధృవీకరించడానికి వీలు కలుగుతుందని పేర్కొంది. 1960 ఓటర్ల నమోదు నిబంధనలు, 1969 జనన మరణాల నమోదు చట్టం ప్రకారం ఇటు-వంటి సేకరించే అధికారం ఇసికి ఉంది. ఓటరు సమాచార స్లిప్ లను ఓటర్లకు నచ్చేలా మార్చేందుకు కొత్త డిజైన్‌లను రూపొందించాలని కూడా నిర్ణయించినట్లు- తెలిపింది. ఓటర్ సీరియల్ నెంబర్, పార్ట్ నెంబర్‌లను మరింత స్పష్టంగా కనిపించేలా ఫాంట్ సైజ్‌ను పెంచనున్నామని, దీంతో ఓటర్లు తమ పోలింగ్ స్టేషన్‌ను సులభంగా గుర్తించవచ్చని, పోలింగ్ అధికారులు ఓటర్ల జాబితాలో వారి పేర్లను సమర్థవంతంగా గుర్తించవచ్చని పేర్కొంది. ఎన్నికల నిబంధనలు- 1960, జనన, మరణాల నమోదు చట్టం-1969 ప్రకారం ఎన్నికల సంఘానికి ఈ సమాచారాన్ని తీసుకునే అధికారం ఉంది. ఓటరు సమాచార చీటీ మరింత స్పష్టంగా కనిపించేందుకు వీలుగా దాని డిజైన్‌ను మార్చాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. సీరియల్ నంబర్, పార్టు నంబర్ల సైజును పెంచనున్నట్లు- తెలిపింది. తద్వారా ఓటర్లు తమ పోలింగ్ స్టేషన్లను తేలికగా గుర్తించడంతో పాటు- అటు- పోలింగ్ అధికారులకు కూడా జాబితాలోని పేర్లను సులభంగా సరిచూసుకునే వీలుంటు-ంది. దీంతోపాటు- బూత్ స్థాయి అధికారులకు కూడా ఫొటో ఐడీ కార్డులను జారీ చేయనున్నట్లు ఈసీ వెల్లడించింది.

## కేటీఆర్‌కు లండన్ ఆహ్వానం

### ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ నుంచి పిలుపు



**హైదరాబాద్, మే 1 :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు మరో ప్రతిష్టాత్మక సమావేశానికి హాజరుకానున్నారు. జూన్ 20, 21 తేదీల్లో ఇంగ్లాండ్‌లో జరిగే ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సుకు ముఖ్యవక్తగా పిలుస్తూ ఆ సంస్థ ప్రత్యేకంగా కేటీఆర్‌ను ఆహ్వానించింది. 'భారత అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు' అనే థీమ్‌తో ఈ సంవత్సరం ఈ సదస్సును నిర్వహిస్తున్నట్టు ఆక్స్ ఫర్డ్ ఇండియా ఫోరం వ్యవస్థాపకులు సిద్ధార్థ్ సేఠీ తెలిపారు. కెటిఆర్ తన అనుభవాలను, ఆలోచనలను అంతర్జాతీయ విద్యార్థులు, వివిధ దేశాల నిపుణులతో పంచుకుం టే చర్చలు మరింత ఆసక్తికరంగా ఉంటడంతో పాటు- భారతదేశ అభివృద్ధి ప్రస్థానంలో భాగం అవ్వడానికి వారందరికీ స్ఫూర్తిగా ఉంటుందని సిద్ధార్థ్ సేఠి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రపంచ సమస్యలను పరిష్కరించడంతో పాటు భారత్‌లోని స్థిరమైన అభివృద్ధికి అత్యాధునిక సాంకేతికతలు ఎలా ఉపయోగపడతా యన్న అంశంపై ఈ సదస్సులో ప్రధానంగా వక్తలు చర్చిస్తారు. వివిధ దేశాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు, నిపుణుల సమక్షంలో భారతదేశ ప్రగతిపథాన్ని, తెలంగాణలో అమలు చేసిన వినూత్న విధానాలను, టెక్నాలజీ ఆధారిత అభివృద్ధి మోడల్‌ను కేటీ-ఆర్ వివరించనున్నారు. ఈ సదస్సులో కేటీ-ఆర్ పాల్గొంటే రాబోయే రోజుల్లో ప్రపంచంపై ఇండియా చూపే సానుకూల ప్రభావాన్ని, నాయకత్వ లక్షణాలను ప్రపంచానికి బలంగా చా-టొ-చ్చని సిద్ధార్థ్ సేఠి తెలిపారు. ఈ ఆహ్వానాన్ని స్వీకరించి, సదస్సుకు రావాలని సిద్ధార్థ్ కోరారు. ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సమావేశం యూరప్‌లో భారత్‌కు సంబంధించిన అతి పెద్ద కార్య క్రమం. భారతదేశ పురోగతి, ఆవిష్కరణలను ప్రపంచానికి చూపే వేదిక. మనదేశ అభివృద్ధి, సాంకేతిక రంగాల్లో జరుగుతున్న మా ర్పులు, గ్లోబల్ సహకార అవకాశాలపై ఈ సమావేశంలో చర్చలు జరుగనున్నాయి. భారత్‌ను ప్రపంచానికి దగ్గర చేయడం, పరిశోధన, సాంకేతికత, విధానాల్లో ఇతర దేశాల భాగస్వామ్యాన్ని పెంచడం ఈ ఫోరమ్ ప్రధాన లక్ష్యం.

## ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా భారత్

- వేవ్స్ సదస్సు ప్రారంభంలో ప్రధాని మోడీ
- హాజరైన చిత్రరంగ ప్రముఖులు




**ముంబయి, మే 1 :** భారత్ ఎంటర్‌టైన్ మెంట్ హబ్‌గా మారుతుందని భారత్ ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. ముంబయిలో జరుగుతున్న వేవ్స్ సమ్మిట్ ను మోడీ ప్రారంభించారు. వేవ్స్ సదస్సుకు సినీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సృజనాత్మక హబ్ గా తయారై కొత్త అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. సంప్రదాయ, నవతరాలను సమన్వయం చేయాలని సూచించారు. మనదేశంలో 1913 లో తొలి చిత్రం రాజా హరిశ్చంద్ర విడుదలైందన్నారు. గేమింగ్ రంగంలో యువతకు అనేక అవకాశాలు ఉన్నాయని చెప్పారు. 50 దేశాల గాయకులు కలిసి వైష్ణవ జనతో గీతం ఆలపించారని పేర్కొన్నారు. ప్రతిభ, సృజనాత్మకతల ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేయాలని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు.నాలుగు రోజులపాటు- ప్రతిష్ఠాత్మకంగా వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంట్టంల్గ÷న్మెంట్ సమ్మిట్ -వేవ్స్ జరగనుండగా, ముంబై వేదికగా జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో అట్టహాసంగా ప్రారంభమైంది. 'కనెక్టింగ్ క్రియేటర్స్.. కనెక్టింగ్ కంట్రీ-స్' అనే ట్యాగ్ లైన్ తో ఈ వేవ్స్ సమ్మిట్ ను నిర్వహిస్తుంది. ఇది మీడియా, వినోద పరిశ్రమలను ఒకచోట చేర్చే నాలుగు రోజుల కార్యక్రమం కాగా, ఆ కార్యక్రమానికి మీడియా, వినోద రంగానికి చెందిన సీఈఓలు, పరిశ్రమలకి చెందిన ప్రముఖులు హాజరు కానున్నారు. ఈ సదస్సును ప్రధాని మోదీ గురువారం ప్రారంభించగా, కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వేవ్స్ అనేది కేవలం ఒక పదం కాదని.. ఇది సంస్కృతి, సృజనాత్మకత, చలనచిత్ర సంగీతం, గేమింగ్, కథ చెప్పడం.. లాంటి కలయిక అంటూ వివరించారు. గత వందేళ్లలో భారతీయ సినిమా ఉన్నత శిఖరాలకి కూడా చేరుకుందని ప్రధాని స్పష్టం చేశారు. ఈ సమ్మిట్‌లో బాలీవుడ్ నటు-లు అమితాబ్ బచ్చన్ , రణ్‌బీర్ కపూర్ , దీపికా పదుకొనే, ప్రియాంక చోప్రా, రజనీకాంత్, చిరంజీవి, మోహన్ లాల్ సహా ఇతర ప్రపంచ తారలు పాల్గొన్నారు. అయితే రజనీకాంత్, మోహన్ లాల్, హేమ మాలిని, చిరంజీవి, అక్షయ్ కుమార్, మిథున్ చక్రవర్తి, మోహన్ లాల్ కలిసి ఓ గ్రూప్ ఫొటో దిగారు. ఈ పిక్ ఎంతగానో ఆకట్టు-కుంది. చాలా రోజుల తర్వాత ఆ నాటి సీనియర్ హీరోలు అందరు కలిసి ఇలా ఫొటో దిగగా, ఇప్పుడు ఈ పిక్ నెట్టింట వైరల్ అవుతుంది. అలనాటి స్టార్స్ ఇలా ఒకే గ్రూప్ పిక్‌లో చూడడం చాలా ఆనందంగా ఉందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. బుధవారమే చిరంజీవి ఈ కార్యక్రమం కోసం హైదరాబాద్ నుంచి ముంబయి చేరుకున్నారు. ఆయనకి నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. వేవ్స్ సమ్మిట్‌కి చిరు చాలా సింపుల్‌గానే వెళ్లారు.



## భూభారతిపై విస్తృత అవగాహన

### పోర్టల్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లామన్న మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, మే 1 :** భూ భారతి పోర్టల్ విస్తృత స్థాయిలో ప్రజల్లోకి వెళ్లిందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భూ భారతికి అనూహ్య స్పందన లభిస్తుంది. నాలుగు పైలట్ మండలాల్లోని 72 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తి అయ్యాయి. 555 మండలాల్లో అవగాహన సదస్సులు పూర్తి చేశాం.. భూ సమస్యలపై ఇప్పటి వరకు 11, 630 దరఖాస్తులను స్వీకరించాం.. ఈ నెల 5వ తేది నుంచి జిల్లాకు ఒక మండలం చొప్పున 28 మండలాలలో భూ భారతిని అమలు చేస్తాం అన్నారు. మార్పుకు నాంది భూ భారతి పోర్టల్.. అయితే, 20 జిల్లాల్లో 45 సదస్సుల్లో స్వయంగా నేనే పాల్గొన్నాను అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.



## ఉగ్రవాదులను వెంటాడి వేటాడి పట్టుకుంటాం

### కేంద్రమంత్రి అమిత్ షా హెచ్చరిక

**న్యూఢిల్లీ, మే 1 :** ఉగ్రవాదులు ఎక్కడున్నా వెతికి పట్టుకొని శిక్షిస్తామని వేటాడి వెంటాడి పట్టుకుంటామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. ఉగ్రదాడిపై తొలిసారి షా స్పందించారు. కాశ్మీర్ ఉగ్రవాద చర్యకు గట్టి సమాధానం ఇస్తున్నామని అన్నారు. ఉగ్రవాదులకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. జమ్మూ కాశ్మీర్, పహల్గామ్‌లోని బైసరన్ లోయలో చోటుచేసుకున్న ఉగ్రదాడిపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తొలిసారి స్పందించారు. ఉగ్రవాదులకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. ఉగ్రవాదాన్ని అంతం చేస్తామని స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని అంతం చేసేంత వరకు మా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది. ఉగ్రవాదులకు సరైన సమాధానం చెప్పడం ఖాయం. ఉగ్రవాదులు ఎక్కడున్నా వెతికి పట్టు-కొని శిక్షిస్తాం. కాశ్మీర్ ఉగ్రవాద చర్యకు గట్టి సమాధానం ఇస్తున్నాం. దాడి చేసి విజయం సాధించామని అనుకుంటే అది పొరపాటే. ఇది మోదీ సర్కార్. మోదీ సర్కార్ ఎవరినీ వదిలి పెట్టదు. వెంటాడి వెంటాడి అంతం చేస్తుంది. పహల్గామ్‌లో అమాయకుల చావులకు కారణమైన ప్రతి ఒక్కరూ మూల్యం చెల్లించుకోవాల్సిందేనని అన్నారు.

## రూ అఫ్జాపై రామ్‌దేవ్ వీడియో

### ఢిల్లీ హైకోర్టు తీవ్ర ఆగ్రహం

**న్యూఢిల్లీ, మే 1 :** రూఅఫ్జాపై రామ్‌దేవ్ కొత్త వీడియో విడుదల చేయడంపై ఢిల్లీ హైకోర్టు గురువారం తీవ్రంగా స్పందించింది. అవమానకరమైన వ్యాఖ్యలతో రూఅఫ్జాపై రామ్‌దేవ్ మరో కొత్త వీడియోను రూపొందించడం కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించడమేనని ఆగ్రహం వ్యక్తం చేసింది. రామ్‌దేవ్ ప్రవర్తన ఆయన ఎవరి నియంత్రణలోనూ లేరని, తన సొంత ప్రపంచంలో నివసిస్తున్నారని ధృవీకరిస్తుందని జస్టిస్ అమిత్ బన్సాల్ పేర్కొన్నారు. ఆయన ఆలోచనలను తనలోనే ఉంచాలని, వాటిని వ్యక్తపరచవలసిన అవసరం లేదని కోర్టు స్పష్టం చేసింది. హమ్‌దార్డ్ సంస్థకి చెందిన రూఅఫ్జాపై రామ్‌దేవ్ ఇకపై ఎటు-వంటి బహిరంగ వ్యాఖ్యలు, ప్రకటనలు లేదా వీడియోలను పోస్ట్ చేయకూడదంటూ గతంలో కోర్టు ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఉత్తర్వుల దృష్ట్యా ఆయన అఫిడవిట్, వీడియో ప్రాథమికంగా కోర్టు ధిక్కారణ కిందకే వస్తాయని బన్సాల్ మండిపడ్డారు. విచారణకు హాజరుకావాల్సిందిగా రామ్‌దేవ్‌కు నోటీసులు జారీ చేశారు. ఈ నెల ప్రారంభంలో పతంజలికి చెందిన గులాబ్ షర్బత్‌ను ప్రచారం చేస్తూ.. రూఅఫ్జా నుండి వచ్చే ఆదాయాన్ని మదర్సాలు, మసీదుల నిర్మాణానికి నిధులు సమకూర్చేందుకు వినియోగిస్తున్నారని రామ్‌దేవ్ ఆరోపించారు. షర్బత్ జీహాద్ అంటూ రూఅఫ్జాపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రేకెత్తించాయి. ఈ వ్యాఖ్యలపై విచారణ చేపట్టాల్సిందిగా హమ్‌దార్డ్ కోర్టును ఆశ్రయించింది. రామ్‌దేవ్ వ్యాఖ్యలు సమర్థించలేనివని, దిగ్భ్రాంతికి గురిచేశాయని ఏప్రిల్ 22న విచారణ సందర్భంగా ఢిల్లీ హైకోర్టు కోర్టు వ్యాఖ్యానించింది. ప్రకటనలు, సోషల్‌మీడియా పోస్టులతో సహా ఆన్‌లైన్ కంటెంట్‌ను వెంటనే తొలగిస్తామని రామ్‌దేవ్ తరపున న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈహామీని ధృవీకరిస్తూ అఫిడవిట్ సమర్పించాలని కోర్టు ఆదేశించింది.

## విద్యుత్ షాక్‌తో తల్లీకొడుకుల మృతి

**నాగర్ కర్నూలు, మే 1 :** నాగర్ కర్నూల్ జిల్లా తాడూరు మండలం తుమ్మల సుగురు గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. విద్యుదాఘాతానికి గురై తల్లి, కొడుకు మృతి చెందారు. సుగురు గ్రామంలో పిండి గిర్ని పనిలో నిమగ్నమై ఉండగా కొడుకు శ్రీకాంత్ (15)కు విద్యుత్ షాక్ తో విలవిలాడుతుండగా తల్లి జయమ్మ (40) రక్షించడానికి ప్రయత్నించింది. ఇద్దరు విద్యుత్ షాక్ తో మృతి చెందారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శంషాబాద్‌లో మూడున్నర కిలోల బంగారం పట్టివేత

**హైదరాబాద్, మే 1 :** శంషాబాద్ ఎయిర్ పోర్టులో భారీగా బంగారం పట్టివేసారు. మస్కట్ నుంచి వచ్చిన విమాన సిబ్బంది వద్ద బంగారాన్ని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మస్కట్ నుంచి బంగారం తెచ్చి గ్రౌండ్ స్టాఫ్ కు ప్యాసింజర్లు అందించారు. ఎయిర్ పోర్ట్ నుంచి బంగారాన్ని బయటికి తీసుకొచ్చేందుకు గ్రౌండ్ స్టాఫ్ ప్రయత్నించగా.. 3.5 కిలోల బంగారాన్ని పట్టుకున్నారు. బంగారం స్మగ్లర్ కి సహకరించిన గ్రౌండ్ స్టాఫ్ ని డీఆర్ఐ అధికారులు పట్టు-కున్నారు. ఎయిర్ పోర్ట్ నుంచి పార్కింగ్ వరకు బంగారం తీసుకొచ్చి అప్పగిస్తుండగా పట్టు-కుని.. 3.5 కిలోల బంగారాన్ని సీజ్ చేశారు. పట్టుబడ్డ బంగారం విలువ దాదాపు 3 కోట్ల 45 లక్షల రూపాయలు ఉంటుందని అంచానా వేశారు.

## ప్రతికూల పరిస్థితులతో రెస్క్యూ ఆపరేషన్ నిలిపివేత

- వచ్చే మార్చినాటికి పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేస్తాం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**మహబూబ్‌నగర్, మే 1 :** ఎస్ఎల్బీసీ టన్నెల్ సంఘటన దురదృష్టకరం అని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. బాధ్యతగా ఆ కుటుంబ సభ్యులను ఆదుకుంటాం.. దొరకని ఆరు మృతదేహాలు బాధిత కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలుపుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వపరంగా ఒక్కో కుటుంబానికి 25 లక్షల నష్ట పరిహారం చెల్లించాం.. జియో లాజికల్ సర్వే సూచన మేరకే రెస్క్యూ ఆపరేషన్ నిలిపివేశాం.. ఆరు మృతదేహాల ఘటన స్థలంలో క్రిటికల్ కండిషన్ ఉంది, రెస్క్యూ సిబ్బంది ప్రాణాలకు ముప్పు పొంచి ఉండటంతో పనులు ఆపేశామని అన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల పూర్తి కోసం హై లెవెల్ టెక్నికల్ ఎక్స్‌పర్ట్స్ కమిటీ వేశామన్నారు. 2026 మార్చి 31వ తేదీ వరకు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ హామీ ఇచ్చారు. అయితే, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు వేగవంతానికి చర్యలు చేపట్టి 2027 మార్చి నాటికి ఉదండాపూర్ వరకు నీరు అందిస్తామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రాజెక్టుల కోసం భూ సేకరణకు సత్వర చర్యలకు కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తున్నాం.. పాలమూరు జిల్లా గత బీఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు. టీఆర్ఎస్ హయాంలో కృష్ణా నది జలాల కేటాయింపులో పాలమూరు, నల్లగొండకు తీరని అన్యాయం జరిగింది అన్నారు. 819 టీ-ఎంసీల కృష్ణ జలాలను ఆంధ్రకు కేటాయిస్తుంటే.. కేసీఆర్ సర్కార్ చోద్యం చూసిందన్నారు. 299 టీఎంసీలు మాత్రమే తెలంగాణకు వాటా దక్కింది.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం లక్ష కోట్ల ప్రజాధనం గోదావరి పాలు చేశారు.. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు మరో రెండు ఏళ్లలో పూర్తి చేస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

## తెలుగులో రాసిన వారికి మార్కులెలా కేటాయించారు

### టీజీపీఎస్సీని ప్రశ్నించిన న్యాయస్థానం




**హైదరాబాద్, మే 1 :** తెలుగులో జవాబులు రాసిన వాళ్లకు మార్కులు ఏవిధంగా కేటాయించారని టీజీపీఎస్సీని న్యాయస్థానం ప్రశ్నించింది. ఆయా సబ్జెక్టుల నిపుణులు మూల్యాంకనం చేసి మార్కులు కేటాయించారని సర్వీస్ కమిషన్ తరఫున లాయర్ తెలిపారు. ఇదే కేసులో బుధవారం కూడా విచారణ జరగగా గురువారం మరోమారు హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ నామవరపు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తమిళనాడులో ప్రజలకు ఎన్ని భాషలు వచ్చినా తమిళంలోనే మాట్లాడతారని, ఇక్కడమాత్రం ఆంగ్లంలో మాట్లాడిన వారికే ఎక్కువ మర్యాద ఇస్తారని అన్నారు. 'ఇది నా స్వీయ అనుభవం కూడా. తెలుగులో గ్రూప్-1 పరీక్ష రాసిన వారికి తక్కువ మార్కులు వచ్చాయన్నది ప్రధాన ఆరోపణ. దీనికి కారణమేమిటో స్పష్టత ఇవ్వాలన్నారు. మెయిన్స్ మూల్యాంకనంలో అనుసరించే ప్రాతిపదిక, మార్కుల కేటాయింపు విధానంపై వివరణ ఇవ్వాలని టీ-జీపీఎస్సీని ఆదేశించారు. టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయంటూ పలువురు అభ్యర్థులు దాఖలుచేసిన పిటిషన్లపై గురువారం హైకోర్టు మరోసారి విచారణ చేపట్టింది. మెయిన్స్ మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదించారు. పరీక్షా కేంద్రాల కేటాయింపులోనూ నిబంధనలు పాటించలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మరోసారి మూల్యాంకనం చేసేలా టీజీపీఎస్సీని ఆదేశించాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. టీ-జీపీఎస్సీ తరఫు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ.. కొంతమంది అభ్యర్థులు మెయిన్స్ ఫలితాలపై అపోహపడుతున్నారని కోర్టుకు తెలిపారు. నిపుణుల పర్యవేక్షణలోనే మూల్యాంకనం జరిగిందని వివరించారు.

## ఆర్టీసీ బస్సు బోల్తా : ఒకరు మృతి

**ఆదిలాబాద్, మే 1 :** ఇచ్చోడ మండలం కోకస్‌మన్నూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. జాతీయ రహదారిపై ఆటోను ఢీకొట్టి ఆర్టిసి బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. 20 మంది గాయపడ్డారు. పశువులను తప్పించబోయి ఆటోను ఢీకొని బస్సు బోల్తా పడింది. గాయపడిన వారిని ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనలో నాలుగు పశువులు కూడా మృత్యువాతపడ్డాయి.

# కుడితిలో పడ్డ ఎలుకలా కాంగ్రెస్!



కులగణనపై కేంద్రం అనూహ్య నిర్ణయం తీసుకోవడంలో రాజకీయ ఎత్తుగడ ఉండే ఉంటుంది. పహల్గాం సంఘటనకు ప్రతీకారంగా కేంద్ర ప్రభుత్వం అసాధారణ రీతిలో ప్రతిస్పందించే అవకాశాలు ఉన్నాయని అందరూ భావిస్తున్న తరుణంలో అనూహ్యంగా కేబినేట్ కులగణన నిర్ణయం తీసుకుంటుందని ఎవ్వరూ ఊహించలేదు. ఓ రకంగా కులగణనతో మోడీని ఇరుకున పెట్టాలని చూసిన రాహుల్‌ను గట్టి దెబ్బే కొట్టారని అనుకోవాలి. తెలంగాణ రోల్ మోడల్ అంటూ రాహుల్ ఎంతగా వగచినా...ఇక్కడ చేసిన కులగణనతో ఒరింగేమి లేదు. కులగణన చేపట్టామని చెబుతున్న సిఎం రేవంత్ రెడ్డి ముందుగా సిఎం సీటును బిసిలకు ఇవ్వలేరు. ఇవ్వాలని రాహుల్ కూడా పట్టుబట్టలేరు. అలాగే కులగణన కావాలంటూ గొంతుచించుకుంటున్న రాహుల్ తమ కుటుంబంలోని మూడు పార్లమెంట్ సీట్లను ముగ్గురు బిసిలకు ఇవ్వలేరు. కేవలం రాజకీయ డ్రామాల కోసం ఏదో ఒక సమస్యను తెరపైకి తేవడం, వాదులాడడం, గొంతు చించుకోవడం తప్ప..నిజంగా పేదలకు మంచి చేయాలన్న ధృఢసంకల్పం రాజకీయ నాయకుల్లో కొరవడుతోంది. దళితులు, ఆదివాసీలు, బిసిల పేర్లు చెప్పి ఓట్లు దండుకునే యత్నం తప్ప మరోటి కాదు. దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి మధ్యలో కొన్నేళ్లు తప్ప కాంగ్రెస్ అధికారంలో ఉన్నా..కులగణనపై నోరు మెదపలేదు. పదేళ్ల యూపిఎ పాలనలో కూడా రాహుల్‌కు ఈ ధ్యాస రాలేదు. మోడీ అధికారంలో రావడం...పాతుకు పోగానే రాజ్యాంగం, కులగణన గుర్తుకు వచ్చి ఊరూవాడా ప్రచారం చేసుకుంటున్నారు. తెలంగాణలో కూడా అనేకానేక సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించే ప్రయత్నాలు చేయడం లేదు. ఎన్నికల ముందు ప్రస్తావించిన సమస్యలపై పట్టింపు లేదు. అవినీతిలో కెసిఆర్ మునిగాడని, పదిలక్షల కోట్లు సంపాదించారని పదేపదే పాటపాడుతున్న అధికార కాంగ్రెస్ అవినీతిని రుజువు చేయలేక చతికిల పడింది. అందుకే రాజకీయాల్లో ఎవరి ఎజెండాలు వారివే. వాటిని తిప్పికొట్టేందుకు సహజంగానే ఎత్తులు వేస్తుంటారు.

కాంగ్రెస్‌ను మరింత దెబ్బకొట్టే ఉద్దేశ్యంతో ఇక వారికి ఈ అంశంపై మాట్లాడే అవకాశం లేకుండా చేయడమే మోడీ ఎత్తుగడగా కనిపిస్తోంది. కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఇలాగే చూడాలి. కులగణనకు నెహ్రూ వ్యతిరేకమంటూ, రిజర్వేషన్లను రాజీవ్‌గాంధీ లోక్‌సభలోనే వ్యతిరేకిం చారంటూ బిజెపి నుంచి విమర్శలు వచ్చాయి. మండల్ కమిషన్ సిఫార్సులను ఇందిరాగాంధీయే తొక్కిపట్టారని ఆరోపణలూ ఎక్కుపెట్టారు. సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కులగణన గురించి ఆలోచన చేయలేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు చేయలేదన్న బిజెపి ప్రశ్నలకు కాంగ్రెస్ వద్ద సమాధానం లేదు. కాంగ్రెస్ తన విధానాలకు భిన్నంగా కులగణనను ప్రధాన రాజకీయ అజెండాగా మలచుకుని దానిచుట్టే కార్యాచరణను రూపొందించుకుంది. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 400 సీట్ల ఆధిక్యతను సాధించకుండా చేయటంలో కాంగ్రెస్ రాజ్యాంగం, కులగణన ప్రచారం బాగానే అడ్డుపడింది. మోదీ కోరినట్లుగా 400 లోక్‌సభ స్థానాలను కట్టబెడితే రిజర్వేషన్లను బీజేపీ రద్దుచేస్తుందని కాంగ్రెస్ ముమ్మరంగా ప్రచారం చేసింది. దేశంలోనే మొట్టమొదటి సారిగా, ఎంతో పకడ్బందీగా తెలంగాణలో కులగణనను విజయవంతంగా పూర్తిచేశామనీ, దీనికి తామే రోల్ మోడల్ అని రేవంత్‌రెడ్డి ఇప్పటికీ పదేపదే ప్రచారం చేస్తున్నారు. అందుకే బిజెపి ఓ రకంగా ఎత్తుకు పైఎత్తు వేసిందనే చెప్పాలి. కాంగ్రెస్ ఎక్కుపెట్టిన కులగణన అస్త్రంను దెబ్బతీసే ఆలోచనలో భాగంగానే బిజెపి జనగణన–కులగణను ఆమోదించి ఉంటుంది.

ఓ రకంగా రాజకీయంగా కాంగ్రెస్‌ను దెబ్బకొట్టే ప్రయత్నం గానే చూడాలి. ఇది కాంగ్రెస్ చంకలు గుద్దుకుని ఎగిరే సందర్భం కూడా కాదు. బిజెపిని తక్కువ అంచనా వేసిన రాహుల్ తను తీసుకున్న గోతిలో తానే పడ్డారు. బిజెపి ఇలా చేస్తుందని ఊహించవుండరు. కులగణనపై కాంగ్రెస్ రాజకీయంగా మరింత విజృంభించకుండా బీజేపీ పావులు కదిపిందని చెప్పాల్సిందే. కులంతో పాటు ఉద్యోగ, విద్య, ఆస్తుల వివరాలను పక్కాగా సేకరించి వాటిని బహిరంగపరిస్తే అసలు రంగు బయటపడుతుంది. ఒక్క కులంతోనే సరిపుచ్చకుండా సామాజికంగా వారి అర్థిక స్థిగతులను కూడా వెలికి తీస్తే మంచిది. అప్పుడు కుల జనాభాను బట్టి ఉద్యోగాలు, పదవులు ఉండాలని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న డిమాండ్‌కు అర్థం లేకుండా పోతుంది. ఎందుకంటే మారిన ప్రపంచ పరిస్థితుల్లో కులాల ఆధారంగా వారి ఆర్థిక సామాజిక పరిస్థితిని నిర్వచించలేని రోజులు ఇవి. కుల రిజర్వేషన్లు వచ్చినా అవి కేవలం..ప్రభుత్వ ఉద్యోగాలకూ, ప్రభుత్వ విద్యాసంస్థలకూ మాత్రమే పరిమితం అయ్యే అవకాశాలే ఎక్కువ. ప్రైవేటు రంగానికి కూడా రిజర్వేషన్లను వర్తింపచేయాలనే డిమాండు ఉధృతమైనా ఆచరించడానికి ఆయా సంస్థలు సిద్దంగా లేవు. అలా చేస్తే వారు బిచాణా ఎత్తేస్తారు. నిజానికి కులాలకు ఎంతవరకూ రిజర్వేషన్లు ఉండాలన్న విషయంపై రాజకీయంగా ఇప్పటివరకూ ఏకాభిప్రాయం లేదు. కులజనాభాను బట్టి వాటాలు నిర్ణయించి, ఉద్యోగావకాశాలు ఇవ్వాలనే డిమాండ్ వస్తే..అది రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తుంది. ముందుగా రాజకీయంగా పదవులను ఇవ్వాలని కోరుతారు. సిఎంలు మొదలు మంత్రుల వరకు ఇప్పుడు పదవులు అనుభవిస్తున్న వారు చాపచుట్టేసి ఇంట్లో కూర్చోవాల్సి వస్తుంది. రాజకీయ రిజర్వేషన్లు లేకుండా మిగతా చోట్ల డిమాండ్ అన్నది సాధ్యం కాదు. అందుకే కేవలం కులాల లెక్కలు సేకరించడంతో పాటు, ఆర్థిక స్థితిగతులను కూడా పక్కాగా తేలిస్తేనే ఏయే కులాల్లో ఎంతమంది పేదలు ఉన్నారో తేలుతుంది. జనాభా సేకరణలో కులలెక్కలు చేపట్టం మొదలయితే ఇక ప్రతిసారీ ఇది కొనసాగించాల్సి ఉంటుంది. కర్ణాటకలో సిద్ధరామయ్య ప్రభుత్వ హయాంలో పదేళ్లక్రితం వందకోట్లకు పైగా ఖర్చుపెట్టి చేసిన కులగణనపై ఏకాభిప్రాయాన్ని సాధించలేకపోయారు. ఇప్పటికీ ఆ కుల నివేదికను బయటపెట్టలేక పోతున్నారు. కర్ణాటకలో రెండు ప్రధాన కులాలైన వక్కలిగలు, లింగాయతులు తమ జనాభాను తక్కువగా చూపించారని బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. తెలంగాణ కులగణనపైనా విమర్శలు ఉన్నాయి. చాలాందిని లెక్కల్లోకి తీసుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో కులగణన ద్వారా ఏం సాధిస్తారో కాంగ్రెస్ చెప్పగలగాలి. పార్టీపరంగా అమలుచేయగలగాలి. అప్పుడే డిమాండ్‌కు అర్థం ఉంటుంది. మొత్తంగా కులగణన చేపట్టాలన్ననిర్నయంతో కాంగ్రెస్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారయ్యిందనే చెప్పాలి.

01-05-2025

ఎడిటర్

# కులగణను ఏనాడూ పట్టించుకోని కాంగ్రెస్

(మొదటిపేజీ తరువాయి)

అలాంటప్పుడు కాంగ్రెస్ గత 60 ఏళ్లలో ఎందుకు చేయలేదు. ఇది రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డికి భయపడి తీసుకున్న నిర్ణయం కాదు. సామాజిక న్యాయానికి భాజపా కట్టుబడి ఉన్నందున కులగణన నిర్ణయం తీసుకున్నాం. కాంగ్రెస్‌లా.. ముస్లింలను బీసీల జనాభాలో చేర్చి మోసం చేయం. తెలంగా ణ, కర్ణాటకలో కులగణనను కాంగ్రెస్ తూతూమంత్రంగా చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది నిజమైన కులగణన కాదు' అని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ప్రధాని మోడీ నేతృత్వం లో క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకుంది అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలో జరగబోయే జనగణనలో కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు.. ప్రధానికి హృదయపూర్వక ధన్యవాదాలు.. దేశంలో సానుకూల మైన మార్పుకు, కులగణన.. చరిత్రాత్మకమైన కులగణన, చరిత్ర పుటల్లో నిలిచిపోనుంది అన్నారు. ప్రతిపక్ష పార్టీలు నాటకాలకు తెరలేపుతున్నారు.. కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్లకు సంబంధించి, కుట్రలు కుతంత్రాలు చేస్తోందని ఆరోపించారు. అలాగే, ముస్లింలను తీసుకెళ్లి బీసీల్లో చేర్చడం దారుణం.. కాంగ్రెస్ అన్ని తప్పుడు నిర్ణయాలు చేసింది.. కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ రాష్ట్రపతుల అభ్యర్థిత్వాలను వ్యతిరేకించింది అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మోడీ సర్కార్ ఎన్నో ఏళ్ల పెండింగ్ అంశం ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టుకు తమ వైఖరిని స్పష్టం చేశాక.. వర్గీకరణ అంశంపై కోర్టు కీలక తీర్పు ఇచ్చింది అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కనీస ఇంగిత జ్ఞానం లేకుండా మోడీనీ కులం పేరుతో దూషించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అన్నారు. కాంగ్రెస్ మొదటి నుంచి బీసీల పట్ల మొసలి



కన్నీరే కార్చింది.. 2018లో మోడీ ప్రధాని అయ్యాక బీసీ కమిషన్ కు రాజ్యాంగ బద్ధంగా చట్టం చేశారు.. అన్ని వర్గాలకు న్యాయం చేయ్యాలని.. ఆర్థికంగా వెనకబడిన వర్గాల కోసం విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది మోడీ ప్రభుత్వం అని కిషన్ రెడ్డి అన్నారు. కాగా, మహిళల సాధికారిత కోసం 35 శాతం రిజర్వేషన్లు కల్పించామని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ముస్లిం మహిళల కోసం ట్రిపుల్ తలాక్ రద్దు చేసి.. వాళ్లకు న్యాయం చేసింది మోడీ సర్కార్.. 1981 నుంచి 1931 వరకు కులగణన జరిగింది.. ఆ తర్వాత కులగణ జరక్కుండా కాంగ్రెస్ వ్యవహరించింది.. కులగణనకు కాంగ్రెస్ వ్యతిరేకం అని మండిపడ్డారు. మండలి కమిషన్ నివేదికను రాజీవ్ గాంధీ వ్యతిరేకించారు.. 2010లోనే సుష్మాస్వరాజ్ కులగణన అంశాన్ని లేవనెత్తారు.. సామాజికంగా అన్ని వర్గాలకు లబ్ధి జరగాలి అని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా.. దేశ హితం కోసమేనన్నారు. న్యాయ స్థానాలకు తీర్పుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ వ్యవహరిస్తోంది.. మేం చేసే కులగణనలో మతం ప్రాతిపదికన ఏ మతాలను బీసీల్లో చేర్చేది లేదు అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తేల్చి చెప్పారు.

# వెలుతురు ఉన్నంత వరకు ఎర్రజెండా ఉంటుంది

- దేనికి లొంగని వారే కమ్యూనిస్టులు
- ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న
- సమాజానికి ఎర్రజెండా అవసరం : జూలకంటి
- మిర్యాలగూడలో మేడే భారీ ప్రదర్శన

**మిర్యాలగూడ ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే1:** జగతి ఉన్నంత వరకు ఎర్రజెండా ఉంటదని నోటుకు బిర్యానీ ప్యాకెట్ కు లొంగని వారే నిజమైన కమ్యూనిస్టులని ఎమ్మెల్సీ ప్రజా గాయకుడు గోరేటి వెంకన్న అన్నారు. మే డే సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో మిర్యాలగూడలో భారీ ప్రదర్శన నిర్వహించారు పట్టణంలోని హనుమాన్ పేట ఫ్లైఓవర్ బ్రిడ్జి నుండి రాఘవ థియేటర్ బస్టాండు మీదుగా రాజీవ్ చౌక్ వరకు భారీ ప్రదర్శన చేశారు. రాజీవ్ చౌక్ వద్ద జరిగిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎర్రజెండా అంటేనే పేదల పార్టీ అని నిరంతరం పేదల కోసం పోరాటాలు ఉద్యమాలు చేస్తుంటుందని అలాంటి పార్టీలో కార్యకర్తలుగా పనిచేయడం నిబద్ధతకు నిదర్శనం అన్నారు. ఒక్కొక్క కార్యకర్త లక్ష మందితో సమానమని చెప్పారు. కొన్ని పార్టీలు నోట్లు బిర్యానీ ప్యాకెట్ ఇచ్చి జన సమీకరణ చేసి గొప్పలు చెప్పుకుంటారని కానీ కమ్యూనిస్టు పార్టీ సభలకు మాత్రం ప్రజలు స్వచ్ఛందంగా వస్తారని తెలిపారు. ఎర్రజెండాను చూస్తేనే అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతాయన్నారు. ప్రజలు ఉన్నంతవరకు వారి సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా పనిచేస్తుందని తెలిపారు. ఎప్పటికైనా ఈ సమాజానికి ఎర్రజెండా అవసరం ఉంటుందని కమ్యూనిస్టు పార్టీ ప్రత్యామ్నాయమని చెప్పారు. అనంతరం తన పాటలతో ఉత్తేజపరిచారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ దేశంలో 80 శాతం మంది ప్రజలు పేదరికంతో అల్లాడుతున్నాయని పాలకులే ఈ విషయాన్ని పదే పదే గుర్తు



చేస్తున్నాయని చెప్పుకొచ్చారు దేశానికి కావాల్సింది యుద్ధం కాదని దేశ ప్రజలకు శాంతి అవసరం అని అన్నారు. కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న తమ హక్కులను చట్టాలను కాలరాసి కొత్త చట్టాలు తీసుకొచ్చి కార్మిక లోకానికి తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఈ దేశానికి బిజెపి ఆర్ఎస్ఎస్ ఎంతో ప్రమాదకరమని చరిత్రను వక్రీకరించి అబద్దాలతో రాజకీయం చేస్తుందని విమర్శించారు. మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవసరం దేశ ప్రజలపై ఉందన్నారు. సిఐటియు జిల్లా నాయకులు తిరుపతి రామ్మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లె వెంకటేశ్వర్లు జిల్లా నాయకులు రవి నాయక్ డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి భావాండ్ల పాండు సీనియర్ నాయకులు నూకల జగదీష్ చంద్ర సత్యనారాయణరావు గాదె పద్మ పాదూరి శశిధర్ రెడ్డి, రేమిడల పరశురాములు రాగిరెడ్డి మంగారెడ్డి అంజాద్ ఆయా కార్మిక సంఘాల నాయకులు బీఎం నాయుడు మండల గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# కార్మికుల రెక్కల కష్టం జాతి సంపద

## కేటీఆర్ మేడే శుభాకాంక్షలు



**హైదరాబాద్, మే 1 :** కార్మికుల రెక్కల కష్టం జాతి సంపదను సృష్టిస్తున్నదని, వారి త్యాగం వెలకట్టలేనిదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కార్మికుల త్యాగాలకు నివాళిగా, వారి హక్కుల కోసం నిరంతరం పోరాడు తామని చెప్పారు. మేడే సందర్భంగా కార్మిక సోదరులకు, శ్రామిక లోకానికి హృదయపూ ర్వక శుభాకాంక్షలు తెలిపారు. మేడే స్ఫూర్తితో బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం కార్మిక హక్కుల కోసం అడుగడుగునా నిలిచిందని ఎక్స్ వేదికగా వెల్లడించారు. కార్మిక సోదరులకు, శ్రామిక లోకానికి హృదయపూర్వక మేడే శుభాకాంక్షలు. మీ రెక్కల కష్టం జాతి సంపదను సృష్టిస్తుంది, మీ త్యాగం వెలకట్టలేనిది. చారిత్రాత్మక మేడే స్ఫూర్తితో, బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం కార్మిక హక్కుల కోసం అడుగడుగునా నిలిచింది. సింగరేణి శ్రామికులకు బోనస్‌లు, ఉద్యోగ భద్రత, మెరుగైన సౌకర్యాలతో గౌరవించాం. టీ–స్ఆర్టీసీ కార్మికులకు జీత భత్యాల పెంపు, ఆరోగ్య బీమా వంటి సంక్షేమ పథకాలతో భరోసా కల్పించాం. ఆటో డ్రైవర్లు, అసంఘటిత కార్మికులకు ఆర్థిక సహాయం, సంక్షేమ బోర్డులతో అండగా నిలిచాం. తెలంగాణను పారిశ్రామిక ఆదర్శంగా నిలబెట్టి, లక్షల మందికి ఉద్యోగాలు సృష్టించాం. మహిళా కార్మికులకు ప్రత్యేక సౌకర్యాలు, భద్రత కల్పించి సాధికారతను పెంచాం. కార్మికుల త్యాగాలకు నివాళిగా, మీ హక్కుల కోసం నిరంతరం పోరాడతాం. ఈ మేడే స్ఫూర్తితో కార్మిక ఐక్యత, సమానత్వం కోసం కలిసి నడుద్దాం!' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.


# మధ్యప్రదేశ్‌లో రోడ్డు ప్రమాదం

## వాహనం అదుపుతప్ప బోల్తా.. నలుగురు మృతి

**భోపాల్, మే 1 :** మధ్యప్రదేశ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివపురి జిల్లా రిజోడా గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు గుణ జిల్లాలోని మావాన్‌లో ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లి...తిరుగు ప్రయాణంలో భదౌరా పట్టణానికి సమీపంలోకి రాగానే రోడ్డుపై పశువులను తప్పించబోయే క్రమంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వారిలో ఒకరిని మెరుగైన వైద్యం కోసం భోపాల్ తరలించారు. మృతదేహాలను శవపరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లారు. మృతులను గోవింద రఘువంశీ (28), సోనూ రఘువంశీ (35), వీరు కుశ్వాష్ (24), హితేశ్ బైరాగి (24)గా గుర్తించారు. వీరంతా రిజోడాకు చెందిన వారిగా మైనా పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి గోపాల్ చౌబె తెలిపారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు– వెల్లడించారు.

# పాతపద్ధతిలో విఐపి బ్రేక దర్శనాలు

**తిరుమల, మే 1 :** తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాల కొత్త షెడ్యూల్ గురువారం నుంచి అమల్లోకి వచ్చింది. గతంలో వీఐపీ బ్రేక్ దర్శనాలు ఉదయం 5.30 గంటలకు మొదలై ఉదయం 11 గంటలకు ముగిసేవి. అయితే రాత్రి వేళల్లో కంపార్టుమెంట్లలో వేచి ఉండే భక్తులకు త్వరితగతిన దర్శనం చేయించాలనే ఉద్దేశంతో గతంలో వీఐపీ బ్రేక్ దర్శనాలను ఉదయం 10 గంటలకు మార్చారు. అయినప్పటికీ జనరల్ బ్రేక్ దర్శన భక్తులకు మాత్రం ఉదయం 8 గంటల నుంచి 10 గంటలోపు దర్శనం చేయిస్తున్నారు. ఇక, రెండవ నైవేద్యం గంట.. అంటే ఉదయం 10 గంటల తర్వాత ప్రొటోకాల్, రెఫరల్, శ్రీవాణి, ఉద్యోగులకు దర్శనం చేయిస్తున్నారు. దాదాపు మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ బ్రేక్ దర్శనాలు నడుస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలో ఏర్పాటైన ధర్మకర్తల మండలి తిరిగి బ్రేక్ దర్శనాల్లో పూర్వపు విధానాన్ని అమలుచేయాలని తీర్మానించింది. ఇందులో భాగంగా గురువారం నుంచి తిరిగి పాత పద్ధతిలో బ్రేక్ దర్శనాలను ప్రవేశపెట్టేందుకు టీటీడీ సిద్ధమైంది. ప్రొటోకాల్, రిఫరెల్, జనరల్ బ్రేక్ దర్శనాలను ఉదయం



7.30 గంటల లోపు పూర్తి చేసి తర్వాత వీలైనంత మంది సామాన్య భక్తులకు దర్శనం కల్పించి తిరిగి 10.15 గంటల నుంచి 11.30 గంటలలోపు శ్రీవాణి, టీటీడీ ప్రస్తుత, రి–టైర్డ్ ఉద్యోగులకు దర్శనం కల్పించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇక సిఫారసు లేఖలపై బ్రేక్ దర్శనాలనూ గురువారం నుంచి రద్దు చేసిన క్రమంలో ఉదయం గంట, మధ్యాహ్నం గంటన్నర అదనంగా సామాన్య భక్తులకు దర్శన సమయం లభించనుంది.



# రైతులను వెంటాడుతున్న వానగండం

- పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న పంటలు
- భూపాలపల్లి, ఖమ్మం జిల్లాల్లో మామిడి, బొప్పాయికి నష్టం

**వరంగల్, మే 1 :** చెడగొట్టు వాన రైతులను వెంటాడుతోంది. ఇటీవల పలు జిల్లాలో కురుస్తున్న వడళ్ల వానకు రైతులు ఆగమాగం అవుతున్నారు. రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం, మామడి పంటలు వానలకు దెబ్బతిన్నాయి. భూపాల్‌పల్లి జిల్లాలో పలు మండలాల్లో అకాల వర్షం మామిడి పంటను దెబ్బతీసింది. ఈదురుగాలుతో రాళ్లు పడడంతో చేతికొచ్చిన వడ్లు పొలంలోనే రాలిపోయాయి. చాలాచోట్ల కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. వరితో పాటు మక్కజొన్న, మామిడి, కూరగాయల పంటలు కూడా దెబ్బతిన్నాయి. మామిడి తోటల్లోని మామిడి కాయలు నేలరాలాయి. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటున్నారు. అయితే తమకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని మామిడి రైతులు కోరుతున్నారు. ఖమ్మం జిల్లాలో పలుచోట్ల అకాల వర్షాలతో బొప్పాయి పంటలు దెబ్బతిన్నాయి. వర్షాలకు పంట నేలకూలిం ది. దాదాపు పది లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. కారేపల్లి మండలంలో ఇలా పంటలు దెబ్బతిన్నాయి. అలాగే పలు జిల్లాల్లో అక్కడక్కడా మరోమారు అకాల వర్షాలు అన్నదాతను అతలాకుతలం చేశాయి. ఇప్పటికే కురిసిన భారీ వడగళ్ల వాన రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించింది. మళ్లీ బుధవారం సాయం త్రం పలు జిల్లాలోని చాలా ప్రాంతాల్లో బలమైన ఈదురుగా లులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు చాలా వడగళ్లు పడ్డాయి. పంటలు దెబ్బతినగా, కోసి ఆరబోసిన వడ్లు మరోసారి తడిశాయి. జిల్లాలోని ఆయా గ్రామాల్లో కోసి కొనుగోలు సెంటర్లు, రోడ్లపై ఆరబోసిన వడ్లు వరదల్లో కొట్టుకుపోయాయి.

ప్రాంతీయం

# భూ భారతికి అనూహ్య స్పందన

- విస్తృత స్థాయిలో ప్రజల్లోకి భూభారతి
- నాలుగు పైలట్ మండలాల్లోని 72 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తి
- 555 మండలాల్లో అవగాహన సదస్సులు పూర్తి
- భూ సమస్యలపై 11, 630 దరఖాస్తుల స్వీకరణ
- ఈ నెల 5వ తేది నుంచి జిల్లాకు ఒక మండలం చొప్పున 28 మండలాలలో భూ భారతి
- 20 జిల్లాల్లో 45 సదస్సుల్లో స్వయంగా పాల్గొన్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- మార్పుకు నాంది భూ భారతి : మంత్రి పొంగులేటి



**హైదరాబాద్ ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే 1 :** తెలంగాణ రాష్ట్రంలో భూ సమస్యలు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా గత నెల 14వ తేదీన అంబేద్కర్ జయంతి సందర్భంగా చారిత్రాత్మకమైన భూభారతి చట్టాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చింది. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఏమాత్రం ఆటంకం కలగకుండా ఉండేలా పైలట్‌గా ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డి జిల్లా లింగంపేట, నారాయణ్‌పేట్ జిల్లా మద్దూర్, ములుగు జిల్లా వెంకటాపూర్ నాలుగు మండలాల్లో పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నారు. ఇదే సమయంలో ఈ చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రతిరోజు ఒక మండలంలో రెండు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. ఈ రెండు సదస్సుల్లో కలెక్టర్లు స్వయంగా పాల్గొనాలని ఆదేశించింది. ఇందుకోసం మండల స్థాయిలో తహశీల్దార్ డిప్యూటీ తహశీల్దార్ ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో రెండు బృందాలను ఏర్పాటు చేసింది. ఈ భూభారతి చట్టం రైతులకు అర్థమయ్యే విధంగా చట్టాన్ని అమలు చేసే అధికారులకు ప్రత్యేకంగా శిక్షణా తరగతులు నిర్వహించింది. భూభారతి చట్టంలో కీలక పాత్ర వహించిన రెవెన్యూ శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక సవాల్‌గా తీసుకొని విస్తృత స్థాయిలో జిల్లాల్లో పర్యటించి రోజుకు రెండు, మూడు అవగాహనా సదస్సులలో స్వయంగా పాల్గొన్నారు. ఏప్రిల్ 17వ తేదీనుంచి 30వ తేదీవరకు దాదాపు 20 జిల్లాల్లో సుమారు 45 సదస్సులలో పాల్గొన్నారు. నాలుగు పైలట్ మండలాల్లోని 72 రెవెన్యూ గ్రామాల్లో ఏప్రిల్ 17 వ తేదీ నుంచి 30వ తేదీవరకు రెవెన్యూ సదస్సులను పూర్తిచేశారు. ఈ సదస్సుల్లో చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూనే మరోవైపు ఆయా మండలాల్లో భూసమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. స్వీకరించిన ప్రతి దరఖాస్తుకు రశీదు అందజేశారు. ఒక ప్రత్యేక ఫార్మాట్ లో తయారు చేసిన దరఖాస్తులను రెవెన్యూ సదస్సుకు ముందు రోజే ప్రజలకు అందించారు. లింగంపేటలో 3,702, వెంకటాపూర్‌లో 3,969, మద్దూర్‌లో 1,341, నేలకొండపల్లిలో 2,618 మొత్తం 11, 630 దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో ప్రధానంగా పీపీబీకి సంబంధించి 3,446, సాదాబైనామాలపై 2,796 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన దరఖాస్తులన్నింటిని ఏరోజుకు ఆరోజు కంప్యూటర్ లో నమోదు చేసి సంబంధిత అధికారులకు పంపించారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా ప్రజలు స్వచ్ఛందంగా ఈ సదస్సుల్లో పాల్గొన్నారు. హైదరాబాద్ మినహా 605 మండలాలకు గాను 555 మండలాలలో బుధవారం నాటికి సదస్సులు పూర్తి అయ్యాయి. వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి జూన్ 2వ తేదీ నాటికి ఆ నాలుగు మండలాల్లో భూ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మరోవైపు హైదరాబాద్ మినహా మిగిలిన 28 జిల్లాల్లో జిల్లాకు ఒక మండలాన్నిపైలట్ గా తీసుకొని 28 మండలాల్లో పూర్తిస్థాయిలో భూభారతి చట్టాన్ని అమలు చేయాలని నిర్ణయించింది.

### మార్పుకు నాంది : మంత్రి పొంగులేటి

"గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం దార్శనికతతో తీసుకువచ్చిన భూభారతి చట్టం విప్లవాత్మక మార్పుకు నాంది పలకబోతోంది. నూటికి నూరు శాతం ప్రజలే కేంద్ర బిందువుగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రైతు సంక్షేమమే లక్ష్యంగా ఈ చట్టం ఉంది. ఈచట్టానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. జిల్లాల్లో పర్యటించిన సందర్భంలో తమ భూ సమస్యలు ఈ భూభారతి చట్టంతో పరిష్కారమవుతాయనే నమ్మకం, విశ్వాసాన్ని రైతులు వ్యక్తం చేశారు. ధరణితో వారు అనుభవించిన కష్టాలను, బాధలను వ్యక్తం చేశారు. ధరణి తో వారు ఎదుర్కొన్న సమస్యలను చెప్తుంటే వారు పడ్డ కష్టం కళ్ళముందే కనిపించింది. రైతుల భూ సమస్యలను వీలైనంత త్వరితగతిన పరిష్కరించడానికి అధికార యంత్రాంగాన్ని సంసిద్ధం చేశాం. ఇకనుండి రైతులు ఏ కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా రెవెన్యూ కార్యాలయం లోనే వాళ్ళ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ప్రజల వద్దకే అధికారులు వచ్చి పైసా ఖర్చు పరిష్కరించే విధానం నిరంతరం కొనసాగుతుంది. ఈ పైలట్ నాలుగు మండలాలలో కోర్టు పరిధిలో ఉన్న భూ సమస్యలు మినహా అన్ని సమస్యలను జూన్ 2వ తేదీ నాటికి పరిష్కరిస్తాం. ఆ నాలుగు పైలట్ మండలాల మాదిరిగానే ఈ నెల 5వ తేది నుంచి రాష్ట్రంలోని 28 జిల్లాల్లో జిల్లాకు ఒక మండలంలో పూర్తి స్థాయిలో భూ భారతిని అమలు చేస్తున్నాం. చట్టం తీసుకువస్తే సరిపోదు, ఆ చట్టం పూర్తి స్థాయిలో అమలు జరిగినప్పుడే రైతులకు నిజమైన న్యాయం లభిస్తుంది. ఆ దిశగా మా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.



## మేడే రోజు కార్మికులకు మజ్జిగ పంపిణీ

### రామకృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవలు

**ఖమ్మం వన్ టౌన్, ఆర్గాన్ న్యూస్, మే 1 :** నగరంలోని చర్చి కాంపౌండ్ రోడ్ నందు మోతుకూరి చంద్రకళ రామ కృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా 25వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాసరి పూర్ణచందర్రావు పాల్గొని మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రామకృష్ణ నాకు మంచి స్నేహితులని ఆయన సేవా దృక్పథంతో ఉంటారని అదే విధంగా ఈ ట్రస్ట్ ముందు ముందు మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు అనంతరం ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు మోతుకూరి చంద్రకళ మాట్లాడుతూ ఈరోజు మా వారు చనిపోయిన రోజు అని అదేవిధంగా మేడే సందర్భంగా కార్మికులకు ఎండలో దాహం తీర్చేందుకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేశామని ముందు ముందు మరెన్నో కార్యక్రమాలు చేపడతామని తెలిపారు ఈ కార్యక్రమంలో పవన్ నరసయ్య రాజేష్ బెజవాడ సరస్వతి తదితరులు పాల్గొన్నారు



## కార్మికుల ఐక్యత అభివృద్ధికి సూచిక

**చింతకాని, ఆర్గాన్ న్యూస్, మే1:** కార్మికుల ఐక్యత దేశ అభివృద్ధికి సూచిక అని ఐఎన్‌టియుసి మండల గౌరవ అధ్యక్షులు తిరుపతి గోవిందరావు అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా గురువారం మండల పరిధిలోని పందిళ్ళపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఐ ఎన్ టి యు సి జండా ఎగరవేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



## రెపరెపలాడిన ఎర్రజెండా

**చింతకాని, ఆర్గాన్ న్యూస్, మే 1 :** చింతకాని మండల కేంద్రంలో మేడే సందర్భంగా సిపిఎం పార్టీ కార్యాలయంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి రాచబంటి రాము జెండా ఆవిష్కరించారు. సిపిఎం పార్టీ మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు పందిళ్ళపల్లి నామవరం బొప్పారం రేపల్లెవాడ తిమ్మినేని పాలెం నరసింహాపురం నాగులవంచ గ్రామాలలో జెండా ఆవిష్కరించారు. మండల కమిటీ సభ్యులు వ్యవసాయ కార్మిక వ్యవసాయ కార్మిక మండల కార్యదర్శి వత్సవాయి జానకి రాములు శాఖ కార్యదర్శులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.




## కార్మికులు పోరాడి సాధించుకున్న రోజు మేడే

**మధిర ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే1:** కార్మికులు పోరాడి సాధించుకున్న రోజు మేడే అని ప్రవేట్ ఎలక్ట్రిషన్ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు అన్నారు. మే డే సందర్భంగా గురువారం మధిర పట్టణంలో ప్రధాన రహదారిలో ప్రైవేటు ఎలక్ట్రిషన్ సభ్యులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుడు తన చెమట చుక్కలను, రక్త మాంసాలను కరిగించి పని చేస్తేనే ఈ ప్రపంచం ముందుకు సాగుతుంది. వారి శ్రమకు తగిన గుర్తింపు ఇస్తూ జరుపుకునే పండుగే కార్మిక దినోత్సవం. మే డే కార్మికుల ఐక్యత, పోరాటాలకు నిదర్శనంగా నిలుస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ ఉన్నంత వరకు శ్రమదోపిడీ సర్వసాధారణం. కార్మిక చట్టాలను పారిశ్రామిక రంగం లో అమలు కోసం పోరాటం అవసరం. ముఖ్యంగా కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు ఇస్తూ ఎనిమిది గంటల పని దినం అమల్లోకి రావడంతో జరుపుకునే పండుగే కార్మిక దినోత్సవం. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మధిర స్వాతి ఎలక్ట్రికల్ అధినేత మధిర సేవా సమితి అధ్యక్షులు పల్లపోతు ప్రసాదరావు హాజరై అన్నివేళలా ప్రైవేట్ ఎలక్ట్రిషన్ సభ్యులకు అండదండలుగా ఉంటామని ఇదే విధంగా ప్రైవేట్ ఎలక్ట్రిషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో తిరునగిరి సత్యనారాయణ వైస్ ప్రెసిడెంట్, కారుమంచి అప్పారావు, జనరల్ సెక్రటరీ కారుమంచి అప్పారావు, చింతల నాగరాజు జాయింట్ సెక్రెటరీ, రెడ్డి, పాసికంటి గాంధీ, పిల్లమర్రి ప్రసాద్, వేమిరెడ్డి వెంకటేశ్వరరావు రెడ్డి, రఘు కమిటీ ఆర్గనైజర్ పాల్గొన్నారు.

# నీట్ అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- మే 4న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహణ
- ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 నిమిషాల వరకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి
- మధ్యాహ్నం 1.30 నిమిషాల తర్వాత గేట్ మూసి వేయడం జరుగుతుంది
- 2739 మంది అభ్యర్థులకు 6 పరీక్షా కేంద్రాలు సిద్ధం
- సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం అర్బన్, ఆర్గాన్ న్యూస్, మే 1 :** వైద్య కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం మే 4న జరిగే నీట్ యు.జి ప్రవేశ పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్, కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి నీట్ యు.జి. ప్రవేశ పరీక్ష నిర్వహణపై సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా పరిధిలో మే 4న మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు జరిగే నీట్ యు.జి. ప్రవేశ పరీక్ష రాసే 2739 మంది విద్యార్థుల కోసం 6 పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలనీ, పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. మే 4న ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 నిమిషాల వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి ఇస్తామని, మధ్యాహ్నం 1.30 నిమిషాలకు గేట్ మూసి వేయడం జరుగుతుందని, అభ్యర్థులంతా తప్పనిసరిగా మధ్యాహ్నం 1.30 లోపే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. అభ్యర్థులను అడ్మిట్ కార్డు లేకుండా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని, పరీక్ష హాల్ ఇన్విజిలేటర్ ఒక కాపీ అడ్మిట్ కార్డ్ కలెక్ట్ చేసుకుంటారని, అభ్యర్థులు రెండు కాపీలు తీసుకుని రావాలని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డ్ డౌన్లోడ్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. 2 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, పోస్ట్ కార్డు సైజు ఫోటో, ఫోటోతో కూడిన ఒరిజినల్ గుర్తింపు కార్డు (ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, రేషన్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్పోర్ట్...) తప్పనిసరిగా తీసుకొని రావాలని కలెక్టర్ తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటలకు పరీక్ష కేంద్రం గేట్ మూసివేస్తామని, గేటు మూసిన తర్వాత ఎవ్వరిని లోపలికి అనుమతించమని, అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, నీట్ పరీక్ష జిల్లా నోడల్ అధికారి నరేంద్ర, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మే డే స్ఫూర్తితో హక్కులకై పోరాడుదాం

### గ్రామ గ్రామాన మేడే జెండాల ఆవిష్కరణ



**కారేపల్లి, ఆర్గాన్ న్యూస్, మే 1 :** పాలకవర్గాల దమనకాండతో చికాగో కార్మిక వర్గం చిందించిన రక్తం విధించిన ఉరిశిక్షను సైతం లెక్క చేయకుండా పోరాడి సాధించిన ఎనిమిది గంటల పని దినం ను కాపాడుకోవడం కోసం వారిచ్చిన స్ఫూర్తితో పెద్ద ఎత్తున ఉద్యమించాలని న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి వై ప్రకాష్ మాస్ లైన్ మండల కార్యదర్శి గుమ్మడి సందీప్ ఖమ్మం డివిజన్ నాయకులు ఎన్ వి రాకేష్ తేజ్యనాయక్ పిలుపునిచ్చారు. 139వ మేడే సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టియుసిఐ ఆధ్వర్యంలో కారేపల్లి మండల పరిధిలోని టేకులగూడెం తొడితలగూడెం పంతులు నాయక్ తండ పోలంపల్లి మాదారం ఉసిరికాయపల్లి చిన్న మడంపల్లి గ్రామాలలో జండాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ అసంఘటిత కార్మిక వర్గం ఎలాంటి సామాజిక భద్రత లేదని మరోపక్క కార్పొరేట్ శక్తులకు 15 లక్షల కోట్ల రాయితీలుగా ప్రభుత్వ రంగ సంస్థలు అప్పగిస్తున్నారని విమర్శించారు. మరోపక్క పేదలకు ఇచ్చే సంక్షేమ పథకాలుపై కోత విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు అన్ని రకాల అసంఘటిత కార్మికులను ఆదుకోవాలని ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేసి సమాన పనికి సమాన వేతనం పెన్షన్ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతాంగ విద్యార్థి యువజన మహిళ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మేడే స్ఫూర్తితో పోరాడుదామని వారు పిలుపునిచ్చారు. అలాగే కారేపల్లి క్రాస్ రోడ్ లో సిఐటియు నాయకులు కే నరేంద్ర కొండబోయిన నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మే డే సందర్భంగా జండా ఎగరవేసి ఉత్సవాలు జరిపారు పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు కోయిల శ్రీనివాస్ మాస్ లైన్ టి యుసిఐ మండలం నాయకులు బిక్కసాని భాస్కర్ వెంకటేశ్వర్లు ధరావత్ సక్రు పులకాని సత్తిరెడ్డి వడ్డే వెంకటేశ్వర్లు బాలు రంగ్య సిఐటియు నాయకులు రేగళ్ళ మంగయ్య షేక్ సైదులు కే ఉమావతి సురభి వెంకటేశ్వర్లు ఆటో యూనియన్ నాయకులు బొమ్మల కృష్ణ బట్టు శ్రీనివాసరావు గంగాధరని రవి కృష్ణమూర్తి మోహన్ గుగులోతు రవి తదితరులు పాల్గొన్నారు.



## మాస్ లైన్ ఆధ్వర్యంలో మే డే

**చింతకాని, ఆర్గాన్ న్యూస్, మే 1 :** ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా ఖమ్మం జిల్లా చింతకాని మండల కేంద్రంలో ట్రేడ్ యన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ)కార్మిక సంఘం ఆధ్వర్యంలో మే డే జెండాను టియు సిఐ ఖమ్మం ఏరియా నాయకులు ఎం ప్రభాకర్ ఆవిష్కరించారు. అనంతరం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా నాయకులు కోలేటి నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ చికాగో అమరవీరులు అందించిన ఎర్రని జెండావల్ల ప్రపంచవ్యాప్తంగా కార్మికులు ఎనిమిది గంటల పని దినాన్ని అనుభవిస్తున్నారని, కార్మిక హక్కులు, సౌకర్యాలను సాధించుకున్నారని ఆయన అన్నారు. ఈ మేడే జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో టియుసిఐ ఖమ్మం ఏరియా నాయకులు ఆడెపు కోటేశ్వరరావు అమర్లపూడి అప్పారావు ఆదాం కృష్ణ ప్రసాద్ బండి రమణ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల పోరాటం, శౌర్యానికి ప్రతీక మేడే



**నేలకొండపల్లి, ఆర్గాన్ న్యూస్,మే 1:** కార్మికవర్గ అస్థిత్వానికి సాగిన వీరోచిత పోరాటాలు, త్యాగాలతో పునీతమైన కార్మిక సమరాల శౌర్య పతాకమే మేడే అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్నాటి భాను ప్రసాద్ అన్నారు. గురువారం నేలకొండపల్లి మండల కేంద్రంలోని కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద 139వ ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా అరుణ పతాకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు కార్మికవర్గం జరిపిన పోరాటాల ఫలితంగా దేశంలో 44కార్మక చట్టాలు రుపొందించబడ్డాయన్నారు. మేడే స్ఫూర్తి తో మరో పోరాటానికి సిద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, సీపీఐ మండల సహాయ కార్యదర్శిలు మారిశెట్టి వేంకటేశ్వరరావు పాల్తియా శ్రీనివాస్ రావు కౌన్సిల్ సభ్యులు రాయల మాధవరావు కాశబోయిన అయోధ్య పాలపాటి అశోక్ క్రిష్ణ చావా గణపతి వల్లలా కృష్ణ పొలంపల్లి నారాయణ గుగులోతు వేంకటేశ్వర్లు మేకల బాబు చేన్నబోయిన మల్లయ్య సత్తార్ పుల్లయ్య నేలకొండపల్లి హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు అదే విధంగా సహాయ కార్యదర్శి లు మారిశెట్టి వేంకటేశ్వరరావు పాల్తియ శ్రీనివాస్ రావు కర్నాటి కృష్ణయ్య నగర్ లో మంగాపురం తండా లో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## ఏరియా హాస్పిటల్ తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

**మిర్యాలగూడ ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే 1:** మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఈ రోజు సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో భాగంగా మొత్తం స్టాఫ్ హాజరు పట్టీని పరిశీలించారు. ముందస్తు సమాచారం లేకుండాఎనిమిది మంది డాక్టర్లు డ్యూటీకి గైర్హాజర్ అయినట్టు గుర్తించారు. నేరుగా పేషెంట్ వార్డ్ లకు వెళ్లి రోగులతో వారికి అందుతున్న వైద్య సేవలపై మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు ఆసుపత్రి లోని వివిధ అంశాలపై వైద్యులతో చర్చించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించి గైర్హాజరైన డాక్టర్లపై కలెక్టర్ కు నివేదిక ఇవ్వనున్నట్లు సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ తెలిపారు.

# ప్రాంతీయం



## ఘనంగా మేడే వేడుకలు

**బోనకల్, ఆర్గాన్ న్యూస్, మే 1 :** శ్రామికుల దోపిడీని అరికట్టేందుకు, పరిమిత పని గంటల కోసం ఎన్నో రోజుల పోరాటాల ఫలితంగా, పోరాటాలలో అసువులు బారిన శ్రామికుల త్యాగానికి సాక్షిగా, కార్మికులకు ఎనిమిది గంటల పని దినం అమల్లోకి వచ్చిన మే ఒకటో తారీఖున జరుపుకునే మేడేను కార్మిక కర్షక శ్రామిక వర్గాలు మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నాయి. సిఐటియు కార్యాలయం వద్ద సిఐటియు కన్వీనర్ బోయినపల్లి వీరబాబు,భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయం వద్ద నిర్మాణ రంగం కార్యదర్శి ఎస్కె బుజ్జి మేస్త్రి,జగ్గయ్యపేట ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆటో యూనియన్ ప్రెసిడెంట్ మోదుగు సుధాకర్, బోనకల్ గ్రామంలో సిపిఎం దిమ్మపై భవన నిర్మాణ కార్మికులు గంగుల శివ, బొడ్రాయి సెంటర్లో సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో సిపిఎం గ్రామ కార్యదర్శి ఉప్పర శీను, ఎస్టీ కాలనీలో భూక్యజాలు, కీర్తిశేషులు పారేపల్లి కొండలు ఇంటి వద్ద గుగులోతు పంతు సిపిఎం మండల కార్యాలయంలో మండల కార్యదర్శి కిలారు సురేష్ జెండా ఆవిష్కరణ చేశారు. సిపిఎం కార్యాలయంలో సీనియర్ నాయకులు చింతలచెరువు కోటేశ్వరరావు పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దొండపాటి నాగేశ్వరరావు,గుగులోతు నరేష్, తెల్లాకుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ధన్యవాదములు సీఎం సార్..!!

### బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్



**మిర్యాలగూడ ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే 1 :** దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని బీసీ సంఘాలు చేసే పోరాటానికి మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ పార్టీకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు బీసీ సంఘం నేతలు. దేశవ్యాప్తంగా బీసీ సంఘాలు చేసే పోరాటంలో ప్రధాన ప్రతిపక్షమైనటువంటి కాంగ్రెస్ పార్టీ ఈ దేశంలో మెజార్టీ ప్రజలకు సామాజిక న్యాయం దక్కాలని గత రెండు మూడు సంవత్సరాలుగా దేశంలో సామాజిక న్యాయమే లక్ష్యంగా మాట్లాడుతున్నటువంటి రాహుల్ గాంధీకి మరియు తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్లు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో కల్పిస్తామని అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించిన తెలంగాణ ప్రభుత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఇదే సందర్భంగా దేశంలో సామాజిక న్యాయం కావాలంటే బీసీ సంఘాలతో కలిసి ప్రధాన ప్రతిపక్ష మైనటువంటి కాంగ్రెస్ పార్టీ ప్రత్యక్షంగా పోరాటం వలన ఈరోజు కేంద్రంలో ఉన్నటువంటి ఎన్డీఏ ప్రభుత్వం కులగణనను చేస్తామని ప్రకటించడంపై బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.



## ఐఎన్టీయుసి ఆధ్వర్యంలో మే డే సంబరాలు

**మిర్యాలగూడ ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే 1:** ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా ఐఎన్టీయుసి అధ్యక్షులు ఎస్కే చాంద్ పాషా ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని బిల్డింగ్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అడ్డా వద్ద జెండా ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా శ్రామికులకు కార్మికులకు కాంగ్రెస్ పార్టీ తరఫున మే డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి సి సి మెంబర్ సి హెచ్ కృష్ణయ్య పట్టణ అధ్యక్షులు గాయం ఉపేందర్ రెడ్డి కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ముదిరెడ్డి నర్సిరెడ్డి మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఎమ్ ఏ సలీం మహిళా జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి సీనియర్ నాయకులు పి రామలింగయ్య ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## టీఎన్టీయుసి ఆధ్వర్యంలో మే డే సంబరాలు

**మిర్యాలగూడ ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే 1:** రైస్ మిల్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు ముక్కెన అంజిబాబు యాదవ్ ఆధ్వర్యంలో టీ ఎన్ టీ యు సి ఆఫీస్ లో మే డే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలకై సంబంధిత యాజమాన్యం తో చర్చించి రాబోయే రోజుల్లో కార్మికులకు మరింత అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగు దేశం పార్టీ మిర్యాలగూడ నియోజకవర్గ ఇంచార్జి బంటు వెంకటేశ్వర్లు హాజరై జెండా ఆవిష్కరణ చేసారు నాయకులు యు శ్రీనివాస్ చిలక వెంకన్న జి కనకయ్య వెంకటేశ్వర్ రావు శంకర్ అశోక్ తదితరులు పాల్గొని కార్మికులకు కార్మిక దినోత్సవశుభాకాంక్షలు తెలిపారు.

## బీఆర్ఎస్ విధానమే ప్రపంచానికి దిక్సూచి

### మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు



**మిర్యాలగూడ ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే 1 :** మే డే స్ఫూర్తితో కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలుచేసిన పారిశ్రామిక విధానమే యావత్ ప్రపంచానికి దిక్సూచిగా మారిందని మిర్యాలగూడ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్ రావు తెలిపారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మిక కర్షకలోకానికి ఆయన మే డే శుభాకాంక్షలు తెలిపారు బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం ఆధ్వర్యంలో పట్టణంలో హనుమాన్ పేట ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలోని రైస్ మిల్లర్స్ డ్రైవర్స్ అసోసియేషన్ మరియు మినీ డీసీఎం డ్రైవర్స్ ఓనర్స్ అసోసియేషన్ వద్ద నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో భాస్కర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్పత్తి సేవా రంగాలను బలోపేతం చేసే దిశగా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన నూతన పారిశ్రామిక విధానం ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలను అందుకుందని అన్నారు. వినూత్న పారిశ్రామిక విధానాల ద్వారా తెలంగాణలో సంపద సృష్టించబడిందన్నారు. తద్వారా దేశాభివృద్ధికి దోహదపడుతున్నదని పేర్కొన్నారు. నిరుద్యోగులు కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి లభిస్తున్నదని భాస్కర్ రావు తెలిపారు. కార్మికులంతా సంఘటితంగా ఉండి శ్రమశక్తిని ఎలుగెత్తి చాటాలని ఆయన ఆకాంక్షించారు. కార్మికుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు శ్రామికుల కుటుంబాల్లో వెలుగులు నింపాయని భాస్కర్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి యడవెల్లి శ్రీనివాస రెడ్డి జొన్నలగడ్డ రంగా రెడ్డి ఎండీ మగ్దూమ్ పాషా, ఇలియాస్ ఖాన్ పిన్నబోయిన శ్రీనివాస్ యాదవ్ పిసికె ప్రసాద్ కార్మిక విభాగం నాయకులు దుండిగల అంజయ్య అయిల వెంకన్న పట్టేం శ్రీనివాస రావు, మట్టపల్లి సైదయ్య యాదవ్ షోయబ్ తిరుపతయ్య గౌడ్ బీమ్లు నాయక్ చిమట మల్లయ్య యాదవ్ పట్టాభి గురుకులాల అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ రాష్ట్ర అధ్యక్షులు వాంకుడోతు సురేష్ నాయక్ ధనమ్మ ఉమా తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి ఓటమిని పాఠంగా స్వీకరించాలి

### గాంధీజీ విద్యాసంస్థలను అభినందించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**మునుగోడు, ఆర్గాన్ న్యూస్, మే 1:** తెలంగాణ ప్రభుత్వం బుధవారం నాడు ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో చండూరు మున్సిపాలిటీలోని గాంధీజీ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థిని గుడిసె అమూల్య శ్రీ మరియు మండల ర్యాంకర్లను గురువారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మునుగోడు క్యాంపు కార్యాలయం నందు ఘనంగా సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతమైన కోటయ్యగూడెంనకు చెందిన అమ్మాయి 590 మార్కులతో ఉమ్మడి నల్గొండ జిల్లా మొదటి ర్యాంకును మరియు స్టేట్ ర్యాంకు సాధించడం మునుగోడు నియోజకవర్గానికి గర్వకారణమని, అమ్మాయికి విద్యను అందించిన గాంధీజీ విద్యాసంస్థల యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను అభినందిస్తున్నానని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేయిల పాఠశాలల్లో గాంధీజీ పాఠశాల మొదటి ర్యాంకును సాధించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులలో ఎల్లవేళలా పోరాడే తత్వం ఉండాలని, ఒకసారి తక్కువ మార్కులు వచ్చాయని కుంగిపోకుండా అనునిత్యం పోరాడుతూనే ఉండాలని, ప్రతి విద్యార్థి ఓటమిని పాఠంగా స్వీకరించాలన్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో ఓటమి చెందానని ఇంట్లోనే కూర్చుంటే మళ్ళీ ఇప్పుడు ఎమ్మెల్యేగా తాను గెలిచే వాడిని కానని ఉదహరిస్తూ... తక్కువ మార్కులు వచ్చాయని ఎప్పుడూ కూడా కృంగిపోవద్దని, మునుముందు బాగా చదివి ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని విద్యార్థుల్లో చైతన్యాన్ని నింపారు. సన్మానం పొందిన వారిలో మండల రెండవ ర్యాంకు పందిరి శివప్రియ రెడ్డి 579 మార్కులు, మండల మూడవ ర్యాంకు ధార హాసిని 577 మార్కులు, మండల నాల్గవ ర్యాంకు ఉప్పల రేణుక 575 మార్కులు, మండల ఐదవ ర్యాంకు నకిరేకంటి హన్సిక 574 మార్కులు, ఆవుల శివాని 574 మార్కులు, మండల ఆరవ ర్యాంకు తుమ్మల నేహ శ్రీ 573 మార్కులు, మండల ఏడవ ర్యాంకు పెండెం శృతి 572 మార్కులు, మండల ఎనిమిదవ ర్యాంకు పూజా వైష్ణవి మరియు అజయ్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు కోడి శ్రీనివాసులు సరికొండ వెంకన్న కర్నాటి నాగరాజు సత్యనారాయణ మూర్తి, వెంకటేశ్వర్లు పులిపాటి రాధిక చిలుకూరి రామేశ్వరి ఉపాధ్యాయులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అనుభవం అంకితభావం గల బోధనా సిబ్బందితోనే సంచనల విజయం

- త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ గొల్లపూడి జగదీష్
- ఎస్.ఎస్.సి ఫలితాలలో త్రివేణి విద్యార్థుల ప్రభంజనం



**కొత్తగూడెం ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే 1 :** ఎస్.ఎస్.సి ఫలితాలలో ఎప్పటిలాగే త్రివేణి విద్యార్థులు తమ సత్తా చాటారు. టాప్ మార్కులను సాధించి తమ ప్రతిభను చూపారు. ప్రగతి ఫలాల తెలంగాణాలో రాష్ట్రవ్యాప్తంగా విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో త్రివేణి విద్యార్థులు విజయదుంధిభి మ్రోగించారు. ఈ సందర్భంగా కొత్తగూడెంలో త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ గొల్లపూడి జగదీష్ పత్రికలకు ప్రకటనను విడుదల చేసారు. తమ విద్యార్థులు గత ఎస్.ఎస్.సి గ్రేడుల్లో మేమే, నేటి మార్కుల్లో కూడా మా త్రివేణి ముందంజలో ఉందని నిరూపించుకుంది. ఎస్.ఎస్.సి మార్కుల ప్రకారం 600కి మార్కులు. 593 మా విద్యార్థిని ఆర్.రిషిక శ్రీ స్టేట్ 4వ ర్యాంకు సాధించినదని తెలిపారు. ఇవే కాకుండా 590, 587, 587, 587, 586, 586, 586, 586, 584, 583, 583, 583, 582, 582, 581, 581, 581, 581, 580, 580, 580 ఆ పైన సాధించిన వారు 22 మంది, 570 పైన సాధించినవారు 42 మంది రాష్ట్రస్థాయిలో ఉత్తమమైన ఫలితాలు సాధించి త్రివేణిని మొదటి స్థానంలో నిలిపారు. కొత్తగూడెంలోని త్రివేణి హైస్కూల్ లో 600కి గాను 593 మార్కులను సాధించి కొత్తగూడెం త్రివేణి ఖ్యాతిని చాటిచెప్పారు. 580 పైన నలుగురు, 570 పైన 19 మంది, 560 పైన 35 మంది, 550 పైన 53 మంది సాధించారని డైరెక్టర్ గొల్లపూడి జగదీష్ తెలిపారు. కొత్తగూడెం పట్టణంతో పాటు జిల్లా, రాష్ట్రస్థాయి లో తన కంటూ ఒక ప్రత్యేకతను త్రివేణి కలిగి ఉందన్నారు. అనుభవం, అంకితభావంగల బోధనా సిబ్బంది ఉండటంవలన ఈ సంచలన విజయాలు సాధించడం సాధ్యమైందని పేర్కొన్నారు. విజయం సాధించిన విద్యార్థులకు త్రివేణి పాఠశాలల డైరెక్టర్స్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, గొల్లపూడి జగదీశ్, సి.ఆర్.ఓ. కాట్రగడ్డ మురళీ కృష్ణ, ప్రిన్సిపాల్స్ వై.వి.సురేష్, శ్రీనివాస్ సింగ్, వైస్ ప్రిన్సిపాల్ సౌజన్య అభినందలను తెలియజేసారు.

## అమ్మ లాంటి మాధూరమ్మ మామిడికాయ పచ్చళ్లు

### మంత్రి పొంగులేటి సతీమణి అమ్మ మనసు



**కొత్తగూడెం ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే1 :** వేడి వేడి అన్నంలో కాస్తంత ఆవకాయ పచ్చడి, నెయ్యి వేసుకొని తినడం తెలుగు రాష్ట్రాల ప్రజలకు అలవాటు. అందుకే వేసవి కాలం వచ్చిందంటే చాలు.. చాలామంది తమ అమ్మగారింటి నుంచి వచ్చే ఆవకాయ పచ్చడి కోసం ఎదురు చూస్తుంటారు. ఇదంతా ఎందుకంటారా అమ్మగారింటి నుంచి ఆవకాయ పచ్చడి రావడం సహజం, కానీ అదే ఆవకాయ పచ్చడి మంత్రిగారి సతీమణి చేతుల మీదుగా తయారై మనం తినే పల్లెంలోకి వస్తే.. ఆ సంతోషమే వేరు కదా! ఈ విషయంలో తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ ఆఫీసుకు వచ్చే అభిమానులు, ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు అదృష్టవంతులనే చెప్పాలి. ఇంతకీ విషయమేమిటంటే.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురికి అమ్మలాంటి మనసు ఉందని ఆయన ఆఫీసుల్లో పనిచేసే సిబ్బంది చెబుతుంటారు. ఏటా వేసవి కాలం వచ్చిందంటే చాలు.. స్వయంగా మాధురి క్వింటాళ్ల కొద్దీ మామిడికాయ పచ్చళ్లు తయారు చేయిస్తారు. ఈ పచ్చళ్ల తయారీలో ఆమె కూడా స్వయంగా పాల్గొంటారు. మామిడి తురుము పచ్చడి, సన్న ముక్కల పచ్చడి, లావు ముక్కల పచ్చడి, అల్లం మామిడి పచ్చడి వంటి రకరకాలుగా మొత్తం పది రకాల మామిడి కాయ పచ్చళ్లు తయారు చేయిస్తుంటారు. ఇలా తయారైన పచ్చళ్లను ఏం చేస్తారో తెలుసా? మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చే ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు, నాయకులకు మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేస్తుంటారు. ఆ సందర్భంగా మంత్రి సతీమణి మాధురి చేతుల మీదుగా తయారైన మామిడి కాయ పచ్చడిని కూడా వడ్డిస్తుంటారు. అంతేకాదు పొంగులేటి కుటుంబానికి చెందిన రాఘవ కన్ స్ట్రక్షన్స్, క్యాంపు ఆఫీసు, హైదరాబాద్ లోని తమ ఆఫీసుల సిబ్బందికీ జాడీల కొద్దీ పచ్చళ్లు పంపిస్తుంటారు. మరికొన్ని జాడీల పచ్చళ్లను తమ వియ్యంకుల కుటుంబాలకు, సమీప బంధువులకు కూడా పంపిస్తుంటారు. ఇలా ఏటా పచ్చళ్ల తయారీ ప్రక్రియను మంత్రి సతీమణి మాధురి ఎన్నో ఏళ్లుగా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు.



## టాస్కా అవగాహనతో వృద్ధుల్లో ధీమా

- వంగపల్లి, తాల్లగూడెం గ్రామ వృద్ధుల్లో కనిపించిన అవగాహన
- అధ్యక్షుడు ముదుంబై జయమోహనా చార్య సారథ్యంలో జోరు పెంచిన టాస్కా

**యాదాద్రి, ఆర్గాన్ న్యూస్, మే 1:** ఒక అంచనా ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో 55 వేల మంది వయోజనులున్నారని, వారందరినీ టాస్కా ( తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్) గొడుగు కిందకు చేర్చి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను చట్ట పరంగా పరిష్కరించడంతో పాటు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారి దరిచేర్చడమే టాస్కా ఉద్దేశ్యమని యాదగిరిగుట్ట మండల టాస్కా అధ్యక్షుడు ముదుంబై జయమోహనా చార్య అన్నారు. గురువారం డాక్టర్ రాగి సహదేవ్, నూకల సుధాకర్ రెడ్డి, గుంటి యాదగిరి, గుండ్లపల్లి మల్లేశం గౌడ్ తదితర సభ్యులతో కలిసి వంగపల్లి, తాల్లగూడెం గ్రామాల్లో వయోజనులతో కలిసి టాస్కా ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. పోస్టర్లను అతికించారు. వంగపల్లి అవగాహన కార్యక్రమం లో మదర్ డెయిరీ డైరెక్టర్ కల్లేపల్లి శ్రీశైలం, కానుగు బాలరాజు, మంగళగిరి రవి చందర్, నర్సింగ్ రావు, బి భద్రయ్య, కిష్టయ్య, పి వెంకటేశం తదితరులు పాల్గొనగా... తాళ్ళగూడెం గ్రామంలో సుదగాని బలరాములు, లగ్నాల మైసయ్య, బత్తిని ఆంజనేయులు, కొమ్మగాని చంద్రయ్య, ఏదులకంటి దాసు, ర్యాకల వెంకటేష్, సుదగాని నాగేష్, బాలచందర్, బి కిష్టయ్య, బి నర్సింహులు పాల్గొన్నారు.

### ఉచిత వృద్ధాశ్రమం పై ఆసక్తి

మండల కేంద్రమైన యాదగిరిగుట్ట లో ప్రభుత్వ పరంగా 150 పడకల ఉచిత వృద్ధాశ్రమం నిర్మించాలని, ఉచిత వైద్య సహాయం అందించాలని, టాస్కా భవనం నిర్మించాలన్న అధ్యక్షుడు ముదుంబై జయమోహనా చార్య విజ్ఞప్తి పట్ల ఆయా గ్రామ వయోధికుల్లో ఆనందం వ్యక్తం అయ్యింది. నిస్వార్థంగా టాస్కా చేస్తున్న కృషిని ఆయన వివరిస్తూ ఐకమత్యమే మహా బలం అన్నారు. త్వరలో జిల్లా నాయకులతో కలిసి వచ్చి టాస్కా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడతామన్నారు.



## తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా మేడే

**బోనకల్, ఆర్గాన్ న్యూస్, మే 1 :** ప్రపంచ కార్మికుల దినోత్సవం మే డే సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ రావట్ల సత్యనారాయణ అధ్యక్షతన మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. రైతు జిల్లా నాయకులు నందమూరి సత్యనారాయణ టి ఎన్ టి యు సి జండా ఆవిష్కరణ చేశారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెదేపా నాయకులు మాట్లాడుతూ శ్రామికుల దోపిడీని అరికట్టడం కోసం కార్మికులకు పరిమిత పని గంటల కోసం ఎన్నో ఏళ్లుగా చేసిన పోరాట ఫలితంగా 8 గంటల పని దినం గా మే ఒకటో తారీఖున ప్రకటించడంతో కార్మిక కర్షక వర్గాలు మే డే ని ఒక పండగ లాగా జరుపుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మైనేని రవికుమార్,మరీదు బరకయ్య, బందం రంగయ్య,దుగ్గి భద్రయ్య, సాధినేని సీతారామకృష్ణ గుడిపూడి వెంకటనారాయణ చింతల లక్ష్మణ్ ఎస్ కె మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



## సామ్రాజ్యవాదుల నుంచి శ్రామికవర్గాన్ని రక్షించేది 'ఎర్ర జెండానే'

- ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ఏకైక పండుగ 'మేడే'
- కమ్యూనిస్టులు బలపడితేనే పేదవర్గాలకు న్యాయం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- కొత్తగూడెంలో రెపరెపలాడిన 'అరుణ పతాక'
- సిపిఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా మేడే ఉత్సవాలు

**కొత్తగూడె ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే 1 :** కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని కార్మిక క్షేత్రాలు కార్మిక వాడలు ఉద్యోగ క్షేత్రాలు బస్తీలు గ్రామాల్లో ఎర్రజెండా రెపరెపలాడింది. సిపిఐ అనుబంధ ప్రజాసంఘాలు ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం నియోజకవర్గ వ్యాప్తంగా 283 కేంద్రాల్లో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయాలు, విద్యానగర్ బైపాస్ రోడ్డు గ్రామపంచాయతి కార్యాలయం ఆటో హమాలీ సింగరేణి ప్రధాన కార్యాలయం రైతుబజార్ భవన నిర్మాణ కార్మికుల అడ్డా తదితర ప్రధాన సెంటర్లలో సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు మేడే జెండాను ఆవిష్కరించారు చికాగో అమరవీరులకు నివాలులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభల్లో కూనంనేని మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ఏకైక పండుగ మేడే అని అన్నారు. 1886లో అమెరికాలోని చికాగో నగరంలో ఎనిమిది గంటల పనివిధానంకోసం జరిగిన సమ్మె సందర్భంగా పాలకులు, యాజమాన్యం జరిపిన కాల్పుల్లో మరణించిన కార్మికుల రక్తంతో తడిసిందే ఈ ఎర్రజెండాఅని పేర్కొన్నారు. వారి అమరత్వంతోనే ఎనిమిది గంటల పనివిధానంతోపాటు అనేక కార్మిక చట్టాలు, హక్కులు ఏర్పడ్డాయని, చికాగో అమరుల స్ఫూర్తితో భారతదేశంతోపాటు ప్రపంచ వ్యాప్తంగా జరిగిన ఉద్యమాలకు ఏలికలు దిగిరాక తప్పలేదన్నారు. బ్రిటీష్ రాజ్యంలో, ఆ తర్వాత స్వతంత్ర భారతంలో పోరాడి, త్యాగాలు చేసి సాధించుకున్న కార్మికుల హక్కులను ఏకమొత్తంగా బిజెపి ప్రభుత్వం రద్దు చేసే కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. సామ్రాజ్యవాద శక్తుల చేతిలో మగ్గుతున్న శ్రమకవర్గాన్ని రక్షించేది ఎర్ర జెండానేనని అన్నారు. 139వ మేడే స్ఫూర్తితో ప్రజాస్వామ్య రక్షణ, కార్మిక హక్కులు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం కమ్యూనిస్టు పార్టీ నిర్వహించే పోరాటాల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గరాసి వెంకటేశ్వర్లు, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, జి వీరాస్వామి, జి నగేష్, కందుల భాస్కర్, భూక్యా శ్రీనివాస్, రత్నకుమారి, పొలమూరి శ్రీనివాస్, దీటి లక్ష్మీపతి, బానోత్ గోవిందు, వంగ వెంకట్, అహీమ్, రమణమూర్తి, నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, మాచర్ల శ్రీనివాస్ పోరెడ్డి శ్రీనివాసరెడ్డి ధర్మరాజు యూసుఫ్ నేరెళ్ల శ్రీనివాస్ బోయిన విజయ్ కుమార్ లక్ష్మి, ధనలక్ష్మి భాగ్యలక్ష్మి షాహీన్ బత్తుల సత్యనారాయణ నేరెళ్ల రమేష్ ఆరెల్లి కృష్ణ అబ్బులు జహీర్ విజయలక్ష్మి సప్పిడి కోటేశ్వరరావు షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయం




## కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా మే డే

**కల్లూరు, ఆర్గాన్ న్యూస్, మే 1 :** రెవెన్యూ డివిజన్ కేంద్రంలో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా ఎర్ర జెండాల రెపరెపల నడుమ కార్మిక సంఘాలు 139 వ మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించి జండా ఆవిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా టియుసిఐ జిల్లా అధ్యక్షులు వెంకన్న మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేయడం లేదని అన్నారు. కార్మిక సంఘాల నాయకులు రక్త తర్పణ, జైలుకెళ్లి హింసించబడి, పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్ లుగా విభజించి కార్మికుల శ్రమను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నాడని అవి అమలు అయితే కార్మికులు రోడ్డున పడి అడుక్కునే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు రిటైర్డ్ అయిన తర్వాత 9 వేలు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలను వెనుకకు తీసుకోవాలని, నాలుగు లేబర్ కోడ్ లు రద్దుచేయాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ కార్యదర్శి సీతారాములు, సత్యం, మంగన్న, పరిమళ, మాల్యాద్రి, పున్నయ్య కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



## మహిళా సాధికారతకు పెద్దపీట

### జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే1 :** సంగారెడ్డి జిల్లాగురువారం కలెక్టరేట్లోనీ మిని సమావేశమందిరంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ జిల్లాలో మహిళా సాధికారత లో భాగంగా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా డ్రోన్లు మహిళా పెట్రోల్ బంకులు కమర్షియల్ కాంప్లెక్సు ఇటుకల తయారీ విద్యార్థులకు ఏకరూప దుస్తుల కుట్టు లాంటి కార్యక్రమాలు జిల్లాలో మహిళలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. మహిళా సంఘాల మహిళలు వారి ఉత్పత్తులైన లక్క బొమ్మలు జూట్ బ్యాగులు తయారుచేసి సంగారెడ్డిజిల్లా పేరు మీద మంజీరా మహిళా శక్తి అనే స్టాల్ ను శి ల్పారామంలో ఏర్పాటు చేసి వాటిని విక్రయించి జిల్లాకు దేశవ్యాప్తంగా గుర్తింపు తేవాలన్నారు. న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల్లో ఉన్న మహిళలందరూ తప్పనిసరిగా 100 శాతం అక్షరాస్యత కలిగి ఉండాలన్నారు. డ్రోన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు 80% సబ్సిడీ కింద డ్రోన్లు అందించలన్నారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మహిళా పెట్రోల్ బంకుల్ని ఈ నెలలో ప్రారంభించుకోవాలన్నారు. క్యాబ్ డ్రైవర్ గా శిక్షణ పొంది లైసెన్స్ తీసుకున్నా మహిళలకు జిల్లాలో ఉన్న ప్రైవేటు కంపెనీలలో డ్రైవర్లుగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పిడి డిఆర్ డిఏ జ్యోతి పి డి మెప్మా గీత సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించాలి

- పది ఫలితాల్లో సంగారెడ్డి జిల్లా అగ్రగామి
- పదవ తరగతి ఫలితాలలో రాష్ట్రస్థాయిలో జిల్లాకు 2వ స్థానం
- జిల్లాలో పదో తరగతి ఫలితాల్లో 99.09 శాతం తో ఉత్తీర్ణత

**సంగారెడ్డి ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే 1:** రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు.. సత్ఫలితాలు నిచ్చిన ప్రత్యేక తరగతుల విద్యా బోధన విద్యార్థులకు, తల్లిదండ్రులకు ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు కలెక్టర్ క్రాంతి వల్లూరు. పదో తరగతి పరీక్షా ఫలితాలలో సంగారెడ్డి జిల్లా రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించింది. ఈ సంవత్సరం 99.09 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 2 వ స్థానంలో నిలవడం ఉత్తమ ఫలితాల దిశగా సరికొత్త వరవడి సృష్టించిందని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. ఈ సందర్భముగా కలెక్టర్ తన ఛాంబర్ లో రాష్ట్రస్థాయిలో పదో తరగతి ఫలితాల్లో సంగారెడ్డి జిల్లా ద్వితీయ స్థానం సాధించినందుకు ప్రభుత్వ పాఠశాలలో చదివిన మొదటి నాలుగు స్థానాలు సాధించిన విద్యార్థులకు కలెక్టర్ క్రాంతి వల్లూరు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ విద్యార్థులను వారి తల్లిదండ్రులను ప్రధానోపాధ్యాయులను సన్మానించారు ( జి.వర్షిత ు 590 ,జెడ్ పి హెచ్ ఎస్ కంకోల్ , వి. గాయత్రి ు 588, జెడ్ పి హెచ్ ఎస్ చీరియల్). ఎం. రిషిత ు 586,( టీఎంఆర్ఎస్ అందోల్), హెచ్. ద్రిషిక (586:జడ్పీ హెచ్ ఎస్ చీరియల్) విద్యార్థుల కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భముగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ పదో తరగతి పరీక్ష ఫలితాలలో విద్యార్థుల భవిషత్తు ముడిపడి ఉంటుందని అన్నారు . విద్యతోపాటు జిల్లాను అన్ని రంగాలలో ముందంజలో ఉంచాలని అన్నారు . జిల్లాలో విద్యకు సంబంధిచి జిల్లా కల్లెక్టర్ గా తనవంతు పూర్తి సహకారాలు అందిస్తానాని తెలిపారు విద్యార్థులు ఐ ఐ టి లలో ,ఉన్నత విద్యలో జిల్లాకు మంచి పేరు తేవాలనీ,మంచి ర్యాంక్ తెచ్చుకోవాలి జీవితం లో ఉన్నతంగా ఎదగాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో జిల్లా మొదటి స్థానంలో రావాలన్నారు. జీవితం లో 10వ తరగతి చాలా ముఖ్యమైనదని అందుకే విద్యార్థులు విద్యాసంవత్సరం మ్నొదటి నుంచే సన్నద్ధం అవుతారని అటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ విద్యార్థులకి మంచి విద్యను అందించే ప్రయత్నం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ శంకర్ ,డి సి బి సెక్రటరీ లింబాజి ,ఏసి సి ఈ పందరి నాయక్ ,సీఎంఓ వెంకటేశం ,ఏఎంఓ బాలయ్య ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ వెంకటస్వామి డిఎస్ ఓ పి. సిద్దారెడ్డి , ఎస్ఎస్సి ఎగ్జామ్స్ సిబ్బంది శివ వెంకట్ ప్రవీణ్ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు రాక లబ్ధిదారుల గగ్గోలు!

- ఇందిరమ్మ రాజ్యమంటే ఇంతేనా..?
- నచ్చిన వాళ్ళకే ఇండ్లు కేటాయింపులు
- పరిశీలించి న్యాయం చేయాలని వేడ్కోలు
- అర్హులకే ఇండ్లు ఇవ్వాలన్న లక్ష్యానికి తూట్లు





**కల్లూరు, ఆర్గాన్ న్యూస్, మే 1 :** కాంగ్రెస్ ప్రభుత్వం అంటే పేదలకు గూడు, నీడకి ప్రాధాన్యమిస్తూ అన్ని వర్గాల ప్రజలలోని అర్హులైన అందరికీ సంక్షేమ ఫలాలు అందజేయడంలో ముందుంటుంది. గతాన్ని పరిశీలిస్తే మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో కానీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో గాని ఎవరైతే అర్హులు ఉన్నారో ప్రతి ఒక్కరికి ఇండ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ కి ఉంది. అదే సదుద్దేశంతో ప్రస్తుతం అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ ప్రభుత్వం గత 10 ఏళ్లలో నిరుపేదలకు ఇండ్లు లేక నానా అవస్థలు పడ్డారని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు ఇవ్వాలని ఇందిరమ్మ ఇళ్ళను పారదర్శకత కోసం గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలను వేసి నిజమైన అర్హులను గుర్తించాలని సూచించింది. ఇందిరమ్మ మోడల్ హౌస్ శంకుస్థాపన కార్యక్రమంలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగిలేటి శ్రీనివాస రెడ్డి పార్టీలకు అతీతంగా ఎవరైతే అర్హులు ఉన్నారో వారికే ఇండ్లు కేటాయించాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. కానీ ప్రస్తుతం మండలంలోని ఇందిరమ్మ ఇండ్లు కేటాయింపులో మంత్రి మాటలను బేకాతర్ చేస్తూ ఇష్టమొచ్చి నట్లుగా వారికి నచ్చిన వారికి ఇండ్లు కేటాయిస్తున్నారని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అర్హత జాబితాలో ఉండి తమకు ఇల్లు వస్తుందని తమ కష్టాలు తీరిపోతాయని కోటి ఆశలతో ఎదురుచూస్తున్న నిజమైన లబ్ధిదారులకు చుక్కెదురైంది. భూమి ఉండి సొంత భవనం కలిగిన వారికి ఇల్లు కేటాయిస్తూ అస్సలు ఇల్లు, భూమిలేని నిరుపేదలను వదిలేయడం ఇందిరమ్మ రాజ్యానికి మచ్చ తెచ్చే విధంగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికే అర్హత లేని వాళ్ళకి కేటాయించారని మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. పట్టణంలో తమ అనుచరులకు ఇల్లు రాలేదని ఇరువర్గాలు ఘర్షణ పడిన సంఘటన చోటుచేసుకుంది. ఇదే పరిస్థితి చిన్నకోరుకొండి గ్రామంలో ఏర్పడింది. దాదాపు 35 మంది ఇల్లు లేని నిరుపేదలున్నారని ఒక్కో ఇంట్లో మూడు కుటుంబాలు జీవిస్తున్నారని, గత వర్షాలకు గోడలు కూలి నిరాశ్రయ స్థితిలో ప్రభుత్వ పాఠశాలలో తలదాచుకున్న కుటుంబాలను సైతం వదిలేశారని, చిన్నపాటి వర్షాలకు ఇల్లు కురుస్తూ చిన్న పిల్లలతో అవస్థలు పడుతున్న మాపై దయ చూపడం లేదని ఆవేదన చెందుతున్న దీనస్థితి గ్రామంలో కనబడుతుంది. ఒక్క చిన్నకోరుకొండి గ్రామమే కాకుండా మండలంలో దాదాపు ఇదే పరిస్థితి ఉందని అంటున్నారు. ప్రజా ప్రభుత్వంగా ప్రజా పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పునః పరిశీలించి నిజమైన లబ్ధిదారుల జాబితాను ఎంపిక తయారు చేసే బాధ్యతను అప్పగిస్తే వచ్చిన అధికారులు తూతూ మంత్రంగా సర్వే చేసి వెళుతున్నారని తెలిపారు. గ్రామస్థాయిలో జరుగుతున్న వ్యవహార శైలిని ఉన్నత అధికారులు, స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు పరిశీలించి నిజమైన లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించి ఆదుకోవాలని కోరుతున్నారు ఇదేనా..? ఇందిరమ్మ రాజ్యమంటే అంటూ తమ బాధను ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

## మే డే స్ఫూర్తితో సమ్మె హక్కును కాపాడుకుంటాం

### సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా మేడే వేడుకలు



**మందమర్రి, ఆర్గాన్ న్యూస్, మే 1 :** 139వ మే డే రోజును పురస్కరించుకొని గురువారం రోజున సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో మందమర్రి ఏరియాలోని అన్ని గనుల పై ఆయా పిట్ సెక్రటరీలు జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఆయా గనుల పైకి ముఖ్య అతిథులుగా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కామ్రేడ్ నాగరాజు గోపాల్ కేకే ఓ సి పి, బ్రాంచ్ అధ్యక్షులు ఎస్ వెంకట స్వామి కాసిపేట 2 గనికి, ఉపాధ్యక్షులు రామగిరి రామస్వామి రామకృష్ణాపూర్ సిహెచ్పి ,సివిల్ ఆఫీస్ కు బ్రాంచ్ ఉపాధ్యక్షులు వడ్లకొండ ఐలయ్య, బ్రాంచ్ సెక్రటరీ అల్లి.రాజేందర్ 5 సివిల్ డిపార్ట్మెంట్ కి ముఖ్య ఆహ్వానితు లుగా హాజరై జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న నాలుగు లేబర్ కోడ్ లలో సమ్మె లేకుండా చేసేలా కుట్ర పన్నుతుండగా, చికాగో అమరవీరుల స్ఫూర్తితో సమ్మె హక్కును కాపాడుకుంటామని, 8గం.ల పని కోసం చికాగోలో పలువురు కార్మికులు అమరులయ్యారని వారి స్ఫూర్తితో పని గంటల పెంపును వ్యతిరేకిస్తూ అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి వెనక్కు తీసుకునేలా చేస్తామని అన్నారు. కలిసి మెలిసి ఉండే శ్రామికుల మధ్య కులం, మతం పేరుతో చిచ్చు పెడుతూ కార్మికులను విడగొట్టాలనీ చూసే వారికి తగిన బుద్ధి చెప్పేలా మేమంతా శ్రామికులం అంటూ అన్నదమ్ముల వలె కలిసి ఉండాలన్నారు. ప్రతి కార్మికుడు తన వంతు బాధ్యతగా నాటి అమరవీరుల స్ఫూర్తితో ఆందోళనలు ప్రదర్శనలో పాల్గొనాలని అన్నారు.

**మే 20న జరిగే సమ్మెను జయప్రదం చేయండి**

కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా మే 20 న జరిగే సమ్మె ను విజయవంతం చేసి నరేంద్ర మోడీ కార్మిక వ్యతిరేక విధానాల పట్ల తమ నిరసనను రోడ్ల పైకి వచ్చి ర్యాలీలు ధర్నాల ద్వారా తెలుపాలని వారు పిలుపునిచ్చారు. యూనియన్ల జెండా రంగులు వేరైనా ఈరోజు కార్మికుల చికాగో లో అమరవీరులైన కార్మికుల స్ఫూర్తితో ఎర్రజెండా ను ఎగురవేస్తారని, అంతటి ప్రాముఖ్యత ఎర్ర జెండాకు ఉందన్నారు. వేతనాల పెంపుకై ఎర్రజెండా వైపు చూసే కార్మికులను రాజకీయ అధికారం వచ్చేసరికి ఎర్రజెండా వైపు చూడకుండా తాత్కాలిక ప్రలోభాలకు గురిచేస్తూ ఐదు సంవత్సరాల కాపరిమితి వరకు తమ చుట్టూ తింపుకుంటూన్న ప్రజా ప్రతినిధుల వైఖరి గమనించాలని అన్నారు. అనంతరం మందమర్రి మార్కెట్ లోని అంబేద్కర్ విగ్రహం నుండి మార్కెట్ ఏరియాలోని యూనియన్ ఆఫీస్ వరకు నినాదాలతో పాదయాత్ర చేస్తూ ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కమిటీ, అన్ని గనుల ఫిట్ సెక్రటరీలు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కార్మికుల పక్షాన ప్రశ్నించే గొంతుక ఎర్రజెండా : ఏఐటియుసి



**గోదావరిఖని, ఆర్గాన్ న్యూస్ మే1:** కార్మికుల పక్షాన నిలబడి వారి హక్కుల సాధనకై పాలకులను, యాజమాన్యాలను నిలదీసే బలమైన గొంతుక ఎర్ర జెండా ఏఐటియుసి అని, ఎర్ర జెండా ఎంత బలపడితే కార్మిక వర్గానికి సరైన న్యాయం జరుగుతుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యునియన్ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషంలు పేర్కొన్నారు. గురువారం 139వ మేడే సందర్భంగా సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని గనులు, డిపార్ట్మెంట్, ఓసిపి 5 మరియు గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన మేడే పతాకాలను ఆవిష్కరణ చేసిన అనంతరం వారు మాట్లాడుతూ 1886లో అమెరికాలోని చికాగో నగరంలో ఎనిమిది గంటల పనివిధానం కోసం జరిగిన సమ్మె ఉద్యమంలో పాలకులు, యాజమాన్యం జరిపిన కాల్పుల్లో మరణించిన కార్మికుల రక్తంతో తడిసిందే ఈ ఎర్రజెండా అని వారు పేర్కొన్నారు. వారి అమరత్వంతోనే ఎనిమిది గంటల పనివిధానంతోపాటు అనేక కార్మిక చట్టాలు, హక్కులు ఏర్పడ్డాయని, చికాగో అమరుల స్ఫూర్తితో భారతదేశంతోపాటు ప్రపంచ వ్యాప్తంగా జరిగిన ఉద్యమాలకు పాలక ప్రభుత్వాలు దిగిరాక తప్పలేదన్నారు. బ్రిటీష్ రాజ్యంలో, ఆ తర్వాత స్వతంత్ర భారతంలో పాలకులతో పోరాడి, త్యాగాలు చేసి సాధించుకున్న కార్మికుల హక్కులను ఏకమొత్తంగా బిజెపి ప్రభుత్వం రద్దు చేస్తోందని, మేడే స్ఫూర్తిగా సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినాన్ని, యూనియన్లు ఏర్పాటు చేసుకునే హక్కును, సమ్మె చేసే హక్కును కూడా హరించి యాజమాన్యాలకు కార్మికుల శక్తిని దోచిపెట్టే కుట్రలకు పాల్పడుతోందన్నారు. దేశ సంపద, కార్మిక చట్టాల పరిరక్షణ ఉద్యమ దినంగా దేశ వ్యాప్తంగా మేడేను జరుపుకుంటున్నామని వారు అన్నారు. మేడే పతాకావిష్కరణ అనంతరం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ నుంచి రీగల్ షుమార్టు వరకు 139 మీటర్ల మేడే పతాకం తో ర్యాలీ నిర్వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఉపాధ్యక్షులు మాదన మహేష్, సహాయ కార్యదర్శి రంగు శ్రీను, బోగ సతీష్ బాబు, కే.శ్రీనివాస రావు, సిద్దమల్ల రాజు, సిర్ర మల్లికార్జున్, ఎం.చక్రపాణి, దొంత సాయన్న, పెర్క మహేందర్, గండి ప్రసాద్, సోహేల్, చెప్యాల భాస్కర్, మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూడి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, గొడిశల నరేశ్, బలుసు రవి, బండి మల్లేష్, దాసరి శ్రీనివాస్, రెడ్డి వెంకట స్వామి, ఎం.సత్యనారాయణ, దాసరి శ్రీనివాస్, వేముల అశోక్, సిపిఐ నాయకులు గౌతం గోవర్ధన్, గోసిక మోహన్, కే.కనకరాజ్, ఎం.ఏ. గౌస్,మడికొండ ఓదేమ్మ, సూర్య, ప్రీతం, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మేడే వేడుకలు

### - ఐ ఎన్ టి యు సి పట్టణ అధ్యక్షులు రంజిత్ గౌడ్ ఆధ్వర్యంలో...

**మందమర్రి, ఆర్గాన్ న్యూస్ ,మే 1 :** 139 వ కార్మికుల దినోత్సవ వేడుకలు మే డే వేడుకలు మందమర్రి ఐఎన్టీయూసీ పట్టణ అధ్యక్షులు వడ్లకొండ రంజిత్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు .ఐ న్ టి యు సి సెక్రటరీ జనరల్ కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బి జనక్ ప్రసాద్, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు సింగరేణి కోల్ మెన్స్ లేబర్ యూనియన్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాంశెట్టి నరేందర్ ఆదేశానుసారం మందమర్రి పాత బస్టాండులో ఫ్లైఓవర్ కింద జండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికులు, వివిధ సంఘాల నాయకులు, ఆటో యూనియన్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణ అధ్యక్షులు రంజిత్ గౌడ్ మాట్లాడుతూ అమెరికా లోని చీకాగో నగరం లోలో 1886 వ సంవత్సరలో జరిగిన కార్మిక ఉద్యమంలో రోజుకు 8 గంటలు మాత్రమే పని వేళలు వుండాలి అని ఉద్యమం యొక్క ముఖ్య ఊద్దేశం తెలిపారు. ఆ ఉద్యమంలో లక్ష మంది కార్మికులు పాల్గొనడం జరిగిందని కార్మికులను అనిచివేసేందుకు జరిగిన ఈ కాల్పుల్లో వంద మందికి పైగా కార్మికులు మరణించడం జరిగింది అని, ఆ చనిపోయిన వంద మందికి గుర్తుగా ప్రతి సంవత్సరం మే 1 వ తారీఖున మే డే జరుపుకోవడం జరుగుతుందని రంజిత్ గౌడ్ తెలిపారు.



## దోపిడీ నుండి విముక్తి కలిగించేది ఎర్రజెండా పోరాటాలే

- దేశానికి ప్రత్యామ్నాయం సోషలిజమే
- మే డే స్ఫూర్తితో కార్మికులు తమ హక్కుల సాధన కోసం పోరాటాలు ఉధృతం చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టి పెళ్లి సైదులు పిలుపు

**సూర్యాపేట, ఆర్గాన్ న్యూస్, మే1:** ప్రపంచ మానవాళికి దోపిడి నుండి విముక్తి మార్గం కలిగించేది ఎర్రజెండా పోరాటాలె అని కార్మికులు, కర్షకులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టి పెళ్లి సైదులు అన్నారు. గురువారం మేడే సందర్భంగా మోతే మండల పరిధిలోని సిరికొండ, రాఘవాపురం ఎక్స్ రోడ్, రాఘవాపురం, నామవరం, మోతే, రావి పహాడ్, మామిళ్లగూడెం, బిఖ్యా తండా గ్రామాలలో సిపిఎం పార్టీ, సిఐటియు ఆధ్వర్యంలో ఎర్రజెండాలు ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా దేశంలోని చికాగో నగరంలో 8 గంటల పని విధానం కోసం పోరాడి అమరులైన కార్మికుల స్ఫూర్తితో ఏర్పడ్డ రోజు ఈ రోజు అని పేర్కొన్నారు. దేశంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని కార్మిక సోదరులకు సిపిఎం పార్టీ తరఫున మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ములుకూరి గోపాల్ రెడ్డి, మండల కమిటీ సభ్యులు కాంపాటి శ్రీను, కిన్నెర పోతయ్య, బూడిద లింగయ్య, చర్లపల్లి మల్లయ్య, జంపాల స్వరాజ్యం, దోస పాటి శ్రీనివాస్, పిడమర్తి అశోక్, నాగం మల్లయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు ఒగ్గు సైదులు, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు చిట్యాల రవిచంద్ర, సిపిఎం నాయకులు కాంపాటి జానయ్య, వెలుగు మధు, సోమ గాని మల్లయ్య, షేక్ జహీనాభి, ఎర్రబోయినమాల్సూర్, బోడపట్ల హుస్సేన్, దోసపాటి ఈదయ్య, ఉపేందర్, మంజుల, షేక్ సైదులు, జలగం తిరుపతయ్య, ఈదయ్య, వెంకన్న, పద్మ, బానోతు లచ్చిరాం, భానోత్ వెంకన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## రాంశెట్టి నరేందర్‌కి శ్రమశక్తి అవార్డు

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు స్వీకరణ

**మందమర్రి, ఆర్గాన్ న్యూస్ మే 1 :** 139 వ మేడే ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రోజున హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో వివిధ కార్మికరంగాల్లో విశిష్ట సేవలందించిన వివిధ కార్మిక నాయకులకు తెలంగాణ ప్రభుత్వ అత్యున్నతస్థాయి "శ్రమశక్తి" అవార్డును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇతర మంత్రుల చేతుల మీదుగా ప్రదానం చేయడమైనది. సింగరేణిలో మందమర్రి ఏరియాకు చెందిన కేకే 5 గనిలో అసిస్టెంట్ చైన్ మాన్ గా విధులు నిర్వహిస్తు ఐ ఎన్ టి యు సి మంచిర్యాల జిల్లా అధ్యక్షులుగా, సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ కేంద్ర కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా కార్మిక వర్గానికి సేవలందిస్తున్న రాంశెట్టి నరేందర్ ముఖ్యమంత్రి చేతుల మీదుగా శ్రమశక్తి అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల అభిమాన నాయకుడైన సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ అవార్డును తీసుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాననీ, తనకు ఇంతటి గొప్ప అవకాశాన్ని కల్పించినందుకు ఐఎన్టియుసి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి సంజీవరెడ్డి కి, ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బి జనక్ ప్రసాద్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఐఎన్టీయూసీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ అవార్డు ద్వారా నా బాధ్యత ఇంకా పెరిగిందని, కార్మికుల కోసం పాటుపడతానని తెలియజేశారు.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యంపై నిషేధాజ్ఞలు కొనసాగింపు

- అనుమతి లేని డ్రోన్,డిజె సౌండ్స్ పై చర్యలు
- పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా



**గోదావరిఖని,ఆర్గాన్ న్యూస్, మే 1 :** సాధారణ పౌరులు ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రామగుండం కమిషనరేట్ పరిధిలో మంచిర్యాల, పెద్దపల్లి జోన్ లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం పై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగిస్తున్నామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నామని తెలపడం జరిగింది. మద్యం సేవించి వీధుల్లో రోడ్లపైన అసభ్య పదజాలంతో మాట్లాడటం, అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందిగా పరిణమిం దని, మద్యం ప్రియులు ఆగడాలకు కళ్లెం వేయడంలో పాటు ప్రజల భద్రత రక్షణ కోసం నిషేధాజ్ఞలు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు 01-05-2025 నుండి 01-06-2025 వరకు కొనసాగుతాయని తెలిపారు. పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాలం పరిమితి పొడిగించబడే అవకాశం ఉందని అన్నారు. భారతియ న్యాయ సంహిత బి ఎన్ ఎస్ 223, హైదరాబాద్ నగర పోలీసు చట్టం, 1348 ఫసలీ నిబంధనలను అనుసరించి నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిపి హెచ్చరించారు

**డీజే, డ్రోన్‌లపై నిషేధాజ్ఞలు పొడగింపు**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మంచిర్యాల, పెద్దపల్లి జోన్ లలో డీజే సౌండ్ ల వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలు పొడగించమని అని సిపి గారు తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశామని అన్నారు. చిన్నపిల్లలు వృద్ధులు రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా, శబ్ద కాలుష్యం నుంచి కాపాడేందుకు భారీ సౌండ్ లతో కూడిన డిజె సౌండ్ వినియోగం పై నిషేధాజ్ఞలు విధించారు. వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజల సమీకరణ, ప్రదర్శనల కోసం డీజే సౌండ్ల వినియోగిస్తున్నారని అయితే వివిధ కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్ వినియోగం తప్పనిసరి అని అనిపిస్తే సంబంధిత డివిజన్ ఏసిపి ల అనుమతి పొందాలని సూచించారు. సిటీ పోలీస్ యాక్ట్, పోలీస్ యాక్టు 1-మే2025 ఉదయం 6:00 నుండి 1 జూన్ 2025 ఉదయం 6 గంటల వరకు ఆమలులో వుంటుంది అని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదు. పైన పేర్కొన్న కార్యక్రమాల నిర్వహణకు ముందుగా పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలి, బంద్ ల పేరిట వివిధ కారణాలను చూపుతూ బలవంతంగా వివిధ సంస్థలు, కార్యాలయాలను మూసి వేయాలని ఒత్తిడి, బెదిరింపులకు గురిచేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాము. మరియు శాంతిభద్రతల పరిరక్షణ నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని పోలీస్ కమిషనర్ సూచించారు



## శ్రమ దోపిడీ విముక్తికై పోరాడండి

- కార్మిక సంఘాలు కార్మిక హక్కుల సాధన కోసం ఉద్యమించండి
- మంత్రి ధనసరి అనసూయ సీతక్క

**ములుగు జిల్లా, ఆర్గాన్ న్యూస్, మే 1 :** ములుగు జిల్లా కేంద్రంలో సిఐటియు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ హాస్పటల్ లో హామీలీ సంఘం ఆధ్వర్యములో గ్రామ పంచాయతీ ముందు ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ ప్రపంచ కార్మికులారా ఏకం కండి శ్రమ దోపిడీ విముక్తికై పోరాడండి అంటూ కార్మిక సంఘాలు కార్మిక హక్కుల సాధన కోసం ఉద్యమించండి అనేక పోరాటాల ఫలితంగానే కార్మికులు హక్కులు సాధించుకున్నారని వివరించారు. 1886 లో చికాగో నగరంలో కార్మికులకు రోజుకు ఎనిమిది గంటల పని దినాల కోసం పోరాటం చేసిన రోజును మేడేగా చేసుకుంటున్నామని అన్నారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదదించి కార్మికులకు అన్యాయం చేసిందన్నారు కార్మికులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంటుంది అని మంత్రి సీతక్క అన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ తో పాటు వివిధ పార్టీల కార్మిక సంఘాల నాయకులు అదే విధంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్‌టిపిసి రామగుండంలో మేడే వేడుకలు

- పని స్థలాలలో ఉన్న హక్కులను కార్మికులు తెలుసుకోవడం ముఖ్యం
- చందన్ కుమార్ సమంత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

**గోదావరిఖని, ఆర్గాన్ న్యూస్, మే 1 :** పని ప్రదేశాలలో గాడ్జెట్‌లను ఉపయోగించి అన్ని కార్మికులు సురక్షితంగా పనిచేయడం చాలా ముఖ్యం, పారిశ్రామిక వాతావరణంలో కార్మికులకు అందుబాటులో ఉన్న హక్కులు మరియు హక్కులను తెలుసుకోవడం కూడా చాలా ముఖ్యం అని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామగుండం తెలంగాణ శ్రీ చందన్ కుమార్ సమంత అన్నారు. రామగుండం పవర్ స్టేషన్ లోపల ఉన్న మే డే పార్క్‌లో భారీ సంఖ్యలో కార్మికులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, కార్యక్రమంలో అన్ని అన్ని రంగాల కార్మికులు, ఎన్ టి పి సి ఉద్యోగులు మరియు అన్ని వాటాదారులను ఆయన అభినందించారు.



## గురుకుల బాలికలను సత్కరించిన ఎమ్మెల్యే దంపతులు

**మానకొండూర్, ఆర్గాన్ న్యూస్, మే 1:** ఇంటర్ లో అత్యధిక మార్కులు సాధించిన మానకొండూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతీబా పూలే గురుకుల పాఠశాల బాలికలను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్వీట్లు తినిపించి శాలువాలతో సత్కరించారు అత్యధిక మార్కులు సాధించిన ఎస్ చందన 580 మార్కులు ఈ సుప్రియ 571 ఎ అలేఖ్య 568 ఈ హర్షిత 566 కె హర్షిత 566 కె మాన్విత 563 మార్కులు సాధించారు గురువారం సాయంత్రం క్యాంపు కార్యాలయానికి వచ్చినప్పుడు ఎమ్మెల్యే దంపతులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ డాక్టర్ అనురాధ వారిని అభినందించారు అంతే కాకుండా ఈ సందర్భంగా ఒక్కొక్కరికి ఐదు వేల రూపాయల చొప్పున నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఆర్సీఏ ఎం అంజలి ప్రిన్సిపాల్ జె లావణ్య ఉపాధ్యాయులు సిహెచ్ సునిత ఆర్ మమత ఎ ఉమామహేశ్వరి ఆర్ కృష్ణవేణి జి లావణ్య తదితరులు పాల్గొన్నారు.



## ఫెయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

- సప్లమెంటరీలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్, ఆర్గాన్ న్యూస్, మే 1:** పదవ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించి సప్లమెంటరీలో 100శాతం ఉత్తీర్ణత సాధించేలా శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మండల విద్యాధికారులను ఆదేశించారు పదవ తరగతి ఫలితాలు విద్యాశాఖలో భవిష్యత్తు కార్యాచరణ పై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మండల విద్యాధికారులతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన 6,200 మంది విద్యార్థుల్లో 5995 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు ఫెయిల్ అయిన 205 మంది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వచ్చే నెలలో జరగనున్న సప్లిమెంటరీ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా శ్రద్ధ వహించాలని ఆదేశించారు అదేవిధంగా 2015 నుండి ఇప్పటివరకు పదో తరగతిలో సబ్జెక్టుల వారీగా ఫెయిల్ అయిన విద్యార్థుల డాటా సేకరించాలన్నారు ఇప్పటి వరకు ఉత్తీర్ణత సాధించలేని పరీక్ష ఫీజు చెల్లించకుండా ఉండిపోయిన వారి వివరాలు సేకరించి వారందరితో పరీక్ష ఫీజు చెల్లించేలా చూడాలని అన్నారు ఫెయిల్ అయిన సబ్జెక్టుల్లో ప్రాక్టీస్ చేయించి వారంతా రానున్న సప్లమెంటరీలో పాస్ అయ్యేలా ఉన్నత చదువు కొనసాగించేందుకు అవకాశం వచ్చేలా చూడాలని అన్నారు రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు శాతాన్ని పెంచాలని సూచించారు ఈ ఏడాది పదవ తరగతిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 96.69 శాతం మంది ఉత్తీర్ణత సాధించిన విషయాన్ని వారికి తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు కోఆర్డినేటర్లు మిల్కూరి శ్రీనివాస్ ఆంజనేయులు డిసిడిఓ కృపారాణి సిడిపిఓలు సబితా శ్రీమతి పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్, ఆర్గాన్ న్యూస్, మే 1 :** ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు తప్పక పాటించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వహణ అనుమతులకు సంబంధించిన "జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ" కమిటీ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం జరిగింది జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ఆసుపత్రి నుండి వెలుపడే బయో కెమికల్ ప్లాస్టిక్ వ్యర్థాల పట్ల నిబంధనలను పాటించాలని ఆదేశించారు ప్రైవేట్ ఆస్పత్రులు ఆస్తి పన్ను నీటి పన్ను నిర్దిష్ట సమయంలో చెల్లించాలని పేర్కొన్నారు నివాసయోగ్యంగా ఉన్న గృహాల్లో ఆస్పత్రులు నిర్వహిస్తున్నట్లయితే వాటిని తప్పనిసరిగా వెంటనే వాణిజ్య పరిధిలోకి మార్చుకోవాలని అన్నారు మున్సిపాలిటీ గ్రామపంచాయతీ నుంచి తప్పనిసరిగా ఎన్‌ఓసి పొంది ఉండాలని సూచించారు ఫైర్ సేఫ్టీ విషయంలో నిబంధనలు తప్పక పాటించాలని ఎగ్జిట్ ఎంట్రీ కోసం వేరువేరుగా ప్రవేశ మార్గాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రభుత్వం నిర్వహించే ఆరోగ్య మహిళ ఉచిత వైద్య పరీక్షల బోర్డును ఏర్పాటు చేయాలని అన్నారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ ప్రతి ప్రైవేట్ ఆస్పత్రికి పార్కింగ్ సౌకర్యం విధిగా ఉండాలని అన్నారు అత్యవసరంగా పార్కింగ్ చేయాల్సి వచ్చే వాహనాలకు సెక్యూరిటీని నియమించుకోవాలని తెలిపారు ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ జిల్లా వైద్యాధికారి వెంకటరమణ జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి ఐఎంఏ జిల్లా అధ్యక్షులు ఎనమల్ల నరేష్ హెచ్ఇఓ బాలయ్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లా క్రీడా రంగానికి నూతన శోభ

- ఖమ్మం పటేల్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్
- నేడు భూమి పూజ చేయనున్న మంత్రి తుమ్మల
- అంతర్జాతీయ ప్రమాణాలతో ట్రాక్ నిర్మాణం
- రూ. 8.50 కోట్లతో ట్రాక్ నిర్మాణానికి శ్రీకారం
- క్రీడా సదుపాయాలు దిశగా తుమ్మల అడుగులు
- జాతీయ అంతర్జాతీయ క్రీడలకు వేదిక కానున్న ఖమ్మం
- ఖమ్మం యువత, క్రీడాకారుల్లో ఆనందోత్సాహాలు



**ఖమ్మం ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే 1 :** ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం నూతన శోభను సంతరించుకొనుంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వరరావు చేతుల మీదుగా శుక్రవారం సాయంకాలం 5-00 గంటలకు సర్దార్ పటేల్ స్టేడియం వేదికగా అథ్లెటిక్ సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. రూ 8.50 కోట్ల వ్యయంతో క్రీడాకారుల యువత కోసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో ఈ ట్రాక్ నిర్మాణానికి అడుగులు పడ్డాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ ట్రాక్ నిర్మాణానికి కాంగ్రెస్ సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం జాతీయ అంతర్జాతీయ అథ్లెటిక్స్ కు వేదిక కానుంది. మౌలిక సదుపాయాల లక్ష్యంగా మంత్రి తుమ్మల అడుగులు ఖమ్మం జిల్లా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా సర్దార్ పటేల్ స్టేడియం తో పాటు మిగతా స్టేడియాలలో అన్ని మౌలిక వసతులు కల్పనకు చర్యలకు పూనుకున్నారు. ప్రప్రదమంగా ఖమ్మం జిల్లా కేంద్రమైన ఖమ్మం నగరంలో సర్దార్ పటేల్ స్టేడియంలో అత్యాధునికంగులతో జాతీయ ప్రమాణాలతో ఈ సింథటిక్ ట్రాక్ నిర్మాణం చేస్తున్నారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని సదుపాయాలను సమకూర్చేందుకు ప్రత్యేక ప్రణాళికలు రచిస్తున్నారు.

**క్రీడాకారుల్లో ఆనందోత్సాహాలు**

ఖమ్మం జిల్లా కేంద్రంలో కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న సింథటిక్ ట్రాక్ వల్ల క్రీడాకారులు మెరుగైన నైపుణ్యాలు మెలకువలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. యువత క్రీడాకారులకు సింథటిక్ ట్రాక్ మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపయోగపడుతుంది. శిక్షణకు వజ్రాయుధం లాంటి ఈ ట్రాక్ లక్షలాదిమంది క్రీడాకారులను తయారు చేసేందుకు ఉపయోగపడుతుందని క్రీడాభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ అంతర్జాతీయ క్రీడలకు వేదిక ఉండే ఈ సింథటిక్ ట్రాక్ అరుదుగా కనిపిస్తుంది. ఖమ్మం నగరంలో దీనిని ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు క్రీడాభిమానులు కృతజ్ఞతలు అర్షద్వానాలు వ్యక్తం చేస్తున్నారు.

**సింథటిక్ ట్రాక్ తో అద్భుత ప్రయోజనం**

సింథటిక్ అథ్లెటిక్ నిర్మాణంతో జాతీయ అంతర్జాతీయ స్థాయి క్రీడలకు వేదిక కానుంది. అథ్లెటిక్ శిక్షణ మరియు పోటీకి మన్నికైన, స్థిరమైన మరియు సురక్షితమైన ఉపరితలాన్ని కలిగి ఉంటుంది. ఇది వేగవంతమైన సమయాలకు, గాయాల ప్రమాదాలను తగ్గిస్తుంది. సింథటిక్ ట్రాక్లు అన్ని వాతావరణాలకు అనుకూలంగా ఉంటాయి, కనీస నిర్వహణ అవసరం మరియు వివిధ అథ్లెటిక్ కార్యకలాపాల కోసం రూపొందించ బడతాయి. సహజమైన అథ్లెటిక్ ట్రాక్తో పోలిస్తే, సింథెటిక్ అథ్లెటిక్ ట్రాక్స్ అథ్లెట్ల కోసం మెరుగైన ఉపరితలాన్ని మరియు సౌకర్యాన్ని సింథటిక్ ట్రాక్ అందిస్తుంది.మట్టి ట్రాక్ లో ప్రాక్టీస్ చేసుకొని సింథటిక్ ట్రాక్ నందు పోటీలలో పాల్గొనినప్పుడు 1.5 టూ 2. సెకన్ల తేడాతో మెడల్స్ కోల్పోవటం జరుగుతుంది. అందువలన సింథటిక్ ట్రాక్ నందు అథ్లెటిక్స్ ప్రాక్టీస్ తప్పనిసరి. మట్టి ట్రాక్ నందు ప్రాక్టీస్ చేసుకొని జాతీయ స్థాయి నందు నేరుగా పాల్గొనటం వలన ప్రిలిమినరీ నందు బాగా చేసి ఫైనల్స్ అప్పుడు చేయలేక పతకము కోల్పోవటం జరుగుతుంది. అందువలన జిల్లా స్థాయి నుండి అథ్లెటిక్స్ యొక్క ప్రాక్టీస్ కొరకు సింథటిక్ ట్రాక్ తప్పనిసరి అయినది. అంతే కాకుండా సి.ఎం కప్ -2024 లో జరిగిన క్రీడా పోటీల లో రాష్ట్ర స్థాయి లోనే అథ్లెటిక్స్ నందు మన సర్దార్ పటేల్ స్టేడియం నందు శిక్షణ తీసుకున్న క్రీడాకారులు ఎక్కువ (12) బంగారు పతకాలు మన ఖమ్మం జిల్లా వాళ్ళు కావటం గమనార్హం. మన జిల్లా నుండి ఎక్కువ మంది అథ్లెటిక్స్ నందు జాతీయ స్థాయి అంతర్జాతీయ స్థాయి లో పతకములు సాదించుటకు సింథటిక్ ట్రాక్ ద్వారా అనేక అవకాశాలు మెరుగుపడతాయి.



## మేడే స్ఫూర్తితో ఉద్యమిస్తాం

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాయికంటి శ్రీనివాస్

**మానకొండూర్, ఆర్గాన్ న్యూస్, మే 1 :** మేడేస్ఫూర్తితో కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాయికంటి శ్రీనివాస్ అన్నారు గురువారం మానకొండూర్ మండలం అన్నారం లలితాపూర్ గ్రామాలలో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించి జెండా ఆవిష్కరణ చేశారు ఈ సందర్భంగా రాయికంటి శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా మేడే స్ఫూర్తిగా ఉద్యమించాలని కనీస వేతనాల చట్టం సాధించే వరకు పోరాటాలు ఉధృతం చేస్తామని అన్నారు ఉపాధి హామీ కూలీలకు పెరిగిన ధరలకు అనుకూలంగా రోజుకురూ 600 ఇవ్వాలని పనిచేసే చోట నీడ త్రాగునీరు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అన్నారు బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధాన అవలంబిస్తుందని కార్మికుల ఐక్యంతో పోరాడాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో లలితాపూర్ మాజీ సర్పంచ్ కొండయ్య ఓదెలు సమ్మయ్య కనుకయ్య లచ్చన్న శ్యాము కోరుకంటి అనిల్ తిరుపతి ఆంజనేయులు లక్ష్మణ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకం

## ధాన్యం కోలుగోలులో ఇబ్బందులు రావద్దు

**రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



**కరీంనగర్, ఆర్గాన్ న్యూస్, మే 1 :** వడ్ల ధాన్యం కొనుగోలు లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోపు రైతుల అకౌంట్ లో ధాన్యం డబ్బులు పడేలా జిల్లా అధికారులు పర్యవేక్షణ చేయాలని ధాన్యం కొనుగోలు లో ఎలాంటి అదనపు తాలు తూకం పేరుతో రైతులను ఇబ్బందులు పెట్టవద్దని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏదైనా ఇబ్బందులు సమస్యకు సలహాలు సూచనల కోసం రైతులు టోల్ ఫ్రీ నెంబర్ 1800 4250 0333 కి కాల్ చేసి పిర్యాదు చేయవచ్చని తెలిపారు వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు రాత్రి వేళ ఇబ్బందులు లేకుండా విద్యుత్ దీపాలు ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు.




## కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

**- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి**

**కరీంనగర్, ఆర్గాన్ న్యూస్, మే 1 :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతుందని దీనికి వ్యతిరేకంగా కార్మికుల లోకం పోరాటాలకు సిద్ధం కావాలని కసిరెడ్డి సురేందర్ రెడ్డి పిలుపునిచ్చారు మేడే సందర్భంగా కరీంనగర్ మండలంలోని చామనపల్లి గ్రామంలో హమాలి కార్మికులు ఏర్పాటుచేసిన జెండాను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి ఎగరవేశారు నగునూరులో ఏఐటియుసి ఏర్పాటు చేసిన జెండాను హమాలీ సంఘం అధ్యక్షులు నెల్లి రాజేశం ఎగరవేశారు. కార్యక్రమంలో మెరుగు కొమురయ్య దొమ్మట్టి నాంపల్లి ఇరుకుల్ల బాబు గోవిందా ఐలయ్య మెరుగు రాములు రాజయ్య పరిష పోశయ దొంటి ఆంజనేయులు నెల్లి రవీందర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు




## ఎమ్మెల్యే ఆన్ వీల్స్ ద్వారా ప్రజలకు మరింత చేరువ

**- నుస్తులాపూర్ లో ప్రారంభ కార్యక్రమంలో కవ్వంపల్లి**

**మానకొండూర్, ఆర్గాన్ న్యూస్, మే 1:** ప్రజాజీవితంలో కొనసాగుతున్నంత వరకూ ప్రజలకు సేవకు పాటుపడుతూనే ఉంటానని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి స్పష్టం చేశారు తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామంలో గురువారం ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి మాట్లాడుతూ ప్రజల చెంతకు వెళ్లి ప్రజల సమస్యలు పరిష్కరించాలనే తలంపుతో చేపట్టిన ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమం ద్వారా ప్రజా సేవకు పునరంకితమవుతానని పునరుద్ఘాటించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆన్ వీల్స్ ద్వారా ప్రజల వద్దకు వెళ్లి అక్కడే సమస్యలు పరిష్కరించడం గొప్ప కార్యమని పేర్కొన్నారు కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని అనుకరించే అవకాశం లేకపోలేదని డాక్టర్ అనూరాధ పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆన్ వీల్స్ ప్రారంభ కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు అధికారుల బృందంలో తిమ్మాపూర్ తహసీల్దార్ విజయ్ కుమార్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజయ్ కుమార్ పంచాయతీరాజ్ డీఈ రవి ప్రసాద్ గృహనిర్మాణశాఖ డీఈ గంగాధర్ పంచాయతీ రాజ్ డీఈఈ మంజులత భార్గవి ఏఈ సురేందర్ రెడ్డి ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ మౌనిక మండల పంచాయతీ అధికారి సురేందర్ ఏపీవో రాజు డెప్యూటీ తహసీల్దార్ రాకేశ్ పశువైద్యాధికారి డాక్టర్ సురేందర్ రెడ్డి మిషన్ భగీరథ ఏఈ కార్తీక్ ఏవోలు సురేందర్ తదితరులు ఉన్నారు.

### అమరావతిలో భూముల
# విలువ పెరిగింది
### సీఎం చంద్రబాబు



**అమరావతి, మే 1 :** దేశంలో అసంఘటిత కార్మికులే అధికమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్లు అసంఘటిత కార్మికులు అనేక కష్టాలు పడ్డారని చెప్పారు. మేడే సందర్భంగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో 11 ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభించిన అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "ఇసుక ద్వారా ప్రభుత్వానికి రూ.వేలకోట్ల ఆదాయం వస్తుంది. ఆ ఆదాయాన్ని వదులుకుని మరీ.. ఉచిత ఇసుక సరఫరా చేస్తున్నాం. నిర్మాణ రంగాన్ని ప్రోత్సహిస్తున్నాం.. నాలా చట్టాన్ని రద్దు చేశాం. కార్మికుల కోసం కర్నూలు, గుంటూరులో వందపడకల ఆస్పత్రులు నిర్మిస్తున్నాం. ఆంధ్ర యువతకు ఉపాధి కల్పించడానికి అమరావతి నగరాన్ని నిర్మిస్తున్నాం. రాజధాని కోసం రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారు. ఇచ్చిన భూములను అభివృద్ధి చేసి కొంతభాగం వారికి ఇస్తున్నాం. ఆ రైతులను కోటీశ్వరులుగా మారుస్తున్నాం. ఇప్పుడు రాజధానిలో భూముల విలువ పెరిగింది. 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తాం. అభివృద్ధి జరుగుతుంటే సహించలేనివారు ఉన్నారు" అని చంద్రబాబు అన్నారు.



### 11 ఎంఎస్ఎంఈ పార్కులను
## ప్రారంభించిన సీఎం చంద్రబాబు

**అమరావతి, మే 1 :** రాష్ట్రంలో తొలిదశలో పూర్తిచేసిన 11 ఎంఎస్ఎంఈ పార్కులను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గం నారంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో వర్చువల్‌గా ప్రారంభోత్సవం చేశారు. రూ.216 కోట్లతో ఈ 11 పార్కులను ప్రభుత్వం పూర్తిచేసింది. దీంతో పాటు మరో 39 ఎంఎస్ఎంఈ పార్కులను రూ.376 కోట్లతో అభివృద్ధి చేస్తోంది. పూర్తయిన పార్కులు అనకాపల్లి, పీలేరు, రాజానగరం, బద్వేల్, గన్నవరం, పాణ్యం, డోన్, ఆత్మకూరు(నారంపేట), దర్శి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో ఉన్నాయి. వీటితో పాటు రాంబిల్లిలోని ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ను(ఎఫ్ఎఫ్‌సీ) సీఎం ప్రారంభించారు. 2028 నాటికి రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.



# పహల్గాం ఘటన..
### భారత్-పాక్ సరిహద్దులో ఉగ్రకుట్ర భగ్నం

**అమృత్‌సర్ :** భారత్-పాకిస్థాన్ సరిహద్దులో ఉగ్ర కుట్ర భగ్నమైంది. అమృత్‌సర్ సమీపంలో బీఎస్ఎఫ్, పంజాబ్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో భారీగా ఆయుధాలు పట్టుబడ్డాయి. వాటిలో తుపాకులు, గ్రనేడ్లు ఉన్నాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో సరిహద్దులో ఇలా ఆయుధాలు పట్టుబడటం కలకలం రేపుతోంది. బీఎస్ఎఫ్ ఇంటిలిజెన్స్ వింగ్ సమాచారం మేరకు ఏప్రిల్ 30 సాయంత్రం ఈ ఆపరేషన్ నిర్వహించారు. దానిలోభాగంగా ఆయుధాలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు. దీనిపై తదుపరి దర్యాప్తు నిర్వహించనున్నారు. బీఎస్ఎఫ్, పంజాబ్ పోలీసులు అత్యంత వేగవంతంగా, సమన్వయంతో వ్యవహరించడంతో ఈ ఉగ్ర కుట్ర భగ్నమైంది. ఇదిలాఉంటే.. బంగ్లా సరిహద్దులో కూడా పాక్ ఐఎస్ఐ కలకలం సృష్టించినట్లు వార్తలు వచ్చాయి. ఇటీవల కాలంలో మహమ్మద్ యూనస్ అధికారంలోకి వచ్చాక.. ఢాకా-ఇస్లామాబాద్‌ల మధ్య సంబంధాలు బలోపేతం అయ్యాయి. దీంతో పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ, మిలిటరీ అధికారులు బంగ్లాదేశ్‌లోని భారత్ సరిహద్దుల వైపునకు రావడం పెరిగింది. ఆ దేశంలోని ర్యాడికల్ గ్రూప్స్‌తో కూడా పాక్ సంబంధాలు పెట్టుకొంటోంది. ఈ నేపథ్యంలో బంగ్లా-భారత ర్యాడికల్ గ్రూపులను పాకిస్థాన్ వాడుకొనే అవకాశాలున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. ఈనేపథ్యంలో భద్రతా ఏజెన్సీలు బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని ముర్షిదాబాద్ వంటి ప్రాంతాల్లోని పోస్టులపై దృష్టిపెట్టాయి. పహల్గాంలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. పర్యాటకుల తలపైనే గురిపెట్టి కాల్చారు. మొత్తం 10 నిమిషాల్లో 26 మందిని పొట్టన పెట్టుకున్నారు. ఈ ఘటనతో భారత్, పాక్‌ల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. పాక్‌తో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్ విడిచివెళ్లాలని ఆదేశించింది. ఈ చర్యలతో దాయాది అక్కసు వెళ్లగక్కుతోంది.

# కష్టపడితేనే పని విలువ తెలుస్తుంది

- ప్రతి ఒక్కరూ కష్టపడే అవకాశం ఉండాలి
- యువత వ్యవసాయరంగంలో రాణించాలి
- ఉపాధి హామీ పతకం మనకు గొప్పవరం
- ఉపాధి శ్రామికులతో ఆత్మీయ సమావేశంలో పవన్



**అమరావతి, మే 1 :** ఉపాధి హామీ పథకం దేశానికి, రాష్ట్రానికి ఒక వరమని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. తమ ప్రభుత్వంలో శ్రామికులకు గుర్తింపు, గౌరవం ఉంటుందని అన్నారు. జగన్ ప్రభుత్వంలో పేదలు, శ్రామికుల కష్టాన్ని దోచుకుని దాచుకున్నారని ఆరోపించారు. మేడే సందర్భంగా గురువారం మంగళగిరిలో ఉపాధి శ్రామికులతో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ జిల్లాల నుంచి ఉపాధి శ్రామికులు హాజరయ్యారు. వంద రోజులు ఉపాధి పనులు పూర్తి చేసిన వారిలో వివిధ జిల్లాల నుంచి పది మంది అధికారులను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఉపాధి శ్రామికులతో ఆత్మీయ సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కష్టపడడం నేర్చుకోవాలని, వ్యవసాయంలో యువత శిక్షణ పొందాలని అన్నారు. అలాగే ఉపాధిని వ్యవసాయానికి జోడించాల్సి ఉందన్నారు. ఉపాధి శ్రామికులు మాటలు వింటే ఆనందం కలిగించిందని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉపాధి పనుల ద్వారా పేదలకు ఆసరా కలుగుతుందని చెప్పారు. మొగల్తూరులో తమకు ఉన్న రెండు ఎకరాల పొలం అమ్మేసుకున్నామని గుర్తుచేశారు. తర్వాత ఎనిమిది ఎకరాలుకొని .. తాను వ్యవసాయం చేస్తున్నానని పవన్ కల్యాణ్ తెలిపారు. శ్రమ , కష్టం విలువ తనకు తెలుసునని పవన్ కల్యాణ్ అన్నారు. ఉపాధి కూలీ పదం తొలగించి ఉపాధి శ్రామికులంగానే పిలుస్తామని చెప్పారు. ప్రభుత్వం, అధికారులు, మీడియా కూడా ఈ శ్రామికులు పదం వాడాలని విజ్ఞప్తి చేశారు. ఇరవై ఏళ్ల వయసులో ఏం చేయాలో తనకు తెలిసేది కాదన్నారు. ఆ తర్వాత తనవంతుగా శ్రమ ఆయుధంగా ముందుకు సాగానని అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రజల కోసం పని చేస్తుందని తెలిపారు. శ్రామికులకు ఎంత మంచి చేయగలమో ఆలోచన చేస్తున్నామని అన్నారు. తమ మీద నమ్మకంతో ప్రజలు అధికారం అప్పగించారని తెలిపారు. మూగ జీవాల రోదన కూడా ఉండకూడదనేది తమ ఉద్దేశమని చెప్పారు. గజేంద్ర మోక్షం తరహాలో పంచాయతీ రాజ్ అధికారులు, సిబ్బంది మూగ జీవాల గొంతు తడుపుతున్నారని అన్నారు. తాము అదేశాలు ఇచ్చినా క్షేత్ర స్థాయిలో వారు పని చేస్తున్నందుకు అభినందిస్తున్నానని తెలిపారు. ఏపీని అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత గత జగన్ ప్రభుత్వానిదని ఆరోపించారు. మద్యం నిషేధిస్తామన్న వారు మద్యాన్ని ఏరులై పారించారని విమర్శించారు. పేదలు, శ్రామికులు కష్టాన్ని వైసీపీ ప్రభుత్వం దోచుకుని దాచుకుందని పవన్ కల్యాణ్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో వ్యవస్థలను గాడిలో పెట్టి పాలన సాగిస్తున్నామని పవన్ కల్యాణ్ చెప్పారు. పల్లెల అభివృద్ధి దేశాభివృద్ధికి పట్టు-గొమ్మలని ఉద్ఘాటించారు. అందుకే పల్లె పండుగ పేరుతో రూ.377.37 కోట్లతో గోకులాలను పూర్తి చేశామని తెలిపారు. ప్రతి రైతుకు అదనపు ఆదాయం కూడా లభిస్తుందన్నారు. 13,500 పశువుల తొట్టేల కోసం రూ. 60 కోట్లు- ఖర్చు పెట్టామంటే అది శ్రామికుల కష్టం వల్లేనని చెప్పారు. నాలుగు వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు వేశామని అన్నారు. మరో నాలుగు వేల కిలోమీటర్ల రోడ్లకు శ్రీకారం చుట్టామని చెప్పారు. డోలీ వెళ్లే ప్రాంతాల్లో రోడ్లు వేసి అంబులెన్స్‌లు వెళ్లేలా చేశామని అన్నారు. సీఎం చంద్రబాబు విజన్‌తో మోదీ సహకారంతో ముందుకు సాగుతున్నామన్నారు. మొగల్తూరులో ప్రధాని జీవన్ జ్యోతి గురించి తెలియదని పవన్ కల్యాణ్ అన్నారు. ఒక్కరోజే వారందరికీ వర్తించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఎండ తీవ్రత వల్ల చాలా మంది ఇబ్బందులు పడతారని అన్నారు. కార్మికులకు 11 గంటల్లోపు పనులు పూర్తి చేసేలా చూడాలని అధికారులను పవన్ కల్యాణ్ ఆదేశించారు. పనులు పెండింగ్‌లో ఉంటే సాయంత్రం నాలుగు గంటల తర్వాత పనులు పూర్తి చేయాలని చెప్పారు. ప్రతి చోట నీడనిచ్చేలా చిన్న పాకలు ఏర్పాటు చేయాలని సూచించారు. అక్కడ ఉన్న పరిస్థితులు బట్టి నీడ పట్టు-న ఉండేలా పని ప్రాంతాల్లో చూసుకోవాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు కూడా అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. జాతీయ ఉపాధి హామీ పథకం వేతనాలను సీఎం చంద్రబాబు పెంచారని గుర్తుచేశారు. శ్రామికులు ప్రమాద భీమా కోసం బ్యాంక్‌తో ఒప్పందం చేసుకున్నామని అన్నారు. ప్రధాని మోదీ నిర్దేశకత్వర, చంద్రబాబు నాయకత్వంలో ఉపాధి హామీ శ్రామికులు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పవన్ కల్యాణ్ తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ పనులు త్వరలో పూర్తి చేస్తాం. మనిషికి విల్ పవర్ ఉండాలి. దారిద్యం÷-ర పేరుతో ఎప్పుడూ పనులు ఆగకూడదు. పనిచేసే వాళ్లు ముందు ఉంటే దేశం త్వరగా అభివృద్ధి చెందుతుంది. నేను అయినా పని చేయడంలో ఎప్పుడూ ముందుంటా. పనిచేసే వారికి ముందు గౌరవం ఇవ్వాలి. మనకి కొన్ని జిల్లాల్లో చాలా దుర్భిక్షం ఉంది. రక్షిత నీరు ఇప్పుడు చాలా ప్రాధాన్యంగా మారింది. జలజీవన్ మిషన్ కింద రూ. 29 వేలకోట్లకు అనుమతి ఇచ్చారు. 2028 వరకు ఈ పనులు పూర్తి చేస్తాం. ఇంకా రూ.57 వేలకోట్లు- మనకి అవసరం ఉంటు-ంది. కేంద్రం నిధులు లేకపోతే మన రాష్ట్రం నడపలేమా. నిన్న సమీక్షలో ఈ అంశాలపై ఉన్నత స్థాయిలో చర్చించాం. డిప్యూటీ-సీఎం , ఇతర అధికారులు మానిటరింగ్ చేసేలా వార్ రూమ్ పెట్టాలని చెప్పాం. ఏపీలో పడే వర్షం వల్ల వచ్చే నీరు ఎలా సద్వినియోగం చేయాలనే దానిపై ఆలోచనలు చేయాలి. ఎన్నికల్లో గెలవడం కోసం వార్ రూమ్‌లు పెడుతున్నాం. కానీ మాకు ఓట్లకన్నా.. ప్రజల కష్టం తీర్చడమే ముఖ్యం. మంచి నీటి సమస్య తీర్చేలా అవసరమైన చర్యలు తీసుకోవాలి. ఫిల్టర్ బెడ్స్ చాలా దారుణంగా ఉన్నాయంటే... అది బాధ్యత రాహిత్యం 13,326 పంచాయతీల్లో వీటిపై దృష్టి పెట్టాలని చెప్పాం. దీనిపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టి... మంచి నీరు అందించేలా చూడాలి. వాటర్ వార్ రూమ్స్‌ను జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయాలి. నీటి పరిరక్షణపై ప్రజలకు అవగాహన కలిగించేలా ప్రచారం చేయాలి. నీటి విలువను ప్రతి ఒక్కరూ తెలుసుకోండి.. నీటిని వృథా చేయకండని పవన్ కల్యాణ్ సూచించారు. ఉపాధి హామీ పథకంలో ఎంపిక చేసిన అధికారి శశిభూషణ్ మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఎంతోమందికి ప్రభుత్వం ఆసరా కల్పిస్తుందని తెలిపారు.మన గ్రామాన్ని మనమే అభివృద్ధి చేసుకుంటూ ఉపాధి పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. ఏపీలో ఆదర్శవంతంగా ఉపాధి హామీ పథకం కొనసాగుతుందని అన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచనలతో ఈ పథకంలో చాలా మార్పులు చేశామని తెలిపారు. మొక్కుబడి పనులు కాకుండా ఫలితాలు కనిపించే పనులు చేపట్టామని చెప్పారు. ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తి చేయడం ద్వారా అభివృద్ధి కూడా ఆవిష్కృతమవుతుందని తెలిపారు. ఈ పథకం కింద దేశంలో దాదాపు రూ. 86 వేల కోట్లు- ఖర్చు అయితే.. ఏపీలోనే రూ. 10వేల కోట్లు- ఖర్చు అయ్యాయని అన్నారు. వచ్చే ఏడాది మరింత ఆదర్శంగా ఉండేలా ఏపీలో పనులు చేపట్టి, అభివృద్ధి చూపిస్తామని అధికారి శశిభూషణ్ వెల్లడించారు.

## ఎన్టీఆర్ టౌన్‌షిప్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ ఫీజుల్లో రాయితీ




**అమరావతి:** రాష్ట్రంలోని ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లలో (ఎంఐజీ లేఅవుట్లు) ప్లాట్ల రిజిస్ట్రేషన్ ఫీజులపై ప్రభుత్వం రాయితీ ప్రకటించింది. కొనుగోలుదారులపై ఫీజు భారం తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ప్లాట్ మొత్తం విలువపై 7.5% రిజిస్ట్రేషన్ ఫీజు మధ్య ఆదాయ వర్గాలకు భారం కావడంతో.. వారిలో ఆందోళన వ్యక్తమైంది. దాంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. నూతన విధానం ప్రకారం.. ఒకే ప్లాట్ రెండు దస్తావేజుల కింద రెండు రకాల ఫీజులతో రిజిస్ట్రేషన్ చేయించుకునే వెసులుబాటు ఉంటుంది. మొత్తం అమ్మకం ధరలో బేస్ ప్రైస్ కింద 60%, డెవలప్‌మెంట్ ఛార్జీల కింద మిగిలిన 40 శాతం మొత్తానికి రెండు దస్తావేజులు రాసుకోవచ్చు. 60% మొత్తంపై 7.5%, మిగిలిన 40% మొత్తానికి 0.5% చొప్పున రిజిస్ట్రేషన్ ఫీజులను సర్కారు వసూలు చేయనుంది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా.. మధ్య ఆదాయ వర్గాల (ఎంఐజీ) కోసం రాజధాని ప్రాంత ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ), విశాఖ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ తదితర పరిధిల్లో ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్ షిప్‌లు ప్రారంభించారు. వీటిలో ఇప్పటికే లాటరీ ద్వారా ప్రజలకు ప్లాట్లు కేటాయించారు.

# మన బలగాల స్థైర్యాన్ని దెబ్బతీస్తారా?
### పహల్గాం ఘటనపై విచారణకు సుప్రీం తిరస్కరణ



**ఢిల్లీ:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల ముష్కరులు జరిపిన పాశవిక దాడితో యావత్ దేశం ఉలిక్కిపడింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడాలని దేశమంతా ఒక్కటైంది. ఈ నేపథ్యంలో పహల్గాం దాడి పై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై అత్యున్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాంటి వ్యాజ్యాలతో మన భద్రతా బలగాల స్థైర్యాన్ని దెబ్బతీయాలనుకుంటున్నారా అని కోర్టు పిటిషనర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. "ఇది చాలా క్లిష్ట సమయం. ఉగ్రవాదంపై పోరులో ప్రతి పౌరుడు చేతులు కలపాలి. ఇలాంటి పిటిషన్లు దాఖలు చేసేటప్పుడు కాస్త బాధ్యతతో వ్యవహరించండి. అందులో సున్నితత్వాన్ని అర్థం చేసుకోండి. ఇలాంటి చర్యలతో మన బలగాల స్థైర్యాన్ని దెబ్బతీయాలనుకుంటున్నారా? మీక్కూడా దేశంపై బాధ్యత ఉందన్న విషయాన్ని మర్చిపోవద్దు" అని ధర్మాసనం సూచించింది. "ఇలాంటి అంశాలను న్యాయ పరిధిలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించొద్దు. ఉగ్రవాద ఘటనల విచారణకు జడ్జీలు నిపుణులు కారు" అని ధర్మాసనం వెల్లడించింది. అయితే, ఇతర రాష్ట్రాల్లో కశ్మీరీ విద్యార్థుల భద్రత కోసమే తాను ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేసినట్లు పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. విద్యార్థుల కోసమే అయితే హైకోర్టులకు వెళ్లొచ్చని తెలిపింది. కోర్టు సూచనలతో పిటిషనర్ తన వ్యాజ్యాన్ని ఉపసంహరించుకున్నారు. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంకు దగ్గర్లో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతం బైసరన్ లోయలో ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చిన వారు పర్యాటకులను అతి సమీపం నుంచి కాల్చి చంపారు. ఈ ఘటనలో ఓ కశ్మీరీ సహా 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడితో భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఉగ్రవాదులకు, వారికి మద్దతిస్తున్న వారికి గట్టిగా బదులిస్తామని భారత్ స్పష్టంగా చెప్పింది.

## హోటల్‌లో అగ్నిప్రమాదం.. కిటికీలోంచి బిడ్డను విసిరేసిన తల్లి



**జైపూర్:** రాజస్థాన్‌లోని ఓ హోటల్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. తన బిడ్డను కాపాడాలని ప్రయత్నించిన ఓ తల్లి.. చిన్నారిని మూడో అంతస్తు నుంచి కిందకి విసిరేసింది. ఈ ఘటన అజ్మేర్‌లో చోటుచేసుకుంది. నాజ్ హోటల్‌లో ఎలక్ట్రికల్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో దట్టమైన పొగ వ్యాపించింది. ఈ అగ్ని ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల్లో ఇద్దరు పురుషులు, ఒక మహిళ, చిన్నారి ఉన్నారు. ఈ క్రమంలోనే ఒక తల్లి తన బిడ్డను కాపాడేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసింది. తన చిన్నారిని మూడో అంతస్తు నుంచి కిందకు విసిరేసింది. కింద ఉన్నవారు ఆ చిన్నారిని పట్టుకున్నారు. ఆ తర్వాత ఆమె కూడా దూకేందుకు ప్రయత్నించగా అందులోనే చిక్కుకుపోయింది. చిన్నారికి మాత్రం స్వల్ప గాయాలైనట్లు స్థానికులు వెల్లడించారు. ఈ సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. హోటల్‌లో ఉన్న ఏసీ పేలడం కారణంగానే ఈ ప్రమాదం సంభవించిందని ప్రత్యక్ష సాక్షి ఒకరు మీడియాకు తెలిపారు.

## జగన్ రాబందుల పార్టీ అధ్యక్షుడు : నిమ్మల

**అమరావతి, మే 1 :** మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వైసిపికి కాదు రాబందుల పార్టీకి అధ్యక్షుడని ఎపి జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. ప్రకృతి విపత్తు వల్ల జరిగిన ప్రమాదాన్నీ రాజకీయం చేస్తారా? అని నిమ్మల ప్రశ్నించారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో నిమ్మల పర్యటించారు. మన రైతు- మన రామానాయుడు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బారికేడ్లు, పరదాలు, ముందస్తు అరెస్టులతో నాటి జగన్ పాలన సాగిందని మండిపడ్డారు. రాజధాని పునర్నిర్మాణం..రేపటి రోజు దేశ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. రైతుల త్యాగంతో, ప్రతి పౌరుడు గర్వించేలా రాజధాని నిర్మాణం జరుగుతుందని రామానాయుడు పేర్కొన్నారు.


## మామిడికాయల వ్యాపారి దారుణ హత్య

**తిరుపతి, మే 1 :** తిరుపతి జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. పాకాల మండలం దామలచెరువులో మామిడి కాయల వ్యాపారి హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని దుండగులు ఆయనపై తీవ్రంగా దాడి చేసి హత్య చేశారు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మామిడి కాయల వ్యాపారి సత్రాల అశోక్ పై దుండగులు రాయితో తీవ్రంగా దాడి చేసి హతమార్చారు. అనంతరం అతని వద్దనున్న బంగారం అపహరించుకొని పోయారు. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ఈ దారుణమైన ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మేడే స్ఫూర్తితో పోరాటం చేద్దాం
### విద్యుత్ ఉద్యోగుల యూనియన్ నేతల పిలుపు

**విజయనగరం, మే 1 :** పోరాట దినం మేడే స్ఫూర్తితో విద్యుత్ ఉద్యోగులు హక్కులు,సమస్యలపై పోరాడదామని అందుకు విద్యుత్ ఉద్యోగులు సిద్ధం కావాలని విద్యుత్ ఉద్యోగులు యూనియన్ లక్ష్మణరావు, ప్రసాదరావు, రాజేంద్ర ప్రసాద్‌లు పిలుపునిచ్చారు. గురువారం యూనియన్ కార్యాలయంలో జెండాను సీనియర్ నాయకులు ప్రసాదరావు ఆవిష్కరించారు. అనంతరం విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద విద్యుత్ శాఖ సూపరెండెంట్ ఇంజినీర్ ముప్వల లక్ష్మణరావు జెండాను ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు- చేసిన మజ్జిగ కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంబించారు. ఈ సందర్భంగా మేడే అంటే కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు దినోత్సవం అన్నారు. నాటి కార్మికులు పోరాట ఫలితంగా అనేక హక్కులు సాధించుకోవడం జరిగిందన్నారు.నేడు అదే స్ఫూర్తితో హక్కులు, పీఆర్సీ వంటి సమస్యలపై పోరాడదామని అందుకు ఉద్యోగులు సిద్ధం కావాలని కోరారు. హక్కులు కాపాడుకోవడం అనేది మన బాధ్యత అన్నారు. నా పరిధిలో ఏ సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. అదే విధంగా శాఖ పరంగా ప్రజలకు అందించే సేవల్లో ఉద్యోగుకు ఇదే స్ఫూర్తితో పని చేయాలన్నారు. కార్యక్రమంలో రూరల్ ఈ ఈ సురేష్ బాబు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అమరావతి పునఃప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి : ఏపీ మంత్రులు



**అమరావతి:** రాజధాని అమరావతి పునఃప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి నట్లు ఏపీ మంత్రులు తెలిపారు. ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మంత్రులు మాట్లాడారు. రాజధాని కోసం అమరావతి ప్రాంత రైతులు చేసిన త్యాగం మరువ లేనిదని మంత్రి నారాయణ అన్నారు. రాజధాని పునఃప్రారంభోత్సవానికి సీఎం చంద్రబాబు వారిని స్వయంగా ఆహ్వానించారని చెప్పారు. శుక్రవారం మధ్యాహ్నం 3.20 గంటలకు ప్రధాని మోదీ అమరావతికి చేరుకుంటారని ఆయన తెలిపారు. అమరావతి పునఃప్రారంభోత్సవం కోసం సభా ప్రాంగణం పూర్తయిందని మంత్రి పయ్యావల కేశవ్ తెలిపారు. పార్కింగ్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెప్పారు. రాజధాని కార్యక్రమం మనది అనే భావన అందరికీ వచ్చిందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సభకు వచ్చేవారికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. అధికారులతో కలిసి సమన్వయంతో ముందుకెళ్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.



## భారత్‌లోని పాకిస్థానీయులకు ఊరట..

### గడువు పొడిగించిన కేంద్రం..!

**న్యూఢిల్లీ :** పహల్గాం ఉగ్ర దాడితో భారత్-పాక్ సంబంధాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలోనే పాక్ జాతీయులు మన దేశం వీడి వెళ్లేందుకు గడువు విధించిన సంగతి తెలిసిందే. అయితే ఆ ఉత్తర్వుల్లో తాజాగా సవరించినట్లు తెలుస్తోంది. పాక్ జాతీయులు తిరిగి వెళ్లడానికి ఇచ్చిన గడువు మంగళవారంతో ముగిసింది. ఈ నేపథ్యంలోనే ఏప్రిల్ 30న వాఘా-అటారీ సరిహద్దును మూసివేస్తామని గతంలో కేంద్ర హెూంమంత్రిత్వశాఖ ఇచ్చిన ఉత్తర్వును తాజాగా సవరించినట్లు సమాచారం. ఆంక్షలు సడలడంతో తదుపరి ఆదేశాలు వెలువడేవరకు వారు ఆ సరిహద్దు నుంచి పాక్ వెళ్లేందుకు వెసులుబాటు కలిగిందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో భారత్‌ను వీడి వెళ్లాలని పాక్ జాతీయులను కేంద్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో బుధవారం నాటికి మొత్తం 786 మంది వెళ్లిపోయారు. వారిలో 55 మంది దౌత్యాధికారులు, వారి డిపెండెంట్లు, సహాయక సిబ్బంది, 8 మంది పాకిస్థాన్ వీసాలున్న భారతీయులున్నారు. గత 6 రోజుల్లో వారంతా అటారీ-వాఘా సరిహద్దు మీదుగా పాకిస్థాన్‌కు వెళ్లిపోయారు. పాకిస్థాన్ నుంచి భారత్‌కు 1,465 మంది వచ్చారు. వీరిలో 25 మంది దౌత్యాధికారులు, అధికారులు, దీర్ఘకాల వీసాలు ఉన్న 151 మంది పాకిస్థాన్ జాతీయులు ఉన్నారు.



## బంగ్లా సరిహద్దుల్లో పాక్ ఐఎస్ఐ కలకలం..

**న్యూఢిల్లీ :** పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో బంగ్లా సరిహద్దుల్లో కలకలం మొదలైంది. ఇటీవల కాలంలో మహమ్మద్ యూనస్ అధికారంలోకి వచ్చాక.. ఢాకా-ఇస్లామాబాద్‌ల మధ్య సంబంధాలు బలోపేతం అయ్యాయి. దీంతో పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ, మిలిటరీ అధికారులు బంగ్లాదేశ్‌లోని భారత్ సరిహద్దుల వైపునకు రావడం పెరిగింది. ఆ దేశంలోని ర్యాడికల్ గ్రూప్స్‌తో కూడా పాక్ సంబంధాలు పెట్టుకొంటోంది. ఈ నేపథ్యంలో బంగ్లా-భారత ర్యాడికల్ గ్రూపులను పాకిస్థాన్ వాడుకొనే అవకాశాలున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో భద్రతా ఏజెన్సీలు బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని ముర్షిదాబాద్ వంటి ప్రాంతాల్లోని పోస్టులపై దృష్టిపెట్టాయి.

### పాకిస్థాన్ ఐఎస్‌పీఆర్ ఖతా బంద్..!

పాక్ సైన్యానికి చెందిన ఐఎస్‌పీఆర్ దాని అనుబంధ సామాజిక మాధ్యమాలను భారత్‌లో నిలిపివేయాలని ప్రభుత్వం పలు సోషల్ మీడియా వేదికలను కోరింది. వీటిల్లో యూట్యూబ్ కూడా ఉంది. సోమవారం భారత్ 16 యూట్యూబ్ ఛానల్స్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను నిలిపివేయించిన విషయం తెలిసిందే. అదేపనిగా తప్పుడు ప్రచారాలు చేయకుండా ఈ నిర్ణయం తీసుకొంది.



## ఎలక్ట్రానిక్ వార్ఫేర్ వ్యవస్థలను మోహరించిన భారత్

### పాక్ విమానాల నేవిగేషన్ జామ్

**న్యూఢిల్లీ :** భారత సైన్యం పాక్ మిలిటరీ విమానాలు లక్ష్యాలను గుర్తించేందుకు వీలులేకుండా ఎలక్ట్రానిక్ వార్ఫేర్(ఈడబ్ల్యూ) వ్యవస్థలను పశ్చిమ సరిహద్దుల్లో మోహరించింది. ఇవి పాక్ సైన్యం వినియోగించే గ్లోబల్ నేవిగేషన్ శాటిలైట్ సిస్టమ్ సంకేతాలను బలంగా అడ్డుకొంటాయి. దీంతో ఆ దేశ సైనిక, పౌర రవాణా విమానాలు వినియోగించే జీపీఎస్ (అమెరికా), గ్లోనాస్ (రష్యా) బైడూస్ (చైనా) నేవిగేషన్ వ్యవస్థలను సమర్థంగా అడ్డుకొంటుంది. దీంతో పాక్ సైనిక విమానాలు, డ్రోన్లు, గైడెడ్ మిసైల్స్ భారత్‌లో లక్ష్యాలను గుర్తించడంలో తీవ్ర గందరగోళానికి గురవుతాయి. ఫలితంగా యుద్ధ రంగంలో ఏం జరుగుతోందో అర్థం చేసుకోలేని స్థితికి పాక్ సైన్యం వెళుతుంది. 2024 సెంటర్ ఫర్ ల్యాండ్ వార్ఫేర్ స్టడీస్ లెక్కల ప్రకారం భారత్ వద్ద ఇలాంటి వ్యవస్థలు దాదాపు 50 వరకు ఉన్నాయి. ఇక వాయుసేన రఫేల్ యుద్ధ విమానాల్లోని స్పెక్ట్రా సూట్స్, నేవీ వినియోగించే శక్తి సిస్టమ్స్ కూడా నేవిగేషన్ సిగ్నల్స్‌ను జామ్ చేయగలవు. ఇక పాకిస్థాన్ విషయానికి వస్తే.. దానివద్ద సొంతంగా తయారుచేసుకొన్న ఎలక్ట్రానిక్ వార్ఫేర్ వ్యవస్థలు లేవు. కానీ, చైనా నుంచి దిగుమతి చేసుకొన్న డీడబ్ల్యూఎల్-002, జర్బా కోస్టల్ ఈడబ్ల్యూ సిస్టమ్ వంటివి ఉన్నాయి. వీటితోపాటు కమర్షియల్ జామర్లను అది వాడుతోంది. ఇక భారత్ చర్యలతో ఈ ప్రాంతంలో నేవిగేషన్‌తో రోజువారీ చేసే పనుల్లో తీవ్ర అంతరాయం ఏర్పడనుంది. ఏప్రిల్ 22న పహల్గాంలో సందర్శకులపై ఉగ్రదాడి జరిగిన తర్వాత భారత్ తీవ్రస్థాయిలో స్పందించింది. పాక్ తన గగనతలాన్ని మూసివేసింది. మరోవైపు న్యూఢిల్లీ ప్రతిస్పందన ఎలా ఉంటుందో అంచనా వేయలేని పాక్.. తన విమానాలు భారత్‌పై నుంచి కాకుండా వేరే మార్గాలకు మళ్లించింది. ఈనేపథ్యంలో భారత్ ఏప్రిల్ 30 నుంచి మే 23 వరకు పాక్ రవాణా, సైనిక, పౌర విమానాలకు నోటీస్ ఎయిర్‌మన్ (నోటమ్)జారీ చేసింది. దీంతో పాక్ విమానాలు చైనా, శ్రీలంక గగనతలాల మీదుగా ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.

## పహల్గాంలో కొన్ని రోజుల ముందునుంచే పాగా

### నాలుగు చోట్ల రెక్కీలు..

**జమ్మూకశ్మీర్ :** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు కొన్ని రోజుల ముందునుంచే పాగా వేసి.. పక్కా ప్రణాళికతో దాడి చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఏప్రిల్ 22 ఘటన అనంతరం దర్యాప్తు బృందాలు టెర్రరిస్టులకు క్షేత్ర స్థాయిలో సహకరించిన ఓవర్ గ్రౌండ్ వర్కర్స్‌ను పెద్ద సంఖ్యలో అరెస్టు చేశాయి. వీరిలో ఒకరు ఈ విషయాన్ని ధ్రువీకరించారు. దర్యాప్తు బృందంలో భాగమైన సీనియర్ అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. ఉగ్రవాదులు ఏప్రిల్ 15వ తేదీనే పహల్గాంకు చేరుకొన్నారు. ఆ తరవాత వారు నాలుగుచోట్ల రెక్కీలు నిర్వహించారు. వీటిలో బైసరన్ వ్యాలీ, అరు వ్యాలీ, స్థానిక అమ్యూస్‌మెంట్ పార్క్, బేతాబ్ వ్యాలీ ఉన్నాయి. వీటిల్లో చాలాచోట్ల భద్రతా ఏర్పాట్లు ఉండటంతో వారు దాడులు చేయడానికి వెనుకంజ వేశారు. ఈ ఉగ్రవాదులకు క్షేత్రస్థాయిలో దాదాపు 20 మంది సహకరించినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) గుర్తించింది. వీరిలో చాలామందిని ఇప్పటికే అరెస్టు చేసింది. మిగిలిన వారు నిఘా నీడలో ఉన్నారు. మహారాష్ట్రలోని జాల్నాకు చెందిన పర్యాటకుడు ఆదర్శ్ రౌత్ ఇటీవల కశ్మీర్ పర్యటనకు వెళ్లగా.. తాను పహల్గాం దాడికి ముందురోజు అక్కడే ఒక అనుమానిత వ్యక్తితో మాట్లాడినట్లు వెల్లడించారు. ఎన్ఐఏ విడుదల చేసిన ఉగ్రవాదుల ఊహాచిత్రాలను చూశాక తన అనుమానం మరింత బలపడినట్లు తెలిపారు. ఇలాంటి అనుభవాన్ని పుణేలో స్థిరపడిన మలయాళ సామాజిక వేత్త కూడా వెల్లడించారు. తాము బేతాబ్ వ్యాలీలో తీసిన వీడియోలో ఇద్దరు ఉగ్రవాదులు సంచరిస్తున్నట్లు రికార్డైందని వెల్లడించారు. ఉగ్రవాదులకు సాయం చేసిన క్షేత్రస్థాయిలోని సానుభూతిపరులే అత్యంత కీలక పాత్రను పోషించినట్లు నిఘా సంస్థలు చెబుతున్నాయి. వీరే వారికి అవసరమైన సమాచారం, ప్రయాణ ఏర్పాట్లు చేసినట్లు గుర్తించారు. ఉగ్రదాడికి ముందు ఈ ప్రాంతంలో రెండు శాటిలైట్ ఫోన్లు వాడిన



సంకేతాలను దర్యాప్తు బృందాలు గుర్తించాయి. మొత్తం 2,500 మందిని ఈ దాడికి సంబంధించి ప్రశ్నించాయి. వీరిలో 186 మంది ఇప్పటికీ దర్యాప్తు బృందాల కస్టడీలో ఉన్నారు.

### పహల్గాం చేరుకొన్న ఎన్ఐఏ చీఫ్

ఉగ్రదాడి దర్యాప్తును పర్యవేక్షించడానికి ఎన్ఐఏ చీఫ్ సదానంద దాటే పహల్గాం చేరుకొన్నారు. ఆయనతోపాటు పలువురు ఐజీలు, డీఐజీలు కూడా ఉన్నారు. బైసరన్ లోయకు వెళ్లి అక్కడి పరిస్థితులను కూడా స్వయంగా చూడనున్నారు.


### ఉగ్రవాదులు ఇంకా దక్షిణ కశ్మీర్లోనే..

పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులు ఇంకా దక్షిణ కశ్మీర్‌లోనే ఉన్నట్లు జాతీయ దర్యాప్తు సంస్థ వర్గాలు చెబుతున్నాయి. ఆ ప్రదేశంలో వారితోపాటు మరికొందరు ఉగ్రవాదులు కూడా ఉండొచ్చని పేర్కొన్నాయి. ఒకవేళ భద్రతా దళాలు వారిపై దాడి చేస్తే.. మిగిలిన ఉగ్రవాదులు కూడా వారికి రక్షణగా వచ్చే అవకాశం ఉన్నట్లు చెబుతున్నాయి. ఇక పహల్గాం దాడిలో పాల్గొన్నవారు.. ఆహారం, ఔషధాలు వంటి వాటిని తమ వెంటే పెద్ద మొత్తంలో తీసుకెళ్లడంతో ఎక్కువకాలం అడవిలో ఉండగలుగుతున్నారని చెప్పారు.

## పాక్ మరో ఎత్తుగడ..

### ఐఎస్ఐ చీఫ్‌కు కీలక బాధ్యతలు

**ఇస్లామాబాద్:** పహల్గాం దాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఉగ్రదాడికి ప్రతీకారంగా తమపై న్యూఢిల్లీ ఏ క్షణమైనా దాడులు చేపట్టొచ్చని పాక్ భయపడుతోంది. ఈ క్రమంలోనే తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ మహమ్మద్ ఆసిమ్ మాలిక్‌కు కీలక బాధ్యతలు అప్పగించింది. ఆయనను జాతీయ భద్రతా సలహాదారుగా నియమిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు అధికారిక నోటిఫికేషన్ కూడా జారీ చేసినట్లు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. మాలిక్‌కు ఎన్ఎస్ఏ చీఫ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఆయనను గతేడాది సెప్టెంబరులో ఐఎస్ఐ చీఫ్‌గా నియమించారు. నిఘా సంస్థ అధిపతి కంటే ముందు.. పాక్ ఆర్మీ జనరల్ హెడ్ క్వార్టర్స్‌లో అడ్జుటంట్ జనరల్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. మిలిటరీ అడ్మినిస్ట్రేటివ్ వ్యవహారాలను పర్యవేక్షించారు. పాక్ సైన్యంలో మాలిక్ అడ్జుటంట్ జనరల్‌గా పనిచేస్తున్నప్పుడే మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అరెస్టు.. ఆయన మద్దతుదారుల ఆందోళనలపై ఆర్మీ అణచివేత వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. గతంలో బలోచిస్థాన్, దక్షిణ వజీరిస్థాన్‌లో ఆర్మీ డివిజన్లకు నాయకత్వం వహించారు. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొని కఠినంగా ముందుకుసాగుతాడని మాలిక్‌కు పేరుంది. అలాంటి వ్యక్తికి ఇప్పుడు జాతీయ భద్రతా సలహాదారుగా పాక్ అదనపు బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యం సంతరించుకుంది. పహల్గాం దాడికి పాక్ సీమాంతర ఉగ్రవాదమే కారణమన్న భారత్.. దాయాదితో దౌత్య సంబంధాలకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ క్రమంలోనే ఇటీవల త్రివిధ



దళాలతో కీలక సమావేశం నిర్వహించిన ప్రధాని మోదీ.. 'సీమాంతర ఉగ్రవాదం, దాని సూత్రధారులపై చర్యలు ఎప్పుడు, ఎలా తీసుకోవాలన్న విషయంలో సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని' అని స్పష్టం చేసినట్లు సమాచారం.


### వరుసగా ఏడో రోజు కవ్వింపులు..

మరోవైపు, ఉద్రిక్తతల వేళ సరిహద్దుల్లో అలజడి కొనసాగుతూనే ఉంది. వరుసగా ఏడో రోజు నియంత్రణ రేఖ వెంబడి పాక్ సైన్యం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. ఉరి, కుప్వారా, అఖ్నూర్ సెక్టార్‌లో భారత్ ఆర్మీపై కాల్పులు జరిపింది. దీన్ని భారత సైన్యం గట్టిగా తిప్పికొట్టింది. సరిహద్దుల్లో కొనసాగుతున్న కవ్వింపులపై పాకిస్థాన్‌ను భారత్ గట్టిగా హెచ్చరించినట్లు తెలుస్తోంది. భారత మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్, పాక్ సైనిక డైరెక్టర్ జనరల్ మంగళవారం హాట్‌లైన్‌లో మాట్లాడుకున్నారు.

## 93వేల మంది పాక్ సైనికుల లొంగుబాటు గుర్తులేదా..?

### అఫ్రిదీకి బాక్సర్ స్ట్రాంగ్ కౌంటర్

**న్యూఢిల్లీ :** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల పాశవిక దాడితో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ పరిణామాల వేళ భారత సైన్యాన్ని ఉద్దేశిస్తూ పాక్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిదీ అనుచిత వ్యాఖ్యలు చేశాడు. దీనికి భారత్ బాక్సింగ్ ఛాంపియన్ గౌరవ్ బిధూరి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. "పహల్గాంలో జరిగిన ఉగ్రదాడితో దేశం మొత్తం దిగ్భ్రాంతికి గురైంది. ఈ ఘటనతో భారత ప్రభుత్వం తీసుకున్న చర్యలు పాకిస్థానీలను పిచ్చివాళ్లను చేశాయి. ఎనిమిది లక్షల మంది భారత సైనికులు దాడిని ఆపడానికి ఏమీ చేయలేకపోయారని అఫ్రిదీ ఇంటర్వ్యూలో ప్రస్తావించారు. 1971లో 93 వేల మంది పాకిస్థానీ సైనికులు మా సైన్యం ముందు లొంగిపోయారు. అందుకే మా సామర్థ్యం గురించి మాకు పాఠాలు చెప్పొద్దు. ఆధారాలు అడుగుతున్నారు. అసలు మీకు ఎందుకు నిరూపించాలి. పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఇస్తుందని ప్రపంచం మొత్తానికి తెలుసు. నిషేధిత లష్కరే తోయిబా అనుబంధ సంస్థ ఈ దాడికి బాధ్యత ప్రకటించుకుంది" అని ఘాటుగా విమర్శించారు. "ఇక మీరు క్రీడాదౌత్యం గురించి మాట్లాడుతున్నారు. ఇటీవల నీరజ్ చోప్రా స్వయంగా మీ ఒలింపిక్ ఛాంపియన్ నదీమ్‌ను ఆహ్వానించిన విషయాన్ని మీకు గుర్తుచేస్తున్నా. క్రీడా స్ఫూర్తి గురించి మీరు మాకు చెప్పకండి. మీకు పీఎస్ఎల్ ఉంది. మాకు ఐపీఎల్ ఉంది. కానీ ప్రపంచ క్రీడాకారులు ఎక్కడ ఆడుతున్నారో చూడండి. మీరు భారత్‌కు వచ్చినప్పుడు బెదిరింపులు వచ్చాయని చెప్పారు. కానీ ప్రపంచ క్రీడాకారులు వస్తున్నది మా దేశానికి.. మీ దగ్గరికి కాదని గ్రహించండి. పాక్ అంటే ఏంటో ప్రపంచానికి తెలుసు" అని బిధూరి చురకలు అంటించారు. ఇటీవల పహల్గాం ఉగ్రదాడిపై అఫ్రిదీ మాట్లాడుతూ.. భారత సైన్యాన్ని కించపర్చేలా వ్యాఖ్యానించాడు. అనుచిత




పదజాలంతో భారత్‌పై అక్కసు వెళ్లగక్కాడు. అఫ్రిదీ వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పహల్గాం దాడికి పాక్ సీమాంతర ఉగ్రవాదమే కారణమన్న భారత్.. దాయాదితో దౌత్య సంబంధాలకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. అప్పటినుంచి పాక్ మంత్రులు, నేతలతో పాటు అక్కడి మీడియా కూడా మనపై అక్కసు వెళ్లగక్కుతోంది. భారత సైన్యానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తోంది. ఇదిలాఉంటే.. 1971లో తూర్పు పాకిస్థాన్‌లో మొదలైన స్వాతంత్ర్య పోరు భారత్-పాక్ మధ్య యుద్ధానికి దారితీసింది. భారత్ సైన్యం పాక్‌ను ఓడించి, స్వతంత్ర బంగ్లాదేశ్ ఏర్పాటుకు సహకరించింది. ఆ విజయానికి గుర్తుగా ఏటా డిసెంబర్ 16న విజయ్ దివస్‌ను నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో భారత ఆర్మీ చీఫ్‌గా ఉన్న ఫీల్డ్ మార్షల్ మానెక్ షా పటిష్ట వ్యూహ రచన జరిపి, విజయాన్ని భారత్ పరం చేశారు. 'మీరు లొంగిపోండి లేకపోతే తుడిచిపెట్టేస్తాం' అని డిసెంబర్ 13, 1971న మానెక్ షా పాకిస్థాన్‌కు గట్టి సందేశం ఇచ్చారు. ఆ ఒక్క హెచ్చరికతో 93వేల మందికి పైగా పాక్ బలగాలు భారత్ ముందు లొంగిపోయాయి. దానిని ఉద్దేశించే బిధూరి కౌంటర్ ఇచ్చారు.



## ఇజ్రాయెల్‌లో భీకర కార్చిచ్చు..

### జెరూసలెంను అలముకున్న పొగ

**ఇజ్రాయెల్ :** ఇజ్రాయెల్‌లో భీకర కార్చిచ్చు చెలరేగింది. జెరూసలెం శివారులోని అడవుల్లో మంటలు ఎగసిపడుతున్నాయి. ఆ నగరంలో దట్టమైన పొగ అలముకుంది. దీంతో దేశంలో అత్యవసర పరిస్థితి ఏర్పడింది. 24 గంటల్లో వేలాది మంది స్థానికులను అధికారులు సురక్షిత ప్రాంతానికి తరలించారు. దేశ చరిత్రలో అతిపెద్ద అగ్ని ప్రమాదాల్లో ఒకటిగా దీనిని అధికారులు అభివర్ణిస్తున్నారు. కార్చిచ్చు కారణంగా 13 మంది గాయపడ్డారు. అయితే ప్రాణనష్టం ఇంకా తెలియరాలేదు. ప్రస్తుతం ఈ కార్చిచ్చు దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. వాతావరణం పొడిగా ఉండటం, బలమైన గాలుల వల్ల ఈ మంటలు వేగంగా వ్యాపిస్తున్నాయి. ఈ అగ్ని కీలలు జెరూసలెం నగరానికి చేరుకోవచ్చని ప్రధాని బెంజమిన్ నెతన్యాహు హెచ్చరించారు. ఇది జాతీయ అత్యవసర పరిస్థితి అని అన్నారు. జెరూసలెంను రక్షించుకోవడం ప్రస్తుత ప్రాధాన్యం అని పిలుపునిచ్చారు. టెల్ అవీవ్, జెరూసలెంను కలిపే రోడ్డుని మూసివేశారు. రహదారులు మొత్తం దట్టమైన పొగ కమ్ముకుంది. రోడ్డు మార్గంలో మంటలు చుట్టుముట్టడంతో, పలువురు తమ వాహనాలు విడిచిపెట్టి పరిగెడుతున్న దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. సహాయక చర్యల కోసం సైన్యం కూడా రంగంలోకి దిగింది. అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నారు. ఇప్పటివరకు 23 మందికి చికిత్స అందిందని, 13 మంది కాలిన గాయాలతో చికిత్స తీసుకుంటున్నారని అధికారులు వెల్లడించారు.




## ఎట్టకేలకు ఖనిజాల ఒప్పందంపై సంతకం చేసిన ఉక్రెయిన్-అమెరికా

**వాషింగ్టన్:** ఉక్రెయిన్-అమెరికా మధ్య ఎట్టకేలకు అరుదైన ఖనిజాల తవ్వకాల ఒప్పందం కుదిరింది. యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బీసెంట్, ఉక్రెయిన్ ఫస్ట్ డిప్యూటీ ప్రధాని యులియా సిర్దెంకో ఈ ఒప్పందంపై సంతకం చేశారు. దీంతో ఉక్రెయిన్‌లో అరుదైన సహజ వనరులు అయిన అల్యూమినియం, గ్రాఫైట్, చమురు, సహజ వాయువు, ఇతర ఖనిజాలను తవ్వుకునేందుకు అమెరికాకు అనుమతి లభించినట్లైంది. ఈ ఒప్పందం కుదరడం వల్ల ఉక్రెయిన్‌లో అమెరికా సంయుక్త నిధిని ఏర్పాటు చేయనుంది. ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి చేపట్టాల్సిన పలు అభివృద్ధి ప్రాజెక్టుల్లో యూఎస్ పెట్టుబడిదారులకు ప్రాధాన్యత లభించనుంది. ఈ ఒప్పందం కుదరడంపై అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఎక్స్‌లో పోస్టు చేసింది. "ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి కావాల్సిన ఉమ్మడి పెట్టుబడి నిధిని స్థాపించడానికి ఉక్రెయిన్, అమెరికాలు సంతకం చేశాయి. స్వేచ్ఛాయుత, సార్వభౌమ, సంపన్నమైన ఉక్రెయిన్ కోసం ట్రంప్ నిబద్ధతను ఈ చరిత్రాత్మక ఆర్థిక భాగస్వామ్యం సూచిస్తుంది" అని తెలిపింది. రష్యా- ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ముగించేందుకు తాము చొరవ తీసుకుంటామని, అందుకు బదులుగా ఉక్రెయిన్‌లో ఖనిజాల తవ్వకానికి తమను అనుమతించాలని యూఎస్ అధ్యక్షుడు ట్రంప్ గతంలో ప్రతిపాదించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఈ ఒప్పందంపై ఇరుదేశాలు సంతకం చేయాల్సి ఉండగా, ఓవల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ట్రంప్, జెలెన్‌స్కీ మధ్య మీడియా ముందే మాటల యుద్ధం జరిగింది. దీంతో అప్పటినుంచి ఇది అలాగే ఉండిపోయింది. అయితే ఈ ఒప్పందం కోసం ఇరుదేశాలు చాలా రోజులుగా తెరవెనుక ప్రయత్నాలు సాగించాయి. ఎట్టకేలకు ఇరుపక్షాలు అంగీకరించాయి.

## పహల్గాం దాడితో ఉగ్ర గురువుకు నాలుగింతల భద్రత

**పాక్ :** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి వెనక లష్కరే తోయిబా కుట్ర ఉందనే అనుమానాలు మరింత బలపడుతున్నాయి. ఈ దాడి తర్వాత నుంచి లష్కరే చీఫ్, మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది హాఫీజ్ సయీద్‌కు పాక్ ప్రభుత్వం అమాంతం భద్రత పెంచడమే ఇందుక్కారణం..! గతంతో పోలిస్తే అతడి భద్రతను నాలుగింతలు



పెంచినట్లు తెలుస్తోంది. ఈమేరకు పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. లాహోర్‌లోని అత్యంత రద్దీగా ఉండే నివాస సముదాయాల నడుమ హాఫీజ్ సయీద్ నివసిస్తున్నట్లు ఇటీవల కథనాలు వెలువడిన సంగతి తెలిసిందే. అతడి ఇంటి చుట్టూ పాక్ ఆర్మీ, ఐఎస్ఐ, లష్కరే ముఠా నిరంతరం పహారా కాస్తున్నట్లు తాజా సమాచారం. దీంతోపాటు కాంపౌండ్ చుట్టూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా డ్రోన్లతో నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. ఇక, హాఫీజ్ ఇంటికి నలువైపులా 4 కిలోమీటర్ల పరిధిలో అత్యాధునిక సీసీటీవీ కెమెరాలను అమర్చారట..! లష్కరే చీఫ్ ఇంటి సమీపంలోకి సామాన్య పౌరులెవరినీ అనుమతించడం లేదని సదరు కథనాలు పేర్కొన్నాయి. ఈ ప్రాంతంలో ఆర్మీకి చెందినవి కాకుండా.. ఇతర డ్రోన్లపై నిషేధం విధించినట్లు సమాచారం. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడింది 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)' ముష్కరులే అయినా.. దీనికి కర్త, కర్మ, క్రియ మాత్రం హాఫీజ్ సయీదేనని భారత నిఘా వర్గాలు ఇప్పటికే అనుమానిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అతడిని లక్ష్యంగా చేసుకొని దాడులు జరగొచ్చన్న అంచనాలతో లష్కరే చీఫ్‌కు పాక్ భద్రత పెంచడం గమనార్హం.

### గతానికి భిన్నంగా.. జనావాసాల్లోనే

గతంలో అల్‌ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్ పాక్‌లో అబోట్టాబాద్‌లోని ఓ రహస్య ప్రాంతంలో తలదాచుకున్నాడు. అది జనావాసాలకు దూరంగా ఉండటంతో అమెరికా దాడులు చేసేందుకు సులువైంది. ఇక మసూద్ అజార్ వంటి ఉగ్రనేతలు కూడా బవహల్‌పూర్ పర్వతాల్లో దాక్కొని అక్కడినుంచే కార్యకలాపాలను సాగిస్తున్నారు. కానీ, వారికి భిన్నంగా హాఫీజ్ సయీద్ జనావాసాల మధ్య ఉంటున్నాడు. దీంతో సామాన్య పౌరులకు నష్టం వాటిల్లుతుందనే ఉద్దేశంతో దాడులకు వెనకడుగు వేయొచ్చనేది పాక్ కుటిల యోచనగా తెలుస్తోంది.




# ముంబయి డబుల్ హ్యాట్రిక్

## రాజస్థాన్ ఇంటికి


**జైపూర్:** ఐపీఎల్ 18 సీజన్‌లో ముంబయి ఇండియన్స్ వరుసగా ఆరో విజయం సాధించి డబుల్ హ్యాట్రిక్ కొట్టింది. రాజస్థాన్ రాయల్స్‌ను వారి సొంత గడ్డపై 100 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 217 పరుగుల స్కోరు చేసింది. ఈ భారీ లక్ష్యఛేదనలో రాజస్థాన్ 16.1 ఓవర్లలోనే 117 పరుగులకు ఆలౌటైంది. ముంబయి బౌలర్ల ధాటికి రాజస్థాన్ బ్యాటర్లు వరుసగా పెవిలియన్ బాటపట్టారు. జోఫ్రా ఆర్చర్ (30) టాప్ స్కోరర్. యశస్వి జైస్వాల్ (13), రియాన్ పరాగ్ (16), ధ్రువ్ జురెల్ (11), శుభమ్ దూబె (15), నితీష్ రాణా (9) పరుగులు చేసి వెనుదిరిగారు. గత మ్యాచ్ సెంచరీ హీరో వైభవ్ సూర్యవంశీ ఈ సారి పరుగుల ఖాతా తెరవలేదు. హెట్‌మయర్ కూడా డకౌటయ్యాడు. హెట్‌మయర్ పోరాడకుంటే రాజస్థాన్ 100లోపే ఆలౌటయ్యేది. ముంబయి బౌలర్లలో కర్ణ్ శర్మ 3, ట్రెంట్ బౌల్ట్ 3, జస్‌ప్రీత్ బుమ్రా 2, దీపక్ చాహర్, హార్దిక్ పాండ్య ఒక్కో వికెట్ పడగొట్టారు. 11 మ్యాచ్‌ల్లో ఎనిమిదో ఓటమిని చవిచూసిన రాజస్థాన్ అధికారికంగా ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ మ్యాచ్‌లో భారీ విజయం అందుకున్న ముంబయి (14) పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. జైపూర్‌లో ముంబయి 12 ఏళ్ల తర్వాత గెలవడం విశేషం. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ముంబయికి ఓపెనర్లు రికెల్టన్ (61, 38 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), రోహిత్ శర్మ (53, 36 బంతుల్లో 9 ఫోర్లు) అర్ధ శతకాలు బాది శుభారంభం అందించారు. ఈ జోడీ తొలి వికెట్‌కు 116 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. ఎడాపెడా బౌండరీలు బాదుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఈ క్రమంలో 11 ఓవర్లకు 108కి చేరింది. తీక్షణ వేసిన తర్వాతి ఓవర్‌లో రికెల్టన్ క్లీన్‌బౌల్డ్ కాగా.. రియాన్ పరాగ్ వేసిన 13 ఓవర్‌లో జైస్వాల్‌కు క్యాచ్ ఇచ్చిన రోహిత్ పెవిలియన్ చేరాడు. తర్వాత వచ్చిన సూర్యకుమార్ యాదవ్ (48, 23 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), హార్దిక్ పాండ్య (48, 23 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగడంతో ముంబయి భారీ స్కోరు సాధించింది. ఫజల్ హక్ ఫారూఖీ వేసిన 18 ఓవర్‌లో హార్దిక్ మూడు ఫోర్లు, ఒక సిక్స్ బాదాడు.

## అత్యుత్తమంగా బౌలింగ్ చేయడానికి ప్రయత్నించా : చాహల్



ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా మంగళవారం చెన్నై సూపర్ కింగ్స్, పంజాబ్ కింగ్స్ తలపడ్డా యి. ఈ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. చాహల్ హ్యాట్రిక్ సాధించి ఈ విజయంలో ప్రముఖ పాత్ర పోషించాడు. బౌలింగ్‌లో తాను రాణించడానికి కారణం ఏంటో అతడు వివరించాడు. పేస్ బౌలర్లు సంధించిన స్లో బంతులను గమనించిన తర్వాత తన లైన్‌లో మార్పులు చేసుకున్నట్లు అతడు తెలిపాడు. ఈ మ్యాచ్‌లో 19వ ఓవర్లో రెండో బంతికి చాహల్ మొదట ఎంఎస్ ధోనీని (11) పెవిలియన్ బాట పట్టించాడు. తర్వాత నాలుగో బంతికి దీపక్ హుడా (2), అయిదో బంతికి అన్షుల్ కాంబోజ్ (0), ఆరో బంతికి నూర్ అహ్మద్ (0)ను ఔట్ చేసి హ్యాట్రిక్ సాధించాడు. ఈ సీజన్‌లో ఏ బౌలర్‌కైనా ఇదే తొలి హ్యాట్రిక్. మొత్తంగా చాహల్‌కిది రెండోది కావడం విశేషం. 'పేసర్లు తమ కోటా పూర్తి చేసుకున్న తర్వాత నాకు 19 లేదా 20వ ఓవర్ బౌలింగ్ చేయడానికి అవకాశం వస్తుందని భావించా. దానికి అనుగుణంగా నన్ను నేను సిద్ధం చేసుకున్నా. పేసర్లు వేసిన స్లో బంతులను గమనించా. అవి పిచ్‌ను తాకిన తర్వాత బ్యాట్ మీదకు సరిగా రావడం లేదు. నెమ్మదిగా ఆగి వస్తున్నాయి. ఆ బంతులను పరిశీలించిన తర్వాత నేను ఏ లైన్‌లో బౌలింగ్ చేయాలో ఓ అంచనాకు వచ్చా. ముందైతే నేను హ్యాట్రిక్ గురించి ఆలోచించలేదు. బౌలింగ్‌లో నా బెస్ట్ ఇవ్వడానికి ప్రయత్నించా' అని చాహల్ మ్యాచ్ అనంతరం తన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌తో ఐపీఎల్ వెబ్‌సైట్‌లో పోస్ట్ చేసిన ఓ వీడియోలో మాట్లాడాడు. 'క్రీజులో మహీభాయ్ ఉన్నాడని నాకు తెలుసు. మరో ఎండ్‌లో శివమ్ దూబే ఉన్నాడు. నేను ఎలా అయినా సరే.. నా ఓవర్లో వికెట్ సాధించాలని అనుకున్నా. వాళ్లు నా బౌలింగ్‌లో సిక్స్‌లు కొడతారా అని ఆలోచించలేదు. నేను అత్యుత్తమంగా బౌలింగ్ చేయాలని మాత్రమే చూశా' అని వివరించాడు.

## అర్షద్ నదీమ్ ఇన్‌స్టా ఖాతా భారత్‌లో బ్లాక్



పహల్గాం ఉగ్రదాడి ఘటన తర్వాత భారత్–పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తత మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో పాక్‌కు సంబంధించి యూట్యూబ్ ఛానల్స్ ఇతర సోషల్ మీడియా ఖాతాలను మన దేశంలో బ్లాక్ చేసిన భారత్.. తాజాగా మరో క్రీడాకారుడి ఖాతాపై చర్యలు చేపట్టింది. ఆ దేశ అథ్లెట్ అర్షద్ నదీమ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను భారత్‌లో నిలిపివేసింది. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు 26 మంది ప్రాణాలు బలిగొన్న సంగతి తెలిసిందే. దీంతో పాక్‌పై ప్రతీకారం తీర్చుకునేందుకు భారత్ ఎదురుచూస్తోంది. ఇందులోభాగంగా ఇప్పటికే ఆ దేశ యూట్యూబర్ హనియా ఆమిర్‌తో పాటు పలువురు క్రీడాకారుల సామాజిక మాధ్యమ ఖాతాలను బ్లాక్ చేసింది. తాజాగా నదీమ్ ఇన్‌స్టా ఖాతాలను నిలిపివేసింది. పారిస్ ఒలింపిక్స్ లో అథ్లెట్ అర్షద్ నదీమ్ సత్తా చాటిన సంగతి తెలిసిందే. జావెలిన్ త్రోలో 92.97 మీటర్లు విసిరి స్వర్ణం సాధించాడు. కాగా.. ఉగ్రదాడి ఘటన తర్వాత పాకిస్థాన్‌తో భారత్ సంబంధాలు దెబ్బతిన్నాయి. దేశం విడిచి వెళ్లిపోవాలని పాక్ జాతీయులకు భారత ప్రభుత్వం ఆంక్షలు విధించింది. అందుకు గడవు కూడా విధించింది. ఇప్పటివరకు 780కి పైగా దేశం విడిచి వెళ్లిపోయారు. వారిలో 55 మంది దౌత్యాధికారులు, వారి డిపెండెంట్లు, సహాయక సిబ్బంది, 8 మంది పాకిస్థాన్ వీసాలు ఉన్న భారతీయులున్నారు.



## జీఎస్టీ వసూళ్లలో ఆల్‌టైమ్ రికార్డ్

**ఢిల్లీ:** వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లలో సరికొత్త రికార్డు నమోదైంది. ఏప్రిల్ నెలలో రూ.2.37 లక్షల కోట్లు జీఎస్టీ రూపంలో వసూలైనట్లు కేంద్రం గురువారం వెల్లడించింది. గతేడాది ఏప్రిల్ నెలలో ఈ మొత్తంగా రూ.2.10 లక్షల కోట్లుగా ఉంది. ఇప్పటి వరకు ఇదే అత్యధికం కాగా.. తాజాగా ఆ రికార్డు బద్దలైంది. 2017 జులై 1 నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత అత్యధిక వసూళ్లు నమోదైన నెలగా 2025 ఏప్రిల్ నిలిచింది. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే జీఎస్టీ వసూళ్లు 12.6 శాతం మేర పెరగడం విశేషం. అంతకుముందు నెలలో (మార్చి) జీఎస్టీ వసూళ్లు 1.96 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఏప్రిల్ నెల మొత్తం వసూళ్లలో దేశీయ లావాదేవీల ద్వారా రూ.1.9 లక్షల కోట్లు వసూళ్లు జరిగాయి. గతేడాదితో పోలిస్తే ఈ మొత్తం 10.7 శాతం మేర పెరిగింది. దిగుమతైన వస్తువులపై వేసే జీఎస్టీ ద్వారా వచ్చే ఆదాయం 20.8 శాతం మేర పెరిగి రూ.46,913 కోట్లకు పెరిగింది. రూ.27,341 కోట్ల రిఫండ్లు జారీ అనంతరం నికర జీఎస్టీ వసూళ్లు 9.1 శాతం వృద్ధితో రూ.2.09 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

## కమర్షియల్ సిలిండర్ ధర తగ్గింపు..

### ఏటీఎఫ్‌లోనూ కోత



హోటళ్లు, రెస్టరంట్లలో వినియోగించే కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర తగ్గింది. ఒక్కో సిలిండర్‌పై రూ.14.50 తగ్గిస్తున్నట్లు ప్రభుత్వరంగ చమురు కంపెనీలు ప్రకటించాయి. అంతర్జాతీయ చమురు ధరలకు అనుగుణంగా ఈ సవరణ చేపట్టాయి. ఇంట్లో వినియోగించే సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పూ లేదు. మరోవైపు విమాన ఇంధన ధరలనూ చమురు కంపెనీలు తగ్గించాయి. దేశ రాజధాని దిల్లీలో కిలో లీటరుకు 4.4 శాతం మేర తగ్గించాయి. అంటే రూ.3,954 మేర తగ్గింది. దీంతో కిలోలీటర్ 85,486.80కు దిగొచ్చింది. ఏప్రిల్ 1న కూడా ఏటీఎఫ్ ధరల్ని 6.15 శాతం (రూ.5,870) మేర చమురు కంపెనీలు తగ్గించాయి. ఏటీఎఫ్ ధరలు తగ్గడం వరుసగా ఇది రెండోసారి. తగ్గిన ధరలతో ఆ మేర విమానయాన సంస్థలకు ప్రయోజనం చేకూరనుంది.

# టెస్లాకు కొత్త సీఈవో..

## స్పందించిన ఎలాన్ మస్క్



ట్రంప్ ప్రభుత్వంలో కీలకంగా మారిన ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్‌ను టెస్లా సీఈఓ బాధ్యతల నుంచి తప్పించాలని కంపెనీ బోర్డు భావిస్తోంది. కొత్త వ్యక్తి నియామకం కోసం ఇప్పటికే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం. సంబంధిత వ్యక్తులు ఈ విషయాన్ని వెల్లడించినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ తన కథనంలో పేర్కొంది. ఎలక్ట్రిక్ వాహనాలు, అంతరిక్షం, సాంకేతిక రంగాల్లో దిగ్గజ వ్యాపారవేత్తగా ఎదిగిన ఎలాన్ మస్క్ ట్రంప్ ప్రభుత్వంలో సంస్కరణల కోసం ఏర్పాటుచేసిన 'డోజ్' సారథిగా పని చేస్తున్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం కోసం శ్రమించిన టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌కు కీలక పదవి దక్కింది. అయితే ట్రంప్ పరిపాలనలో మస్క్ అధిక ప్రమేయం ఉందనే వాదనలతో పెద్దఎత్తున విమర్శలు ఎదుర్కొన్నారు. ఫెడరల్ ఉద్యోగులను తొలగిస్తూ ట్రంప్ చాలా కఠిన నిర్ణయాలు తీసుకున్నారని, ఇందులో మస్క్ కీలక పాత్ర పోషించారని విమర్శలు వచ్చాయి. రాజకీయాల్లో అధిక జోక్యంతో ఈ కుబేరుడు తన వ్యాపారాలను పట్టించుకోవడం లేదని పెట్టుబడిదారులపై ఆందోళనలు ఎక్కువయ్యాయి. ఫలితంగా టెస్లా విక్రయాలు గణనీయంగా తగ్గాయి. ఈనేపథ్యంలో మస్క్‌ను తప్పించి వేరొకరికి ఆ బాధ్యతలు అప్పగించాలని బోర్డు సభ్యులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. టెస్లా ప్రస్తుత సంవత్సరం మొదటి త్రైమాసిక ఫలితాల్లో పెద్దఎత్తున నష్టాల్ని మూటగట్టుకుంది. లాభంలో 71 శాతం క్షీణత నమోదు చేసుకుంది. టెస్లా ఆదాయవ్యవహారాలపై నిర్వహించిన సమావేశంలో కీలక ప్రకటన చేసినట్లు తెలుస్తోంది. ట్రంప్ పరిపాలనకు తాను కేటాయించే సమయాన్ని గణనీయంగా తగ్గించుకుంటానని, తన కంపెనీలు నడిపేందుకు ఎక్కువ సమయం కేటాయిస్తానని మస్క్ తెలిపినట్లు సమాచారం.

**ఖండించిన మస్క్..**

టెస్లా సంస్థకు వేరొక సీఈఓను నియమించాలని బోర్డు భావిస్తోందని, అందుకు ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని వాల్‌స్ట్రీట్ జర్నల్ ప్రచురించిన కథనాన్ని ఎలాన్ మస్క్ 'ఎక్స్' వేదికగా ఖండించారు. ఆ వార్తలను కొట్టిపారేశారు. తప్పుడు కథనాలు ప్రచురిస్తూ.. పత్రిక విలువల ఉల్లంఘనలకు పాల్పడుతోందని సోషల్‌మీడియా వేదికగా మండిపడ్డారు.

## మా కోడింగ్ పనంతా కృత్రిమ మేధదే : జుకర్‌బర్గ్



కృత్రిమ మేధ టెక్ ప్రపంచంలో సంచలనాలు సృష్టిస్తోంది. దీని వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. సర్వం ఏఐమయమౌవుతుందన్న వాదనల నేపథ్యంలో ఈ సాంకేతికతపై మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మరో 18 నెలల్లో తమ కంపెనీకి చెందిన కోడింగ్ కృత్రిమ మేధనే చేస్తుందన్నారు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న జుకర్‌బర్గ్ మెటాలో కృత్రిమ మేధ పాత్ర గురించి మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇప్పటికే ఓ బృందంలో సభ్యుడిగా విధులు నిర్వహిస్తోందన్నారు. త్వరలోనే టాప్ కోడర్ల కంటే ఏఐ మెరుగ్గా పనిచేస్తుందంటూ వ్యాఖ్యానించారు. మీరు ఏదైనా లక్ష్యాన్ని ఇస్తే.. ఏఐ ఆ పనిని సమర్థవంతంగా నిర్వహిస్తుం దన్నారు. బగ్‌లను కనుగొంటూ, అధిక- నాణ్యత కోడ్‌ను స్వతంత్రంగా రాయగలదని జుకర్‌బర్గ్ భావించారు. రానున్న 12-18 నెలల్లో తమ కంపెనీకి చెందిన లామా ప్రాజెక్ట్‌కు సంబంధించి చాలావరకు కోడింగ్‌ను ఏఐయే పూర్తిచేస్తుందని జుకర్‌బర్గ్ అభిప్రాయపడ్డారు. ప్రముఖ టెక్ దిగ్గజాలు ఏఐపై ఇదే అభిప్రాయాల్ని వ్యక్తంచేస్తూ వచ్చారు. తాజాగా మెటా లామా ఏఐ డెవలపర్ కార్యక్రమంలో పాల్గొన్న మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల తమ కంపెనీకి సంబంధించి 20 నుంచి 30 శాతం కోడ్‌ను కృత్రిమ మేధతోనే సృష్టిస్తున్నట్లు తెలిపారు. నాణ్యత కోసం ఏఐ ఆధారిత టూల్స్‌పై ఆధారపడటం పెరుగుతోందన్నారు. గూగుల్ తన సాఫ్ట్‌వేర్ కోడ్‌ను రూపొందించడానికి కృత్రిమ మేధపై ఎక్కువగా ఆధారపడుతోందని కంపెనీ సీఈఓ సుందర్ పిచాయ్ ఇప్పటికే వెల్లడించారు. జనరేట్ చేసిన కోడ్‌ను ఇంజినీర్లు రివ్యూ చేస్తున్నప్పటికీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం పెరిగిందన్నారు.

## కవాసకి వెర్సిస్ 2025 విడుదల..



జపాన్‌కు చెందిన ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ కవాసకి భారత మార్కెట్‌లోకి వెర్సిస్ 650 2025 మోడల్‌ను విడుదల చేసింది. ఈ అడ్వెంచర్ టూరింగ్ మోటార్ సైకిల్ ధరను రూ.7.93 లక్షలు (ఎక్స్‌షో రూమ్)గా నిర్ణయిం చింది. కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఓబీడీ–2బి ఉద్గార ప్రమాణాలతో దీన్ని తీసుకొచ్చారు. 2024 మోడల్‌తో పోలిస్తే దీని ధర రూ.16వేలు అధికం. ప్రస్తుతం పాత మోడల్‌ను రూ.30 వేల వరకు డిస్కౌంట్‌కు విక్రయిస్తున్నారు. ఇక బైక్ వివరాల్లోకి వెళితే.. కవాసకి వెర్సిస్ కొత్త రంగులు మినహా డిజైన్ పరంగా పెద్దగా మార్పులు చేయలేదు. ఈ మోటార్ సైకిల్ 649 సీసీ లిక్విడ్ కూల్డ్ ప్యారలల్ ట్విన్ ఇంజిన్‌తో వస్తోంది. ఇది 8500 ఆర్‌పీఎం వద్ద 66 హెచ్‌పీ పవర్‌ను, 7000 ఆర్‌పీఎం వద్ద 61 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 6–స్పీడ్ గేర్ బాక్స్ ఉంది. ఈ మోటార్ సైకిల్ బరువు 218 కేజీలు. ముందువైపు 300 ఎంఎం డిస్క్, వెనకవైపు 250 ఎంఎం డిస్క్ బ్రేక్ ఉన్నాయి. దీని ఫ్యూయల్ ట్యాంక్ కెపాసిటీ 21 లీటర్లు. మార్కెట్‌లో ప్రస్తుతం ట్రయంఫ్ టైగర్ స్పోర్ట్ 660కి గట్టి పోటీనిస్తుంది. అయితే, ట్రయంఫ్ టైగర్ స్పోర్ట్ ధర రూ.9.45 లక్షలుగా ఉంది.

## భారీగా దిగొచ్చిన పసిడి ధర..

### రూ.2వేల పైన తగ్గిన బంగారం



**హైదరాబాద్:** అంతర్జాతీయ పరిణామాలతో దేశీయ మార్కెట్‌లో ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరిన బంగారం ధర గత కొన్ని రోజులుగా కాస్త దిగొస్తోంది. గురువారం ఒక్క రోజే 10 గ్రాముల పుత్తడి ధర దాదాపు రూ.2వేల పైన తగ్గింది. నేడు 24 క్యారెట్ల మేలిమి బంగారం ధర రూ.2,180 తగ్గి రూ.95,730 (10 గ్రాములకు) పలుకు తోంది. దాదాపు 10 రోజుల్లో పసిడి ధర దాదాపు రూ.5వేల మేర తగ్గింది. అటు అంతర్జాతీయ మార్కెట్‌లోనూ బంగారం ధర కాస్త దిగొచ్చింది. ప్రస్తుతం ఔన్సు ధర 3,236.94 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అమెరికా–చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు కాస్త తగ్గుముఖం పట్టడం, రష్యా–ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందానికి సంకేతాలు కన్పించడం, డాలర్ విలువ బలపడుతుండటంతో పుత్తడికి గిరాకీ తగ్గినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో వరుసగా రెండో రోజు పుత్తడి ధర దిగొచ్చినట్లు పేర్కొంటున్నారు. త్వరలోనే అమెరికా ఆర్థిక గణాంకాలు వెలువడున్నాయి. ఇవి కూడా పసిడి ధరలపై ప్రభావం చూపే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. అక్షయ తృతీయ సందర్భంగా దేశీయ మార్కెట్లో బుధవారం బంగారానికి గిరాకీ పెరిగింది. అక్షయ తృతీయ విక్రయాలు రూ.12,000 కోట్ల విలువైన 12 టన్నుల పసిడి, రూ.4,000 కోట్ల విలువైన వెండి కలిపి మొత్తంగా రూ.16,000 కోట్లుగా ఉండొచ్చని ఆలిండియా జువెలర్స్ అండ్ గోల్డ్‌స్మిత్ అసోసియేషన్ అధ్యక్షుడు పంకజ్ అరోరా వెల్లడించారు.

ఆర్గాన్ న్యూస్
సినిమా / CINEMA
www. organnews.in
organ.today@gmail.com
@organnews

# హిట్-3లో నాని నట విశ్వరూపం

## చీకటి కోణాన్ని ఆవిష్కరించే ప్రయత్నం

రివ్యూ



తెలుగు ప్రేక్షకులకు ఫ్రాంఛైజీ రుచిని 'హిట్' సినిమాలు బలంగా చూపించాయి. నాని కీలక పాత్రలో 'హిట్: ది థర్డ్ కేస్'తో మూడో చిత్రం విడుదలయ్యింది. ప్రచార చిత్రాలు, ఫ్రాంఛైజీపై ఉన్న నమ్మకం ఈ సినిమాపై మరిన్ని అంచనాల్ని పెంచాయి. దర్శకుడు శైలేష్ కొలను మూడో సినిమా తో ఎలాంటి ప్రభావం చూపించాడు. క్రూరత్వం నింపుకొన్న అర్జున్ సర్కార్ అనే పోలీస్ పాత్రలో నాని నటన ఎలా ఉందన్నదే సినిమా కథ. అర్జున్ సర్కార్ (నాని) ఐపీఎస్ అధికారి. జమ్మూకశ్మీర్‌లోని హోమి సైడ్ ఇన్వెస్టిగేటివ్ టీమ్ (హిట్)లో విధులు నిర్వర్తి స్తున్న క్రమంలో క్రూరమైన ఓ హత్య కేసు వెలుగు లోకి వస్తుంది. అది ఎవరు చేశారో పరిశోధిస్తుండగా అచ్చం అదే తరహాలో దేశవ్యాప్తంగా 13 హత్యలు జరిగిన సంగతి వెలుగులోకి వస్తుంది. దీని వెనుక ఓ పెద్ద నెట్‌వర్క్ ఉందని అర్జున్ తెలుసుకుంటాడు. దాన్ని ఛేదించేందుకు బిహార్, గుజరాత్ తదితర ప్రాంతాలకు వెళ్తాడు. ఆ కేస్ కొలిక్కి వచ్చేలోపు అర్జున్ విశాఖకి బదిలీ అవుతాడు. అక్కడికి వచ్చాక కూడా ఈ కేస్‌ని ఛేదించేందుకు ఏం చేశాడు? వరుసగా జరుగుతున్న ఈ హత్యల వెనుక దాగిన చీకటి కోణాలేమిటి? వాటిని చేయిస్తున్నది ఎవరు? ఆయనకీ మృదుల (శ్రీనిధి)కీ మధ్య ఉన్న సంబంధం ఏమిటి? తదితర విషయాల్ని తెరపై ఆవిష్కరించారు. ఫ్రాంఛైజీ వచ్చిన తొలి రెండు 'హిట్' సినిమాల్లో పరిశోధనాత్మక కోణమే ఎక్కువ. మూడో కేసుగా రాసుకున్న ఈ కథలో నేర పరిశోధనతో పాటు–, ఓ చీకటి ప్రపంచాన్నీ ఆవిష్కరించాడు దర్శకుడు. భయపెట్టే ఆ ప్రపంచంలోకి హీరో వెళ్లడం, తను అనుకున్న లక్ష్యాన్ని ఛేదించడం ఇందులో కీలకం. అయితే, ఆ చీకటి ప్రపంచాన్ని చూపించిన విధానంలోనే సమస్యలున్నాయి. నాని సినిమాలో అలాంటి ప్రపంచాన్ని చూడటం కాస్త ఇబ్బందిగా అనిపిస్తుంది. సమాజంలో హింసాత్మక ఆలోచనల్ని మరింతగా ప్రేరేపించినట్టుగా ఉండే ఈ చీకటి కోణం, రక్తం ఏరులై పారే సన్నివేశాలు సున్నిత మనస్తత్వమున్న ప్రేక్షకులకు మింగుడు పడవు. నిజంగా మన చుట్టూ ఉన్న మనుషులకి ఇలాంటి ఆలోచనలు వస్తే ఏమిటనే భయాన్ని పెంచుతుందీ చిత్రం. పలు హాలీవుడ్ చిత్రాల్ని గుర్తు చేసే ఈ కథ, నేపథ్యం... ఓ మంచి క్రైమ్ థ్రిల్లర్ అనుభూతినైతే పంచుతుంది. కథ, కథనాలు చాలావరకూ ఊహకు తగ్గట్టుగా సాగినా నాని నటన, ఆయన పోషించిన అర్జున్ సర్కార్ పాత్ర సినిమాని నిలబెడతాయి. సీటీకే ప్రపంచం ఒకటి ఉందని హీరో కనిపెట్టే సన్నివేశాలు సినిమాకి కీలకం. పద్మవ్యూహంలాంటి ఆ ప్రపంచం లోకి హీరో అడుగు పెట్టడం, అక్కడ చేసే పోరాటం ద్వితీయార్థంలో కీలకం. ఓ గేమ్ తరహాలో సాగే యాక్షన్ ఘట్టాలు సినిమాకి హైలైట్. నాని తనలోని పతాక స్థాయి నటనను ఆవిష్కరించాడు. చాలాసార్లు నాని వన్ మ్యాన్ షో చేశాడు. అర్జున్ సర్కార్ పాత్రలో ఆయన ఒదిగిన తీరు, గాఢతతో కూడిన ఆయన నటన, పోరాట ఘట్టాలు ఈ సినిమాకి హైలైట్. కథానాయిక శ్రీనిధి శెట్టి పాత్రలోనూ బలం ఉంది. ప్రతినాయకుడిగా ప్రతీక్ బబ్బర్ నటన మెప్పించినా, విలనిజం హీరోకి సవాల్ విసిరేలా ఉండదు. సముద్రఖని, కోమలి ప్రసాద్ అలవాటైన పాత్రల్లోనే కనిపిస్తారు. పతాక సన్నివేశాల్లో పలువురు నటుల మెరుపులు సినిమాకి ప్రధాన ఆకర్షణ.



# వేవ్స్ సమ్మిట్‌లో ఒక్కటైన తారలు

నాలుగు రోజులపాటు ప్రతిష్ఠాత్మకంగా వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ –వేవ్స్ ముంబై వేదికగా జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో అట్టహాసంగా ప్రారంభమైంది. 'కనెక్టింగ్ క్రియేటర్స్.. కనెక్టింగ్ కంట్రీస్' అనే ట్యాగ్ లైన్ తో ఈ వేవ్స్ సమ్మిట్ ను నిర్వహిస్తుంది. ఇది మీడియా, వినోద పరిశ్రమలను ఒకచోట చేర్చే నాలుగు రోజుల కార్యక్రమం కాగా, ఆ కార్యక్రమానికి మీడియా, వినోద రంగానికి చెందిన సీఈఓలు, పరిశ్రమలకి చెందిన ప్రముఖులు హాజరు అయ్యారు. ఈ సదస్సును ప్రధాని మోదీ గురువారం ప్రారంభించారు. వేవ్స్ అనేది కేవలం ఒక పదం కాదని.. ఇది సంస్కృతి, సృజనాత్మకత, చలనచిత్ర సంగీతం, గేమింగ్, కథ చెప్పడం.. లాంటి కలయిక అంటూ వివరించారు. గత వందేళ్లలో భారతీయ సినిమా ఉన్నత శిఖరాలకి కూడా చేరుకుందని ప్రధాని స్పష్టం చేశారు. ఈ సమ్మిట్‌లో బాలీవుడ్ నటులు అమితాబ్ బచ్చన్,రణ్‌బీర్ కపూర్,దీపికా పదుకొనే, ప్రియాంక చోప్రా, రజనీకాంత్, చిరంజీవి, మోహన్ లాల్ సహా ఇతర ప్రపంచ తారలు పాల్గొన్నారు. అయితే రజనీకాంత్, మోహన్ లాల్, హేమ మాలిని, చిరంజీవి, అక్షయ్ కుమార్, మిథున్ చక్రవర్తి, మోహన్ లాల్ కలిసి ఓ గ్రూప్ ఫొటో దిగారు. ఈ పిక్ ఎంతగానో ఆకట్టుకుంది. చాలా రోజుల తర్వాత ఆ నాటి సీనియర్ హీరోలు అందరు కలిసి ఇలా ఫొటో దిగగా, ఇప్పుడు ఈ పిక్ నెట్టింట వైరల్ అవుతుంది. అలనాటి స్టార్స్ ఇలా ఒకే గ్రూప్ పిక్‌లో చూడడం చాలా ఆనందంగా ఉందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. బుధవారమే చిరంజీవి ఈ కార్యక్రమం కోసం హైదరాబాద్ నుంచి ముంబయి చేరుకున్నారు. ఆయనకి నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. వేవ్స్ సమ్మిట్‌కి చిరు చాలా సింపుల్‌గానే వెళ్లారు.

# ఆచితూచి అడుగులేస్తున్న విశ్వక్‌సేన్



టాలీవుడ్ యంగ్ హీరోలలో మాస్ క దాస్ విశ్వక్ సేన్ వరుస సినిమాలతో బిజీగా ఉన్నాడు. లైలా డిజాస్టర్ తో కాస్త డిస్పాయింట్ అయిన విశ్వక్ సేన్ ఇప్పుడు చేయబోయే సినిమాల పట్ల ఆచి తూచి అడుగులు వేస్తున్నాడు. ఈ సారి ఎలాగైనా సూపర్ హిట్ కొట్టాలని కసితో ఉన్నాడు విశ్వక్ సేన్. బూతు, వల్గారిటీ లేకుండా ఫ్యామిలీ ఆడియెన్స్ ను దృష్టిలో పెట్టు–కుని సినిమాలు చేస్తున్నాడు విశ్వక్. అందులో భాగంగా జాతి రత్నాలు దర్శకుడు కెవి అనుదీప్ తో ఫంకీ అనే చేస్తున్నాడు. సితార ఎం–టె–÷–టంల్గ÷న్మెట్స్ బ్యానర్ పై నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఈ సినిమాతో పాటు మరి కొన్ని కథలు వింటున్న విశ్వక్ సేన్ మరో సినిమాను కూడా లాక్ చేసినట్టు తెలుస్తోంది. ఈ సినిమాకు కల్ట్ అనే –టైటిల్ కూడా రిజిస్టర్ చేసినట్టు సమాచారం. దర్శకుడు తదితర వివరాలు ఏవి తెలియలేదు కానీ ఈ సినిమాను మాజీ మంత్రి శ్రీనివాస యాదవ్ తనయిడు నిర్మిస్తున్నాడని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబందించి ప్రీ ప్రొడక్షన్ వర్క్ పనులు చక చక జరుగుతున్నాయట. మిగిలిన వివరాలను త్వరలో అధికారకంగా ప్రకటించనున్నారు.



# పూజాహెగ్డే యాక్టింగ్‌పై కామెంట్స్..

## మ్యూజిక్ డైరెక్టర్ ఏమన్నారంటే

చెన్నై: సూర్య, పూజాహెగ్డే ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రెట్రో'. కార్తీక్ సుబ్బరాజు దర్శకుడు. గురువారం ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలోనే కార్తిక్ సుబ్బరాజు, చిత్ర సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ అభిమానులతో కలిసి సినిమా వీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇందులో భాగంగా ఓ విలేకరి.. "పూజాహెగ్డే యాక్ట్ చేస్తే ఆ సినిమా ఫ్లాప్ అవుతుందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. దానిపై మీ అభిప్రాయం ఏమిటి?" అని ప్రశ్నించాడు. దీనిపై సంతోష్ నారాయణన్ స్పందిస్తూ.. అది కేవలం వారి ఊహ మాత్రమేనని అందులో ఎలాంటి నిజం లేదని అన్నారు. తమ చిత్రానికి వస్తోన్న రెస్పాన్స్ చూస్తుంటే సంతోషంగా ఉ ందని కార్తీక్ సుబ్బరాజు తెలిపారు. తమ చిత్రాన్ని ఆదరిస్తోన్న ప్రేక్షకులకు ఆయన ధన్యవాదాలు చెప్పారు. తమ చిత్రానికి సంతోష్ నారాయణన్ అందించిన సంగీతం ఒక బలమైందని పేర్కొన్నారు. దర్శకుడిగా కార్తిక్ సుబ్బరాజుకు కోలీవుడ్‌లో మంచి పేరు ఉంది. 'పిజ్జా', 'జిగర్తాండ', 'పేట' వంటి చిత్రాలను ఆయన తెరకెక్కించారు. తొలిసారి ఆయన సూర్యతో కలిసి వర్క్ చేసిన చిత్రమే 'రెట్రో'. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా ఇది సిద్ధమైంది. లవ్.. లాఫ్టర్.. వార్.. ధర్మం.. వంటి విభాగాల్లో ఈ కథను ప్రేక్షకులకు అందించారు. ఇందులో పూజాహెగ్డే రుక్మిణి పాత్రలో నటించారు. అయితే ఈ సినిమాలో భాగం కావడంపై ఆనందం వ్యక్తం చేస్తూ ఆమె తాజాగా ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. ఈ పాత్రలో భాగం కావడాన్ని ఎప్పటికీ గుర్తు పెట్టుకున్నానని అన్నారు. 'మూగముడి' అనే కోలీవుడ్ చిత్రంతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు పూజాహెగ్డే. సుమారు 13 ఏళ్ల కెరీర్‌లో దక్షిణాదితోపాటు హిందీ చిత్రాల్లోనూ ఆమె యాక్ట్ చేశారు. కెరీర్ ఆరంభించింది తమిళంలోనే అయినప్పటికీ ఇప్పటివరకూ అక్కడ ఆమె చేసింది మూడు చిత్రాలు మాత్రమే. 2022లో విడుదలైన 'బీస్ట్'పై ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ చివరకు నిరాశే మిగిలింది. మరోవైపు, ఇటీవల ఆమె నటించిన చిత్రాలు వరుస పరాజయాలు అందుకున్నాయి. ప్రస్తుతం ఆమె చేతిలో 'కూలీ' (స్పెషల్ సాంగ్ అని టాక్), 'జన నాయగన్', 'కాంచన 4' వంటి తమిళ చిత్రాలు ఉన్నాయి.

# 'హిట్ 4' హీరో అతడేనా..?


## అతిథి పాత్రలో మెరిసిన కార్తి



హైదరాబాద్: 'హిట్' యూనివర్స్‌లో భాగంగా విడుదలైన తాజా చిత్రం 'హిట్ 3'. నాని హీరోగా శైలేశ్ కొలను దర్శకత్వం వహించారు. ఇందులో కోలీవుడ్ నటుడు కార్తి అతిథి పాత్రలో నటించారంటూ ఎంతోకాలం నుంచి వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. గురువారం 'హిట్ 3' విడుదల కావడంతో ఆయా వార్తలకు క్లారిటీ లభించింది. కొంతకాలంగా జరుగుతోన్న ప్రచారాన్ని నిజం చేస్తూ సినిమా క్లైమాక్స్ లో కార్తి కనిపించారు. రత్నవేల్ పాండియన్ అనే పోలీస్ అధికారిగా ఆయన స్క్రీన్‌పై కనిపించి ప్రేక్షకులను మెప్పించారు. "దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్" అంటూ శ్రీ గురజాడ అప్పారావు చెప్పిన కవిత్వాన్ని తన స్టైల్‌లో చెబుతూ ఆయన ఎంట్రీ ఇచ్చారు. కార్తి ఎంట్రీకి సంబంధించిన వీడియోలను సోషల్‌మీడియాలో షేర్ చేసిన నెటిజన్లు.. అదిరిందంటూ కామెంట్స్ పెడుతున్నారు.

# సినిమాల కోసం ఆస్తులు అమ్ముకున్నాం

## మూవీ డిజిస్టర్‌పై రకుల్ భర్త జాకీ భగ్నాని ఆవేదన



టాలీవుడ్‌లో ఒకప్పుడు టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన అందాల ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్. తెలుగులో అవకాశాలు తగ్గాక బాలీవుడ్ చెక్కేసింది. అక్కడ ఆడపాదడపా సినిమాలు చేస్తూ తన స్నేహితుడు జాకీ భగ్నానిని వివాహం చేసుకుంది. పెళ్లయ్యాక కూడా వీరి రాత మారడం లేదు. రకుల్ నటిగా మంచి అవకాశాలు అందిపుచ్చుకోలేకపోతుంది. అలానే రకుల్ ప్రీత్ సింగ్ భర్త అయిన జాకీ నిర్మాతగా రాణించలేకపోతున్నారు. ఆయన బాలీవుడ్ అగ్ర నటులు అక్షయ్‌కుమార్, టైగర్ ష్రాఫ్ ప్రధాన పాత్రలలో 'బడే మియా ఛోటే మియా' అనే భారీ బడ్జెట్ చిత్రం నిర్మించారు. గత ఏడాది వేసవిలో విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. అయితే ఈ మూవీ వైఫల్యంపై తాజాగా జాకీ స్పందించారు. ఈ చిత్రం వలన తాము ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని, సినిమా కోసం ఆస్తులు సైతం తాకట్టు పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందని జాకీ స్పష్టం చేశారు. ఇది నాకు జీవితంలో ముఖ్యమైన గుణపాఠం నేర్పింది. ఒక ప్రాజెక్ట్‌ని భారీ స్థాయిలో నిర్మిస్తే సరిపోదని, మూవీ రిలీజ్ అయ్యాక అర్థమైంది. మా కథతో ప్రేక్షకులు ఎందుకు కనెక్ట్ కాలేకపోయారనే దానిపై ఒక్కసారి విశ్లేషించుకోవాలి. ప్రేక్షకుల నిర్ణయం సరైనదే కావచ్చు, వారిని తప్పు పట్టకుండా దీనిని ఒక పాఠంగా స్వీకరించి భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు– జరగకుండా జాగ్రత్త పడాలి అని జాకీ అన్నారు. ఇక ఈ మూవీ కలెక్షన్స్ గురించి మాట్లాడిన ఆయన మేము పెట్టిన పెట్టు–బడిలో 50 శాతం తక్కువే వసూళ్లు వచ్చాయి. ఈ విషయాలు చెప్పడం వలన ఎలాంటి ప్రయోజనం ఉండదు కాని, లాభాలు ఆర్జించాలనే ఉద్దేశంతో చిత్రం తీసాం.కాని అనుకున్న లక్ష్యం చేరుకోలేకపోయాం అని జాకీ భగ్నానీ ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో సైన్స్ ఫిక్షన్ యాక్షన్ ఎంటర్–టైనర్‌గా 'బడే మియా ఛోటే మియా' తెరకెక్కగా, ఇందులో పృథ్వీరాజ్ సుకుమారన్, మానుషి చిల్లర్, అలయ ఎఫ్, సోనాక్షి సిన్హా వంటి తారలు కీలక పాత్రలు పోషించారు.

# ఇలాంటి రోజు వస్తుందని ముందే భయపడ్డా: తాప్సీ



సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ మిషా అగర్వాల్ ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆన్‌లైన్‌లో తనని అనుసరించే వారి సంఖ్య తగ్గిందనే కారణంతోనే ఆమె ఆత్మహత్య చేసుకుందని మిషా కుటుంబసభ్యులు వెల్లడించారు. దీంతో మిషా మృతి వార్త అంతటా తీవ్ర చర్చకు దారితీసింది. దీనిని ఉద్దేశించి బాలీవుడ్ నటి తాప్సీ పన్ను స్పందించారు. ఇలాంటి ఒక రోజు వస్తుందని తాను ముందే భయపడ్డానని అన్నారు. "ప్రస్తుతం సోషల్‌మీడియాపై ప్రతిఒక్కరికి ఉన్న వ్యామోహం చూసి ఇలాంటి రోజు వస్తుందని నేను ఎప్పుడో భయపడ్డా. జీవితాన్ని మనం ప్రేమించడం కంటే ఫాలోవర్స్ సంఖ్యకే ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తామని.. చుట్టూ ఉన్నవారు చూపించే నిజమైన ప్రేమ కంటే ఆన్‌లైన్ ప్రేమకే మొగ్గు చూపుతామని భయపడ్డా. అదేవిధంగా మనం కష్టపడి ఎన్నో ఏళ్లపాటు చదువుకున్న డిగ్రీలను లైకులు, కామెంట్స్ అధిగమిస్తాయని ఊహించా. ఈరోజు ఇలాంటి ఘటనను చూడటం నిజంగా బాధాకరం. నా హృదయం ముక్కలైంది" అని తాప్సీ పోస్ట్ పెట్టారు. మిషా అగర్వాల్ (24) ఏప్రిల్ 24న మృతి చెందింది. ఆమె మరణ వార్తను ఇన్‌స్టా వేదికగా కుటుంబసభ్యులు వెల్లడించారు. 'లా' చదువుకున్న ఆమె కెరీర్‌లో స్థిరపడాలని ఎన్నో కలలు కందని చెప్పారు. "లాయర్ కావాలనుకున్న మిషా.. ఒక దశలో ఇన్‌స్టాగ్రామ్‌పై ఆసక్తి పెంచుకుంది. రీల్స్, పోస్టులతో ఫాలోవర్స్‌ను సొంతం చేసుకుంది. ఫాలోవర్స్ సంఖ్యను ఒక మిలియన్‌కు చేర్చుకోవాలని కలల కంది. ఇటీవల కాలంలో తన ఫాలోవర్స్ క్రమంగా తగ్గుతూ వచ్చారు. ఆ విషయాన్ని తాను జీర్ణించుకోలేకపోయింది. కెరీర్ పరంగా దృష్టిసారించలేకపోయింది. ఆ భయంతోనే ఆత్మహత్య చేసుకుంది" అని కుటుంబసభ్యులు ప్రకటన విడుదల చేశారు.

Edited,Printed, Published and Owned by DHANDYALA RAVI KUMAR, Printed at Gayathri Printers, Plot no: 69 to 75, 4th Line, IDA, Khanapuram, Khammam -507002.Telangana.
EDITOR: DHANDYALA RAVI KUMAR. RNI NO: APTEL/2008/26868. Ph: 9848156178, mail: organ.today@gmail.com , website : www.organnews.in